సాహిత్య
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ

నేటి మీ కపిల్‌చిట్స్‌తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45 years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-11-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 293 పేజీలు: 10+4 వెల: 6.50


ఆదివారం జోహాన్స్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూలాడిసెల్వాతో ప్రధాని మోడీ

## ఎఐ దుర్వినియోగానికి కళ్లెం వేయాలి

### ప్రపంచ శ్రేయస్సుకు కృత్రిమమేధ మంచి సాధనం కావాలి

### జి-20 సదస్సులో ప్రధాని మోడీ

**జోహాన్స్‌బర్గ్, నవంబరు 23:** కృత్రిమ మేధ వినియోగం దుర్వినియోగానికి అడ్డుకట్టవేసే విధంగా ప్రపంచ వ్యాప్తంగా ఏకీకృతి నిఘా వ్యవస్థను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానినరేంద్రమోడీ వ్యాఖ్యానించారు.
జి20 సదస్సులో ఆయన కృత్రిమమేధ, డ్రగ్స్ ఉగ్రలిం కుల కట్టడికే అత్యధికప్రాధాన్యతనిస్తూ ప్రసంగిం చారు. ఈక్రమంలో కృత్రిమమేధదుర్వి నియోగం అవుతున్న తీరును వివరించిన ప్రధాని తక్షణమే అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని సూచించారు. జి20 సదస్సులో మూడో సెషన్‌లో మాట్లాడిన మోడీ టెక్నాలజీ అప్లికేషన్లు ప్రపంచ స్థాయిలో ఉండాలని, జాతీయ స్థాయికి మించి ఉన్నత ప్రమాణాలతో ఉండాలని అందు లోను ఓపెన్‌సోర్స్ విధానంలో >>2


ఆదివారం పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, ఎపి, తెలంగాణ సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, మంత్రి లోకేష్

# నిస్వార్థ సేవల ప్రతిరూపం బాబా

## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 23, ప్రభాతవార్త ప్రతినిధి:** శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవల ప్రతిరూపం భగవాన్ సత్య సాయి బాబా అని భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అభివర్ణించారు. భగవాన్ సత్య సాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమం ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత భారతమాతకు, సత్యసాయి బాబాకు ప్రణామాలు అర్పిస్తున్నానంటూ ప్రసంగాన్ని ఆరంభించిన ఉపరాష్ట్రపతి, వేదికపై ఉన్నతెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డిలకు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేన్ రెడ్డి, మంత్రి నారా లోకేష్, తమిళనాడు మంత్రి శేగరబాబు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లు, సత్యసాయి సంస్థలకు చెందిన నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. తన చిన్నప్పుడు 1964-65 మధ్య తన కుటుంబానికి సాయి బాబా ఆశీస్సులు అందాయని, తమిళం మాత్రమే తెలిసిన తన అత్తయ్య ఒంటరిగా పుట్టపర్తికి వచ్చి 15 రోజులు ఉండి సాయి బాబా ఆశీస్సులు తీసుకురావడం, భగవాన్ >>2

## సత్యసాయి సందేశం యుగయుగాలకు స్ఫూర్తి

### తెలంగాణలోనూ ఆధికారికంగా శతజయంతి వేడుకలు: సిఎం రేవంత్

**పుట్టపర్తి, నవంబరు 23, ప్రభాతవార్త:** "ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుంది" అనే భగవాన్ సత్యసాయి బాబా సందేశం యుగయుగాల ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన శతజయంతి ఉత్సవ సభలో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులతో కలిసి ముఖ్య అతిథిగా >>2

## మానవసేవే మాధవసేవ ఆచరణలో చూపిన సాయి

### కొన్ని కోట్లమంది జీవితాలను ప్రభావితం చేసిన సాయి సందేశం: సిఎం చంద్రబాబు

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబర్ 23, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశాంతి నిలయం ఒక ఎనర్జీ సెంటర్ అని, భగవాన్ సత్యసాయి బాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన నింపిన స్ఫూర్తి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆదివారం భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన శతజయంతి వేడుకలలో సిఎం >>2

# మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనండి

- 2.04 లక్షల టన్నులు సేకరించండి
- ముంబయి, కోల్‌కతా మార్కెట్లలో అరటి విక్రయాలకు చర్యలు తీసుకోండి
- అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం
- పత్తి, మొక్కజొన్న రైతుల్ని ఆదుకోవాలని కేంద్రానికి లేఖ

**విజయవాడ,నవంబరు 23,పభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 2.04 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అధికారుల్ని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రయోగాత్మకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమలో పండిన అరటిని ముంబయి, కోల్‌కతా తదితర ప్రాంతాలకు రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించి, విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి,మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కేంద్రానికి లేఖ రాసినట్లు వివరించారు. అరటి ధరలు, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్‌శాఖల అధికారులతో పుట్టపర్తి నుంచి శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వ హించారు. అరటి కొనుగోళ్ల గురించి రోజూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించండి. డిసెంబరు మొదటివారం నుంచి మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉన్నందున అప్పటి వరకు రైతులు నష్టపోకూడదు. ఎప్పటికప్పుడు అరటిని రవాణా చేసేలా చర్యలు తీసుకోండి. మద్దతు ధర కంటే మొక్క జొన్న తక్కువ పలుకుతున్నందున ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అవకాశాన్ని పరిశీలించండి'అని అధికారులను ఆదేశించారు.
ప్రస్తుతం రాయలసీమలో 40వేల హెక్టార్లలో అరటి, రాష్ట్రవ్యాప్తంగా 1.42 లక్షల హెక్టార్లలో మొక్క జొన్న సాగవుతోందని అధికారులు సిఎం వివరించారు. 8.18లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు.ఇక ప్రస్తుతం ఉన్న ప్రాంతంతో పాటు అదనంగా 1600 హెక్టార్లలో కాఫీ ప్లాంటేషన్ విస్తరించేందుకు ప్రస్తుతంఉన్న ప్రాంతంతో పాటు అదనంగా 1600 హెక్టార్లలో కాఫీ ప్లాంటేషన్ విస్తరించేందుకు ఐటిసి సంస్థ ఐటిడిఎ పాడేరుతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే 4010 హెక్టార్లలో స్థానిక రైతుల సహకార సంస్థతో కలిసి ఐటీసీ కాఫీని సాగుచేస్తోంది. కాఫీ బోర్డు కూడా గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు



విస్తరణ, నాణ్యమైన కాఫీ పంట ఉత్పత్తి, సాగులో సుస్థిర విధానాల అమలు కోసం ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ కల్పించే అంశంపై ఫ్రాంటియర్ మార్కెటింగ్, ఈజీ మార్ట్ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. పసుపు ఉత్పత్తి, వివిధ టర్మరిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్ ను అనుసంధానించటం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎక్విప్ సంస్థ ఐటిడిఎతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీజన్ల వారీగా ఉత్పత్తి అయ్యే అటవీ ఉత్పత్తులను గిరిజన మహిళా సంఘాల ద్వారా విక్రయించేందుకు వీలుగా అవగాహన కల్పించేందుకు ఐఎస్బీ సంస్థ మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. ఇక పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో హోమ్ స్టేలను ఏర్పాటు చేసేందుకు ఓయో హోమ్స్, హోమీ హట్స్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుకోసం మార్పు సొసైటీ కూడా ఎంఓయూ చేసుకుంది. అలాగే ప్రకృతి సేద్యం, మార్కెటింగ్ సదుపాయాలు, జీవనోపాధి తదితర అంశాల్లోనూ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. ఇక >>2

## నకిలీ మద్యం కేసులో డైరీలో చెబుతున్న నిజాలు

### ప్రధాన నిందితుల నుంచి రాబట్టిన వివరాలు

**విజయవాడ, నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో నకిలీ మద్యం కేసులో నిందితులు దగ్గర నుంచి పట్టుబడిన డైరీల నుంచి పలు అంశాలు బయట పడుతున్నాయి. ఎక్సైజ్ అధికార యంత్రాంగం అందించిన సమాచారాన్ని అనుసరించి ఈ కేసులో ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్ధనరావు, ఆయన సోదరుడు జగన్మోహనరావు కస్టడీలో వెల్లడించిన వివరాలకు సంబంధించిన ఆధారాలను సిట్, ఎక్సైజ్ అధికారులు సేకరించినట్టు తెలిసింది. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేయడానికి ఉపయోగించిన ఫార్ములాకు చిత్తూరు జిల్లాకు చెందిన బాలాజీ, అతడి కుమారుడు సుదర్శన్‌కు రూ.2.50 కోట్లకు పైగా డబ్బులు అందినట్టు తేలింది. నకిలీ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న కట్టా రాజు రాసుకున్న డైరీ ద్వారా ఈ లెక్కలు బయటికి వచ్చినట్టు సమాచారం. అద్దేపల్లి సోదరులను సిట్ అధికారులు రెండోసారి నాలుగు రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. ఈ విచారణ శనివారంతో ముగిసింది. ఇంతకుముందు వారం పాటు కస్టడీలో విచారించారు. మొదటిసారి కస్టడీలో సాగిన విచారణకు కొనసాగింపును ఈ నాలుగు రోజుల్లో చేశారు. విచారణ ముగిసిన తర్వాత నిందితులు ఇద్దరినీ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఇంటి ముందు హాజరుపరిచారు. అనంతరం జనార్ధనరావును నెల్లూరు కేంద్ర కారాగారానికి, జగన్మోహనరావును విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.జనార్ధనరావు ఆఫ్రికాకు వెళ్లడానికి ముందు మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి వెళ్లినట్టు మరోసారి స్పష్టం చేశాడు. సిట్, ఎక్సైజ్ అధికారులకు ఈవిధంగానే సమాచారం అందింది. దీన్ని నిర్ధారించేందుకు అధికారులు జోగి ఇంటి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడానికి హార్డ్‌డిస్కును స్వాధీనం చేసుకున్నారు.
దీనికి పాస్‌వర్డ్ ఉండడం వల్ల తెరుచుకోలేదని తెలిసింది. నకిలీ మద్యం తయారీ కేసులో కొద్దిరోజుల క్రితం వెలుగులోకి >>2

## శ్రీకాకుళం జిల్లాలో ఘోర ప్రమాదం

### లారీని ఢీకొన్న ట్రావెల్ వాహనం

### నలుగురు మృతి, ఆరుగురికి గాయాలు

### పూరీ జగన్నాథుని దర్శించి వస్తుండగా ఘటన

**కోటబొమ్మళి (శ్రీకాకుళం జిల్లా), నవంబరు 23 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళి మండలం జాతీయ రహదారిలో ఎత్తురాళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు మృతిచెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకివెళితే మధ్యప్రదేశ్‌కు చెందిన పది >>2

## బంగాళాఖాతంలో వాయుగుండం!

**విజయవాడ, నవంబరు 23, ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో అండమాన్ సమీపంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తర్వాత అదే దిశలో పయనిస్తూ బుధవారం నాటికి మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. ఇది తుపానుగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. తుపానుగా మారితే 'సెన్‌యార్' అని భారత వాతావరణ విభాగం నామకరణం చేయనుంది. ఈ పేరును యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సూచించింది. అయితే, తుపాను తీరందాటే ప్రాంతంపై ఇంకా స్పష్టత రాలేదని నిపుణులు చెబుతు >>2

# గరంగరంగా కల్తీ నెయ్యి కేసు

## 'సిట్' చేతిలో కమిషన్ల బాగోతం

### చిన్న అప్పన్న రిమాండ్ రిపోర్టు కీలకమేనా!

### మాజీ ఇఒ, మాజీ చైర్మన్‌ను మళ్లీ విచారించే యోచన!




**తిరుపతి, నవంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి లడ్డూల తయారీకి అవసరమైన నెయ్యిసరఫరాకు సంబంధించి 2019-24 మధ్యకాలంలో వైఎస్సార్సీ ప్రభుత్వం హయాంలోని వైసిపి టిటిడి బోర్డు కల్తీనెయ్యి సరఫరా చేయించుకుందనేకేసు దర్యాప్తు అంతిమం ఎప్పుడనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. గత ఐదేళ్లలో 1.61కోట్ల కిలోలనెయ్యి టిటిడి కొనుగోలు చేసిందనేది సమాచారం. అందులో 66లక్షల కిలోలు నెయ్యికల్తీనే అనేది సిబిఐ సిట్ అధికారులు సేకరించిన ఆధారాలుగా తెలుస్తోంది. అప్పట్లో నెయ్యి సరపరాకు గాను 250కోట్ల రూపాయలు టిటిడి చెల్లించినట్లు సమాచారం రాబట్టారు. ఆ మొత్తం వ్యవహారంలో లడ్డూల తయారీకి కల్తీ నెయ్యి సరఫరాలో కమీషన్లు ఎవరికి చేరాయనేది ఇప్పుడు రాజకీయంగా వేడెక్కిస్తోంది. టిటిడికి కల్తీనెయ్యి సరఫరానే కాలేదనేది ఇప్పటికే గత ఛైర్మన్ సుబ్బారెడ్డి, గత ఇఒ ఎవి ధర్మారెడ్డి సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలంగా తెలిసింది. అయితే ఈ కేసులో ఇటీవల పదిరోజుల క్రిందట టిటిడి మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డి, తాజాగా మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని సిబిఐ సిట్ అధికారులు కొన్ని సాక్ష్యాధారాలతో సుదీర్ఘంగా విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. సిట్ అధికారుల విచారణలో పరస్పరం ఇద్దరు కీలక వ్యక్తులు విరుద్ధ వాదనలు వినిపించడం, తిరుమల ఆదాయాన్ని పరిరక్షించామని, దుబారా తగ్గించామని, దేవుని ప్రాశస్త్యాన్ని కాపాడమనే వివరణ ఇచ్చారనేది తెలిసింది. దేవుని చెంత భక్తివిశ్వాసాలతో సేవకులుగా పనిచేశామనే వారి వాదనలను సిట్ అధికారులు సులభంగా నమ్మే పరిస్థితి లేకపోయినా తాము కొన్ని నిర్ణయాలు చేసేవారమేనని, అమలుచేసేది అధికారులేననేది ఇద్దరూ వివరించినట్లు సమాచారం. >>2



## రాష్ట్రానికి మరో నాలుగు జాతీయ రహదారులు

### రెండు జాతీయ రహదారుల అనుసంధానం

**విజయవాడ, నవంబరు 23, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో నాలుగు జాతీయరహదారులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి విస్తరణ, నిర్మాణం పనులకు పూర్వరంగం సిద్ధమవుతుంది. ఈ క్రమంలోన రెండు జాతీయ రహదారులను అనుసంధానించేలా అమలాపురంరావులపాలెం హైవే (ఎన్‌హెచ్216ఇ)ను 32 కి.మీ. విస్తరించనున్నారు. కత్తిపూడి-ఒంగోలు హైవేలో అమలాపురంనుంచి రావులపాలెం వద్ద చెన్నై-కోల్‌కతా పాతహైవే (గుండుగొలనుదివాన్‌చెరువు ఎన్‌హెచ్ 216ఎ)ను అనుసంధానిస్తుంది. ఈహైవేను 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసలతో విస్తరించేందుకు రూ.807 కోట్ల అంచనా వ్యయంతో డిపిఆర్ పంపారు. వైఎస్సార్ కడప జిల్లాలోని ముద్దనూరు నుంచి కడప వరకు (ఎన్‌హెచ్716).. 48.36 కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.1,182 కోట్లతో డిపిఆర్‌ను పంపించారు. దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడును అనుసంధానం చేస్తూ నిర్మాణం జరుగుతున్న బెంగళూరు చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే ఇప్పుడు తుదిదశకు చేరుకుంది. ఈహైవే అందుబాటులోకి వస్తే చిత్తూరు జిల్లావాసులు గంటన్నరలోనే బెంగళూరు లేదా చెన్నై చేరుకునే వీలుంటుంది. వి.కోట ప్రాంతం నుంచి అయితే కేవలం గంటలోనే బెంగళూరు చేరుకోవడం సాధ్యమవుతుంది. గరిష్ఠ వేగం గంటకు 120 కి.మీగా నిర్ధారించిన ఈ రహదారి, రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్తఊపునిచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పెడన, విస్సన్నపేట లక్ష్మీపురం, ఆకివీడు దిగమర్రు, అమలాపురం, రావులపాలెం, ముద్దనూరు, కడపమధ్య 243.3 కిమీల విస్తరణకు అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధంచేసి జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్)కు పంపారు. భూసేకరణ, సివిల్ పనులు తదితరాలన్నీ కలిపి ఈ ప్రాజెక్టులకు రూ.9,490 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. వచ్చే మార్చి లోపు అనుమతులు రానున్నట్లు తెలుస్తోంది. అనంతరం భూసేకరణ,టెండర్లప్రక్రియ మొదలవుతాయి. కృష్ణా జిల్లాలోని పెడననుంచి గుడివాడ, నూజివీడు, విస్సన్నపేట మీదుగా తెలంగాణ సరిహద్దులోని లక్ష్మీపురంవరకు జాతీయ రహదారి 216 హెచ్‌ను 118కి.మీ. మేర విస్తరించనున్నారు. రూ.4,245 కోట్లతో డిపిఆర్‌ను సిద్ధంచేసి పంపారు. పెడననుంచి నూజివీడు బైపాస్ >>2

## అమరావతిలో 12 ప్రధాన వాణిజ్య బ్యాంకులు

### శంకుస్థాపన చేయనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**విజయవాడ, నవంబరు 23, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతిలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసే దిశగా నిర్ణయం తీసుకున్న ఎపి ప్రభుత్వం అమరావతిలో ఒకేసారి 12బ్యాంకుల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనుంది. ఇక ఈ కార్యక్రమానికి ఈనెల 28న కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్ రానున్నట్టు సమాచారం. ఆమె చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సంకల్పించింది. గత నెలలో ఈ కార్యక్రమం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. అమరావతిని ఆర్థిక కేంద్రంగా మార్చే ప్లాన్‌లో ఎపి సర్కార్ ఇక ప్రస్తుతం బ్యాంకులకు ఒకేసారి అమరావతిలోని సిఆర్డిఏ ప్రధాన కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదికగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మొత్తం అన్ని బ్యాంకుల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఎపి రాజధాని అమరావతిని ఆర్థిక కేంద్రంగా >>2





ఆదివారం పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధివద్ద అంజలి ఘటిస్తున్న తెలంగాణ, ఎపి ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు

# యుగయుగాలకు స్ఫూర్తి

>> పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. బాబా ప్రజల్లోనే దేవుడిని చూసారని, ప్రేమతో వారిని గెలుచుకున్నారన్నారు. బాబా భౌతికంగా లేకపోయినా, ఆయన ఆలోచనలు, సేవాస్ఫూర్తి ఈ శత జయంతి ఉత్సవాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయనిఅన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, తాగునీరు, ఈ మూడు రంగాల్లో బాబా చేసిన సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణలో పాలమూరు, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం వంటి కరువు ప్రాంతాల్లో, ప్రభుత్వాలు కూడా సాధించలేని తాగునీటి సమస్యలను భగవాన్ సత్యసాయి బాబా ట్రస్ట్ పరిష్కరించిందన్నారు. విద్యలో కెజి నుండి పిజి వరకు పేదలకు ఉచిత విద్య అందించడం ద్వారా బాబా ట్రస్ట్ లక్షలాది మంది జీవితాలను వెలుగులోకి తెచ్చిందని ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వాలకు ధీటుగా, మరికొన్ని సందర్భాల్లో వాటికి మించి సేవలను ట్రస్ట్ అందిస్తోందన్నారు. వైద్యంలో సాయిబాబా సేవలు ప్రాణాధారంగా ప్రభుత్వ వైద్య సేవలు అందని ప్రాంతాల్లో సైతం బాబా ఆసుపత్రులు లక్షలాది మంది జీవితాలను రక్షించాయని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ కారణంగానే ఆయన ఈ రోజున ప్రజల్లో 'ప్రాణమిచ్చే దేవుడు' అనే స్థానాన్ని పొందారని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలపాటు తమిళనాడులోనూ బాబా సేవలు విస్తరించాయని తెలిపారు. భారతదేశాన్ని దాటి 140 దేశాలకు బాబా సేవలు విస్తరించడాన్ని ఆయన విశేషంగా అభినందించారు. తెలంగాణ ప్రభుత్వంకూడా సాయిబాబా శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. బాబా సేవ కార్యక్రమాలను విస్తరించేందుకు, ఆయన సిద్ధాంతాలను ప్రతిఇంటికీ చేరవేయడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పడుతుందని తెలిపారు.

# ఆచరణలో చూపిన సాయి

>> మాట్లాడుతూ, సత్యసాయి బాబా శతజయంతితో పాటు ఈ రోజు మరో విశిష్టత ఉందని, అది ప్రశాంతి నిలయం నిర్మించి నేటికి సరిగ్గా 75 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. 1926 నవంబర్ 23వ తేదీన భగవాన్ సత్యసాయి ఈ పుణ్య భూమిలో ఒక లక్ష్యం కోసం అవతరించారని, బాబా ఈ పవిత్ర నేలపై 86 ఏళ్ల తన జీవనప్రయాణాన్ని సాగించి సాయి సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించారన్నారు. జ్ఞానాన్ని బోధించి సన్మార్గం చూపించారని, సమాజ సేవ, సమస్యకు పరిష్కారం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తిమార్గంతో కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేశారన్నారు. 1940 మే 23న సత్యసాయి వయసు 14 ఏళ్ల వయస్సులో సత్యనారాయణరాజుగా ఉన్న పూర్వాసన నామాన్ని వదలుకుని సత్యసాయిగా సాక్షాత్కరించారన్నారు.

1960లో బాబా స్థాపించిన సత్యసాయి సంస్థలతో సేవలకు రూపం వచ్చిందన్నారు. భగవాన్ మనోదర్శనంద్వారా దేశ విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులు వచ్చి ఆయన సేవా మార్గాన్ని అనుసరించారని, ఎవరూ పిలవకున్నా వారంతట వారే వచ్చి బాబా సిద్ధాంతాన్ని పాటిస్తున్నారన్నారు. 102 సత్యాసాయి పాఠశాలల్లో 60 వేలమంది విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నారన్నారు. ట్రస్ట్ ఆస్పత్రుల ద్వారా 3 వేల మందికి ప్రతిరోజూ వైద్య సేవలు అందిస్తున్నారని, దాహార్తిని తీర్చడానికి రూ.550 కోట్లతో ఎపి, తెలంగాణ, తమిళనాడులో 16 వందల గ్రామాల్లో 30లక్షల మందికి పైగా త్రాగునీరు అందిస్తున్నారన్నారు. ఆయన సేవలను వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహి స్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డిని అభినందిస్తున్నాననా న్నరు. వసుధైక కుటుంబం భారతీయులకు మూలం అని, సత్యసాయి సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బాబానే ఇక్కడికి రప్పించినట్లు భావిస్తున్నానన్నారు.

# నిస్వార్థ సేవల ప్రతిరూపం బాబా

>> యొక్క దైవిక శక్తికి నిదర్శనమన్నారు. "ఇక్కడకు రావడం దైవానుగ్రహం లేకుండా సాధ్యం కాదని, తనకు ఈ పవిత్రక్షేత్రాన్ని సందర్శించే అవకాశం వచ్చినందుకు కృతజ్ఞత వ్యక్తం చేశారు. ఓ తమిళ కవి తన పద్యాలను ఉదహరిస్తూ, ఇతరుల కోసం జీవించే జీవితం మాత్రమే నిజమైన ఆధ్యాత్మికత అని వివరించారు. సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ దేశవ్యాప్తంగా అందిస్తున్న మహత్తర సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉచిత విద్య అందిస్తున్న సత్య సాయి విశ్వవిద్యాలయం, గ్రామీణ ఆరోగ్య సేవలు, ఉచిత గుండె శస్త్రచికిత్సలు, తాగునీటి ప్రాజెక్టులు, విపత్తు సహాయ కార్యక్రమాలు లక్షలాది మందికి జీవనాధారమవుతున్నాయన్నారు. ముఖ్యంగా తెలుగు గంగ ప్రాజెక్ట్ పునరుద్ధరణ, చెన్నైకు నిరంతర తాగునీరు అందించడంలో సాయిబాబా చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రపంచం నేడు సంఘర్షణలు, ఒత్తిడితో నిండిన సమయంలో భగవాన్ బోధించిన ప్రేమ, ఐక్యత, సేవవంటి విలువలు మరింత అవసరమని స్పష్టం చేశారు. భగవాన్ మహాసమాధి తరువాత కూడా ఇక్కడికి వచ్చి సేవలో కొనసాగుతున్న భక్తులకు అభినందనలు తెలియజేశారు. "సేవే మానవత్వాన్ని కలుపుతుందనీ, ప్రేమ ద్వేషాన్ని జయిస్తుందన్నారు. కుటుంబాల్లో, సమాజంలో, దేశంలో శాంతిని పెంపొందించడం మన బాధ్యత," అని పేర్కొంటూ భగవాన్ వారసత్వాన్ని కేవలం మాటల్లో కాదు, సేవలో కొనసాగించాలని పిలుపునిచ్చారు.

# ఘోర ప్రమాదం

>> మంది 'తుఫాన్' ట్రావెల్ వాహనంలో కాశి, అయోధ్య, ఒరిస్సాలోని పూరి జగన్నాథ్ దర్శనం చేసుకుని, శ్రీశైలం వెళ్లేందుకు బయలుదేరారు. రాత్రి రెండు గంటల సమయంలో ఎత్తురాళ్లపాడు గ్రామ సమీపంలో రోడ్డు ప్రక్క నిల్చుని ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన బోరో సింగ్ పవర్ (60), విజయ్ సింగ్ తోమర్ (65), ఉషీర్ సింగ్ (62), సంతోషి బాయ్ (62)లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిని కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. గాయపడ్డ సునీల్ పటేల్ (డ్రైవర్), సంతోష్ బాయ్, సిమాన్ భాయ్, చీరబాయ్, సావిత్రి బాయి, శకుంతల బాయిలను నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం హైవే అంబులెన్స్ సహాయంతో తరలించారు. ఈ మేరకు తమ బంధువులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. వారు బంధువులు వచ్చిన వెంటనే మృతదేహాలను అప్పగిస్తామని సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు. కాగా ఇదే సంఘటన స్థలంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం, ఇటీవల కాలంలో ఇక్కడే జరిగిన ఒక ప్రమాదంలో ముగ్గురు ఒరిస్సా వాసులు మృతి చెందడం పరిసర ప్రజలకు ఆందోళనకు గురి చేస్తుంది.



ఆదివారం లక్నోలో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్‌కు జ్ఞాపికను అందిస్తున్న బాలకృష్ణ

# యుపి సిఎం ఆదిత్యనాథ్‌తో బాలకృష్ణ భేటీ

**విజయవాడ, నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సమావేశమయ్యారు. లక్నోలోని సిఎం ఆదిత్యనాథ్ నివాసంలో ఆదివారం ఈ భేటీ జరిగింది. భేటీలో భాగంగా యోగి ఆదిత్యనాథ్ పరిపాలన తీరును ప్రశంసించారు. ఆయనకు జ్ఞాపికను అందజేసారు. ఆదిత్యనాథ్ బాలకృష్ణ చిత్రాలు చాలా చూసానని, అవన్నీ ఆయన నటనకు అద్దం పడుతున్నాయన్నారు. దివంగత ఎన్టీఆర్ స్థాయిలో మీ నటన ఉంటుందని అభినందించారు. ఇది మర్యాదపూర్వక సమావేశమే అయినప్పటికీ, తన రాబోయే చిత్రం అఖండ 2 ప్రమోషన్లలో భాగంగానే బాలకృష్ణ చిత్ర బృందంతో ఆయన్ను కలిసినట్లు స్పష్టమవుతోంది. ఈ సమావేశానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనండి

>> గిరిజన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ఏపీ టూరిజం ఫోరం ముందుకు వచ్చింది. ఐటిడిఎ పాడేరుతో ఒప్పందం చేసుకుందని సీఎం చంద్రబాబు ఎక్స్‌వేదికగా తెలిపారు. ఇప్పటికే 4010 హెక్టార్లలో స్థానిక రైతుల సహకార సంస్థతో కలిసి ఐటిసి కాఫీని సాగుచేస్తోంది. కాఫీ బోర్డు కూడా గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు విస్తరణ, నాణ్యమైన కాఫీ పంట ఉత్పత్తి, సాగులో సుస్థిర విధానాల అమలు కోసం ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ కల్పించే అంశంపై ఫ్రాంటియర్ మార్కెటింగ్, ఈజీ మార్ట్ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. పసుపు ఉత్పత్తి, వివిధ టర్మరిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్ ను అనుసంధానించటం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎక్విప్ సంస్థ ఐటిడిఎతో ఎంఒయూ కుదుర్చుకుంది. సీజన్ల వారీగా ఉత్పత్తి అయ్యే అటవీ ఉత్పత్తులను గిరిజన మహిళా సంఘాల ద్వారా విక్రయించేందుకు వీలుగా అవగాహన కల్పించేందుకు ఐఎస్బి సంస్థ మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. ఇక పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో హోమ్ స్టేలను ఏర్పాటు చేసేందుకు ఓయో హోమ్స్, హోమీ హట్స్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుకోసం మార్పు సొసైటీ కూడా ఎంఒయూ చేసుకుంది. అలాగే ప్రకృతి సేద్యం, మార్కెటింగ్ సదుపాయాలు, జీవనోపాధి తదితర అంశాల్లోనూ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. గిరిజన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ఏపీ టూరిజం ఫోరం ముందుకు వచ్చిందని వివరించారు.

# 12 ప్రధాన వాణిజ్య బ్యాంకులు

>> తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో, ఇప్పటికే వివిధ బ్యాంకులకు కావలసిన, వారిని బ్యాంకులు ఏర్పాటు చేసుకోవడానికి ఎపి ప్రభుత్వం ఆహ్వానించింది. కూటమి ప్రభుత్వం ఎపి రాజధాని అమరావతి అభివృద్ధికి ప్రత్యేకమైన దృష్టి సారించింది. రాజధాని అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి కేంద్ర సహకారాన్ని కూడా తీసుకుంటుంది. ఇందులో భాగంగా భారీ నిధులను సమకూర్చుకుంటూ రాజధాని అమరావతిలో మళ్లీ కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టడానికి కీలక సంస్కరణలను అమలు చేస్తోంది. అయితే 12 బ్యాంకుల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీతారామన్ ప్రత్యక్షంగా వచ్చి చేస్తారా లేకా, వర్చువల్‌గా పాల్గొంటారా అనేది ఇప్పటివరకు ఇంకా స్పష్టత రాలేదు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆర్బీఐతో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా మొత్తం 25 జాతీయ, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు, అధికారుల నివాస భవనాల నిర్మాణాలకు అమరావతిలో శంకుస్థాపన జరగనుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమం ముగిసిన వెంటనే నిర్మాణ పనులనుకూడా ప్రారంభిస్తారు. ఈ బ్యాంకుల ప్రాజెక్టు అమరావతిలో ఏర్పాటు చేయడం ద్వారా ఇది రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకపాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాజధాని అమరావతిలో ఎపి ప్రభుత్వం చేపట్టిన అనేక నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇక శంకుస్థాపన జరిగితే బ్యాంకుల నిర్మాణ కార్యక్రమాలు కూడా శరవేగంగా జరగనున్నాయి.

# సాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేసిన జగన్ ప్రభుత్వం

## - మంత్రి రామానాయుడు

**విజయవాడ, నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు నీటి కేటాయింపులు తిరిగి సమీక్షించేలా దారుణమైన అన్యాయం చేస్తుంటే.. ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఎపి ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఒక్క మాటైనా మాట్లాడారా జగన్? ఆ సమావేశంలో పెదవి విప్పకుండా ఇంత దారుణమైన అన్యాయం చేసింది మీరుకాదా? తెలంగాణ ముఖ్యమంత్రిగా కెసిఆర్ తమకు అనుకూలమైన డిమాండ్లుచేశారు. ఆభేటీలో కేంద్రమంత్రి కెసిఆర్, మీరూ ఉన్నారు. విభజన చట్టం ప్రకారం ఇలా తిరిగి సమీక్షించే అధికారం లేదు. అని ఒక్క మాట ఆనాడు మాట్లాడారా?మా ప్రభుత్వమేదో నీటి కేటాయింపులకు అన్యాయం చేస్తోందని విమర్శిస్తూ,లేఖలు రాస్తున్నారు. రాయలసీమకు అసలు ద్రోహి మీరు కాదా?' అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కృష్ణా జలాలకు సంబంధించి ట్రిబ్యునల్ ముందు ఎపి ప్రభుత్వం సరిగా వాదించడం లేదని,సాక్షి ఎకె గోయల్ ప్రమాణపత్రం సరిగా లేదంటూ జగన్ రాసిన లేఖపై మంత్రి స్పందించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో ఆంధ్రప్రదేశ్ 512 టీఎంసీలు తెలంగాణ 299 టీఎంసీలు వాడుకునేందుకు రెండు రాష్ట్రాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఘనత మా ప్రభుత్వానిదే. ఈ కేటాయింపులు తిరగతోడే నిర్ణయం తీసుకున్నది జగన్ ప్రభుత్వంలోనే అన్నారు. జల వివాదాలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య పరిష్కారం కాకపోతే కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఉంటుంది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందులో ఉంటారు. 2020లో నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే ఎపికి అన్యాయం చేశారు. మన రాష్ట్ర నీటి కేటాయింపులను తిరిగి సమీక్షించాలని కేసిఆర్ డిమాండ్ చేశారు.

ఆ రోజు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఒక్క మాట కూడా అనలేదు. కేసీఆర్ డిమాండ్లను వ్యతిరేకించలేదన్నారు. కృష్ణా డెల్టాకు ఉన్న 152 టీఎంసీలు, సాగర్ కుడి కాలువకున్న 132టిఎంసీలు, సాగర్ ఎడమ కాలువకున్న 31.9 టిఎంసీలు, ఎస్ఆర్‌బిసికి ఉన్న 19 టీఎంసీలను మళ్లీ సమీక్షించే అధికారం కృష్ణా రెండో ట్రిబ్యునల్‌కు అప్పగించాలని ఈ రోజు చర్చిస్తే, జగన్ కనీసం అభ్యంతరం వ్యక్తం చేయలేదు. రాష్ట్రానికి ఇంత ద్రోహంచేసి ఇప్పుడు మాట్లాడటం ఏమిటి? పోలవరం నీటి మళ్లింపులో 45 టీఎంసీలు...తెలంగాణ కావాలంటున్నా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఎకె గోయల్ అఫిడవిట్ లేదని విమర్శలు చేస్తున్నారు. కేంద్ర జలసంఘంలో గోయల్‌కు 20 ఏళ్ల అనుభవం ఉంది. ఆయన వాదన, శక్తిని పరీక్షించేలా జగన్ మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

# నకిలీ మద్యం కేసులో డైరీలో చెబుతున్న నిజాలు

>> వచ్చిన పేరు మనోజ్‌కుమార్ జైన్ అలియాస్ ముతా మనోజ్. విజయవాడ వన్‌టౌన్‌లో పోలిశెట్టి వారి వీధిలో ప్లాస్టిక్ సీసాలు, మూతల వ్యాపారి. అద్దేపల్లి అన్నదమ్ములు వెల్లడించిన వివరాలతో మనోజ్ వ్యవహారం బయటకు వచ్చింది. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అసలు అద్దేపల్లి జనార్దనరావు ఎవరో తెలియదని బుకాయిస్తున్న అతడి లింకులను అధికారులు గుర్తించారు. ప్లాస్టిక్ సీసాలు, సిల్వర్ మూతలను అద్దేపల్లి జనార్దనరావుకు విక్రయించినట్టు నిర్ధారించారు. ఒక సిల్వర్ మూత 2530పైసలు ఉంటుంది. ఒక్కో మూతను రూపాయి నుంచి రూ.1.50కు అద్దేపల్లికి సరఫరా చేశాడు. ఒక ప్లాస్టిక్ సీసా ఖరీదు రూపాయినుంచి రూ.1.50ఉంటే దాన్ని రూ.2.50 నుంచి 3 రూపాయలకు విక్రయించాడు. ఈ విధంగా జనార్దనరావు నుంచి రూ.లక్షలు ఆదాయంగా పొందాడు. అద్దేపల్లి సోదరుల బ్యాంక్ స్టేట్‌మెంట్లు వారి ముందు ఉంచి లెక్కలు చెప్పాలని ప్రశ్నించినప్పుడు మనోజ్ అధికధరల పాత్ర అధికారులకు చిక్కింది. ఈ కేసులో మాజీమంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును అరెస్టు చేసినప్పుడు అద్దేపల్లి సోదరులు ఇచ్చిన సమాచారంతో ఏ19గా మనోజ్ కొఠారి పేరును చేర్చారు. దీంతో అద్దేపల్లి సోదరులకు ప్లాసిక్ట్ సీసాలు, మూతలు సరఫరా చేసిన మనోజ్ కుమార్ జైన్ అలియాస్ ముతా మనోజ్ తెలివితేటలను ఉపయోగించడం మొదలుపెట్టాడు. జరిగిన పొరపాటును గుర్తించిన అధికారులు దాన్నిసరిచేసే ప్రక్రియమొదలుపెట్టారు. కేసుడైరీలో ముతా మనోజ్‌కు బదులుగా మనోజ్ కొఠారిపేరు పేర్కొన్నామని, దాన్ని తొలగించి అసలు పేరును చేర్చామని ఆరో అదనపుజ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో మెమో దాఖలు చేశారు.

# తల్లిపాలల్లో యురేనియం ఆనవాళ్లు

## బిడ్డలపై ప్రభావం చూపుతాయంటున్న శాస్త్రవేత్తలు

**పాట్నా, నవంబరు 23:** తల్లి పాలపై జరిగిన అధ్యయనాల్లో యురేనియం ఆనవాళ్లు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. తల్లి పాలు తాగే బిడ్డలపై ప్రభావం పడుతుందని ఆ నివేదికహెచ్చరించింది. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిన పరిమితి కంటే చాలా తక్కువగా యురేనియం స్థాయిలు ఉండటంతో ఎలాంటి భయం అవసరంలేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని మహావీర్ క్యాన్సర్ సంస్థాన్ పరిశోధనా కేంద్రం, ఢిల్లీకి చెందిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, ఎయిమ్స్ శాస్త్రవేత్తల బృందం బీహార్‌లో ఒక అధ్యయనాన్ని నిర్వహించింది. బిడ్డలకు పాలిచ్చే 40 మంది తల్లుల నుంచి తల్లి పాలు నమూనాలు సేకరించారు. వాటిలో యూరేనియం ఆనవాళ్లను పరిశీలించారు. బీహార్‌లో సేకరించిన 40 మంది తల్లుల పాల నమూనాల్లో యూరేనియం238 ఆనవాళ్లు కనిపించాయి. 5 పిపిబి (పార్ట్స్ పర్ బిలియన్) వరకు ఉన్నట్లు శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. దీంతో తల్లులతోపాటు తల్లిపాలు తాగే శిశువులకు క్యాన్సర్ కారక ఆరోగ్య ప్రమాదం 70 శాతం వరకు పొంచి ఉన్నట్లు అంచనా వేశారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అనుమతించిన పరిమితుల కంటే బీహార్‌లోని తల్లుల పాలలో యురేనియం స్థాయిలు తక్కువగా ఉన్నట్లు ఆ అధ్యయనంలో పేర్కొన్నారు. భూగర్భ జలాల్లో యురేనియం స్థాయిలు పెరుగుతుండటం దీనికి కారణమని తెలిపారు. దీని వల్ల దీర్ఘ కాలంలో తల్లులతోపాటు శిశువులపై చాలా హానికరమైన ఆరోగ్య ప్రభావాలు చూపవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటిష్ జర్నల్ 'సైంటిఫిక్ రిపోర్ట్స్'లో ఈ అధ్యయనాన్ని ప్రచురించారు. బీహార్ అధ్యయన ఫలితాలు శిశువుల ఆరోగ్యంపై వాస్తవ ప్రభావం తక్కువగా ఉంటుందని ఈ అధ్యయనానికి సహ రచయితగా ఉన్న ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన డాక్టర్ అశోక్ శర్మ తెలిపారు. మహిళలు తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం కొనసాగించాలని చెప్పారు. మరోవైపు ఎలాంటి ఆందోళన అవసరం లేదని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డీఎంఏ) సభ్యుడు, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ మాజీ గ్రూప్ డైరెక్టర్, సీనియర్ అణు శాస్త్రవేత్త డాక్టర్ దినేష్ కే అస్వాల్ తెలిపారు.

# కల్తీ నెయ్యి కేసు

>> మరీ 2020-2024 మధ్యకాలంలో కల్తీనెయ్యి సరఫరా వెనుక కుట్ర ఎవరిదనేది తేల్చేందుకు సిట్ అధికారులు మరోసారి మాజీ ఇఒ, మాజీ ఛైర్మన్‌లను తిరుపతిలోని సిట్ కార్యాలయానికి పిలవాలని ఆలోచనచేస్తున్నారనేది తెలుస్తోంది. గత వైసిపి హయాంలోని టిటిడి బోర్డు, అధికారులు, కొనుగోళ్ళకమిటీ అందరూ కలసి ఏ మాత్రం అర్హతలేని ఇతర రాష్ట్రాల్లోని డెయిరీలకు నెయ్యి సరఫరాకు టెండర్లు కట్టబెట్టారనేది కీలకంగా సేకరించిన సమాచారం. అదే ఆధారాలతో ఈ కేసులో 24మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఐదారుమంది పాత్రధారులు బెయిల్‌పై బయట ఉన్నారు. ఇటీవల కల్తీనెయ్యి సరఫరాకు బోలేబాబాడెయిరీకి అవసరమైన రసాయనాలను సరఫరా చేశాడనే ఆధారాలతో అజయ్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి సిట్ రిమాండ్‌కు తరలించింది. ఆతరువాత టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఏ చిన్న అప్పన్నను అరెస్ట్‌చేసి కొన్ని ఆధారాలు సేకరించారు. ఆ తరువాత అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే చిన్నఅప్పన్న ఖాతాలో భారీగా కోట్లరూపాయలు బ్యాంకు నిల్వలు ఉండటం, స్థిరాస్థులు ఉన్నట్లు తేల్చిన సిట్ అవి ఎలా సంపాదించాడనేది సమాచారం రాబట్టింది. ఆ దిశగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంట్లో సుబ్బారెడ్డిని విచారణ చేసిన సిట్‌కు వైవి సమాధానాలు తనకెలాంటి సంబంధంలేదని, 2018 తరువాత అప్పన్న తనవద్ద లేడని, తనతో అతనికి ప్రమేయం లేదని వెల్లడించాడనేది కీలక విషయం. అయితే 2022లో బోలేబాబా డెయిరీ, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, వైష్ణవిడెయిరీ, ఏఆర్ డెయిరీల యాజమాన్యం. ప్రతినిధులతో ఎవరు మాట్లాడారు, వారి నుండి కమీషన్ల రూపంలో లావాదేవీలు ఎవరికి చేరాయనే విషయాలపై సరైన సమాధానాలు ఇవ్వలేదనేది సిట్ సమాచారం. మరీ ఈ సమయంలో ఓ వైపు మాజీ ఇఒ ధర్మారెడ్డి, మరోవైపు మాజీ ఛైర్మన్ వైవి వివరాలను బేరీజువేసుకుంటూ అసలు సూత్రధారులను తేల్చేపనిలో కదులుతూన్నారు. ఇప్పుడు మరోవిడత ఆ ఇద్దరు ప్రముఖులను విచారణకు పిలిచి తదుపరి చర్యలకు ఉపక్రమించే అవకాశం లేకపోలేదనేది గుప్పుమంటోంది. తిరుమలకు 2020-24మధ్యకాలంలో లడ్డూలకు నెయ్యిసరఫరాకు సంబంధించి వివిధ డెయిరీలకు అనుమతులిచ్చిన అసలు సూత్రధారులు ఎవరనేది తేల్చేందుకు మరోసారి ఆ ఇద్దరినీ పిలిచి వివరాలు రాబట్టనున్నారనేది తెలుస్తోంది. ఇప్పటికే రిమాండ్‌లో ఉన్న నిందితుల రిమాండ్ రిపోర్టులుకూడా సిట్ కీలకంగామారింది. పాత్రధారులు రాజశేఖరన్, విపిన్‌జైన్, పోమిల్‌జైన్, అపూర్వవినయ్‌కాంత్ చావ్డాలు తెలిపిన ఆధారాలను మరోసారి పున:పరిశీలించి ఈ నెలాఖరులో క్లైమాక్స్‌కు తీసుకురావాలనే ఆలోచనతో సిట్ ఉంది. బోర్డులో కొనుగోళ్ల కమిటీ సభ్యులు, టిటిడి అధికారులు ఎవరుకీలకమనేది ఇక సిట్‌తీసుకునే చర్యలపై ఆధారపడింది.

## వారం - వర్జ్యం

24-11-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చవితి రా.9.20
పూర్వాషాఢ రా.9.51
వర్జ్యం : ఉ.6.32-8.17,అనూరాధ కార్తె
దు.ము.12.18-1.03, ము.2.33-3.18
శుభసమయం : ఉ.11.00-11.45
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** మిత్రవర్గంలోని ఒకరితో విభేదం ఏర్పడుతుంది. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి. శుభవార్తలు అందుకొంటారు.

**వృషభం:** మొండితనాన్ని, పట్టుదలను కలిగి ఉంటారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**మిథునం:** మిమ్మల్ని నిందారోపణలకు గురిచేస్తున్న వారిపై ప్రతి దాడికి దిగుతారు. నరఘోష అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:** ప్రత్యర్థులను సమస్యలు సృష్టించినా వాటిని అధిగమించి ముందుకు సాగుతారు. ఉద్యోగంలో స్వల్ప మార్పులు.

**సింహం:** సోదరుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. క్రయ విక్రయాలలో తొందరపాటు వద్దు.

**కన్య :** కుటుంబసభ్యులతో ముఖ్యమైన విషయాలు చర్చించి ఓ నిర్ణయానికి వస్తారు. వాహన యోగం కలదు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** అనధికార యత్నాలు, ప్రయాణాలను సాగిస్తారు. నూతన ఉద్యోగం యత్నం ఫలిస్తుంది. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** విభేదాలతో, అపోహలతో ఇన్నాళ్ళు సాగిస్తూ వస్తున్న ఉద్యోగానికి స్వస్తి చెబుతారు. గోపత్యకు ప్రాధాన్యత నిస్తారు.

**ధనుస్సు:** భాగస్వామ్య వ్యాపారాలలో చోటు చేసుకున్న అవకతవకలను పరిష్కరించుకుంటారు. వాహన సౌఖ్యం కలదు.

**మకరం:** రావలసిన ఋణాలు మీరు చెల్లించవలసిన చెల్లింపులను బేరీజు వేసుకుంటారు. దైవ సంబంధితమైన కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** అనుకున్న పనులు పూర్తయ్యే వరకు మనస్సులోని మాటను ఎవరికీ చెప్పకూడదని భావిస్తారు. సోదరుల నుండి శుభవార్తలు.

**మీనం:** అనుకున్న పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. తగు విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బంగాళాఖాతంలో వాయుగుండం!

>> న్నారు. ఇది సముద్రంలోనే దిశ మార్చుకునే అవకాశముందని చెబుతున్నారు.

దీని ప్రభావంతో ఈ నెల 28 నుంచి డిసెంబరు 1 వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం ప్రకాశం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది.

# జాతీయ రహదారులు

>> వరకు 4 వరుసలుగా, అక్కడినుంచి లక్ష్మీ మ్రపురం దాకా రెండు వరుసలుగా విస్తరించను న్నారు. భూసేకరణ వ్యయం, ఇతర ఖర్చులు కాకుండా సివిల్ పనులకు రూ.2 వేల కోట్లను వెచ్చించనున్నారు.

**కొనసాగుతున్న విస్తరణ పనులు**

పామర్రు నుంచి ఆకివీడు వరకు 60 కి.మీ. మేర ఇప్పటికే విస్తరణ పనులు సాగుతున్నాయి. 45కి.మీ. రెండు వరుసలుగా, 15కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఇప్పుడు ఆకివీడు నుంచి భీమవరం మీదుగా దిగమర్రు వరకు 44.94కి.మీ. విస్తరణకు డిపిఆర్ పంపారు. ఇందులో 40కి.మీ. 4 వరుసలు, మిగిలినది 2 వరుసలుగా విస్తరించేందుకు రూ.3,256 కోట్లతో అంచనాలు వేశారు. వాస్తవానికి పామర్రు నుంచి దిగమర్రు వరకు (ఎన్‌హెచ్165) మొత్తం ప్రాజెక్టు విస్తరణ గతంలో మంజూరైంది. భీమవరం బైపాస్ ఎలైన్‌మెంట్ విషయంలో కోర్టు కేసుల కారణంగా పామర్రు నుంచి ఆకివీడు వరకు మాత్రమే గతంలో పట్టాలెక్కింది. ఇప్పుడు కోర్టు కేసులు పరిష్కారం కావడంతో ఆకివీడుదిగమర్రు మధ్యనా విస్తరణ చేపట్టనున్నారు.

# ఎఐ దుర్వినియోగానికి కళ్లెం వేయాలి

>> ఉండాలనిసూచించారు. ఇదేవ్యవస్థను భారత టెక్నాలజీ రంగానికి వర్తింపచేసామని మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. స్పేస్ అప్లికేషన్లు, కృత్రిమ మేధ, డిజిటల్ చెల్లింపులు వ్యవస్థల్లో గ్లోబల్ లీడర్‌గా ఎఐ ఉందని అన్నారు. అలాగే సంక్లిష్ట ఖనిజాలు, అరుదైన ఖనిజవనరులు, కృత్రిమమేధ వంటి వాటిపై సత్వర కార్యాచరణలు అవసరమని సూచించారు. ఎఐ దుర్వినియోగం అరికట్టి ప్రపంచ అభ్యున్నతికి కృషిచేసేందుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. ఎఐ డిజైన్, పారదర్శకత, కఠిన ఆంక్షలుతో ఉండాలని, దీప్‌ఫేక్స్, క్రైమ్, ఉగ్ర కార్యకలాపాల్లో ఎఐ వినియోగంపై కఠినాతికఠినమైన ఆంక్షలుండాలని అన్నారు. ఎఐ వినియోగంలో నిర్ణయంమానవ మేధస్సుకే విడిచిపెట్టాలన్నారు. ప్రతిభకు కట్టం కట్టే విధంగా భవిష్యత్తు సంవత్సరాల్లో జి20 ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుచేయగలదని ఆశిస్తున్నట్లు మోడీ తెలిపారు. జి20 సదస్సుకు హాజరైన ప్రధానిమోడీ ఈ సందర్భంగా పలువురు ప్రపంచనేతలతో భేటీ నిర్వహించారు. వారిలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంపోసా, ఇటలీప్రధాని జార్జియా మెలోనీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వాలతో వేరువేరుగా భేటీలునిర్వహించారు. ఈమూడుదేశాలు సంయుక్తంగా డిజిటల్ ఇన్నోవేషన్ అలయన్స్ (డిఐఎ)ను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. యుపిఐ, కోవిన్, సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాను పరస్పరంపంచుకోవాలన్నారు. ఇండియా, బ్రెజిల్ దక్షిణాఫ్రికా సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇబ్సా నిధికూడా చర్చల్లో ప్రస్తావించారు. ఈనిధులతో ఇప్పటికే 40దేశాల్లో విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, సైరవిద్యుత్ అంశాలపైనిచేస్తున్నాయని అన్నారు. ఇబ్సా కూటమి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వంటిప్రపంచ స్థాయి సంస్థల్లో మార్పులు రావాల్సినఅవసరాన్ని గుర్తుచేస్తోందని మోడీ పేర్కొన్నారు.

# కొత్త సిజెఐ సూర్యకాంత్ నేడు ప్రమాణం

**న్యూఢిల్లీ, నవంబరు 23:** భారత నూతన ప్రధాన న్యాయమూర్తిగా జేస్టిస్ సూర్యకాంత్‌సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన చీఫ్ జస్టిస్‌గా బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఇదిలావుంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తొలి హర్యానా వ్యక్తిగా జస్టిస్ సూర్యకాంత్ గుర్తింపు పొందనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని హిస్సార్ జిల్లాలో జన్మించారు. 1981లో డిగ్రీ పూర్తి చేశారు. 1984లో రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్ హర్యానా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్ హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యేంత వరకు ఆ రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. 2018 అక్టోబర్ 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రెండు దశాబ్దాలుగా వివిధ ధర్మాసనాల్లో పనిచేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు.

## సిఆర్డీఏ భవనాలకు హరిత ధృవీకరణ

### జారీ చేసిన గ్రీన్ బిజినెస్ సర్టిఫికేషన్ సంస్థ

**విజయవాడ,నవంబరు 23,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయం ఎదురుగా పీఈబీ (ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్) విధానంలో నిర్మించిన 4 బ్లాక్‌లకు 'ఎడ్జ్'(ఎక్సలెన్స్ ఇన్ డిజైన్ ఫర్ గ్రేటర్ ఎఫీషియెన్సీస్) ధృవీకరణ పత్రం వచ్చింది. పర్యావరణరహిత విధానాలతో భవనాలను నిర్మించినందుకు జీబీసీఐ (గ్రీన్ బిజినెస్ సర్టిఫికెట్ ఇంక్)సంస్థ దీనిని జారీ చేసింది. హరిత నగరంగా అభివృద్ధి చేయాలనే బృహత్ ప్రణాళిక లక్ష్యం మేరకు భవనాలకు గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ పొందే ప్రయత్నంలో ఇప్పటికే సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ఈ ధృవీకరణను సాధించిందిత. కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం ద్వారా పర్యావరణంపై దుష్ఫలితాలు పడకుండా ఆచరించిన విధానాల కారణంగా ఈ ధృవీకరణ వచ్చింది. భవనంలో విద్యుదీకరణ చేసే సమయంలోనే విద్యుత్ ఆదాకు తోడ్పడే ఉపకరణాలు, సామాగ్రిని వినియోగించారు. నీటి సంరక్షణ చర్యలతో పాటు పునర్వినియోగంపై ఎక్కువగా దృష్టి సారించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్,మెప్మా,ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ తదితర విభాగాల కోసం సీఆర్డీఏ ఈ బ్లాక్‌లను నిర్మించింది. ఇప్పటికే మూడు నిర్మాణాలు పూర్తై ప్రభుత్వ విభాగాలు పని చేస్తు నా న్నాయి. మిగిలిన ఒక బ్లాక్ తుది మెరుగులు దిద్దుకుంటోంది.

## స్పెషల్ ఆఫీసర్ల పాలన ఆరు నెలలు పొడిగింపు

**విజయవాడ,నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా 9 అర్బన్ లోకల్ బాడీలకు స్పెషల్ ఆఫీసర్ల పాలనను ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక పాలన 2026 మే 5 వరకు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇందులో రాజాం, రాజమండ్రి, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, బాపట్ల, గూడూరు అర్బన్ లోకల్ బాడీలు ఉన్నాయి. తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



## తిరుపతి ఐఐటి విశాఖ సిఇఎంఎస్‌తో ఒప్పందం

**శ్రీకాళహస్తి,నవంబరు 23 ప్రభాతవార్త:** తిరుపతి ఐఐటి సామాజిక రంగంలోనూ, వ్యాపారం రంగంలో మరో అడుగు ముందుకేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి ఐఐటి ప్రాంగణంలో విశాఖ పట్టణంని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్‌తో అవగాహన ఒప్పందంపై ఇరు వర్గాలు సంతకాలు చేసాయి. ఈసందర్భంగా తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొ.డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఒప్పందం అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రీస్ 4.0 టెక్నాలజీలతో పరిశ్రమ విద్యా సహకారాన్ని బలోపేతం చేసే దిశగా కీలకమైన అడుగు పండిందని సత్యనారాయణ వివరించారు. ఈ భాగస్వామ్యం సీమెన్స్ లిమిటెడ్ నుంచి ఇన్-కైండ్ గ్రాంట్ ద్వారా మద్దతు ఇవ్వబడిన ఐఐటి యెక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బలాలను కల్పిస్తుందన్నారు. సిమెన్స్ భాగస్వామిగా మరియు విప్రో ఎంటర్ ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ అమలు భాగస్వామిగా సిమెన్స్ నిరూపితమైన పారిశ్రామిక శిక్షణ సామర్థ్యాలను కలిగి ఉంటుందన్నారు. రెండు సంస్థలు సంయుక్తంగా డిజిటల్ తయారి, సిమ్యులేషన్, టెస్ట్ సొల్యూషన్స్,ఎలక్ట్రిక్ మరియు అటానమస్ వెహికల్స్ ఇండస్ట్రియల్ లాట్,ఫ్యాక్టరీ ఆటోమేషన్,మైక్రోగిడ్ టెక్నాలజీస్ వంటి రంగాలలో నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి అందిస్తాయని సత్యనారాయణ వివరించారు. ఈ సహకారం మేక్ ఇన్ ఇండియా,ఆత్మనిర్భర్ భారత్ మరియు ఇండస్ట్రీ 4.0 వైపు విస్తృత పురోగతితో సాహా జాతీయ చొరవలతో సమలేఖనం చేయబడిందని వివరించారు. ఫిబ్రవరి 2024లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించిన సిఎఇ,విప్రో సారథ్యంలోని 'ట్రైన్-ది-ట్రైనర్' కార్యక్రమం,స్మార్ట్ తయారి,ఇవి టెక్నాలజీలలె ఐఐటి అధ్యాపకులు ప్రారంభించి తదుపరి శిక్షణా కార్యక్రమాల ద్వారా దాని సామర్థ్యం క్రమంగా పెంచుకుంటూ పోతున్నామని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమాల్లో తనతోపాటు గోపి కృష్ణశివం సిఇఓ కె.ఎన్ సత్యనారాయణ, డాక్టర్ సాయి కృష్ణ, సవ్యసాచి మజుందార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

## ఎస్సీ,ఎస్టీ యువతకు ఉచితంగా యూపీఎస్సీ సివిల్స్ కోచింగ్

**అమరావతి, నవంబరు 23 ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఐఏఎస్ వి.ప్రసన్న వెంకటేష్ ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి డా.బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 13 నుంచి 26 వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు మరిన్ని వివరాలకు https://apstudycircle.apcfss.in వెబ్ సైట్‌ని సంప్రదించాలని వెంకటేష్ తెలిపారు.

## నా మాటలు తప్పే..

### తమ్ముడితో కలసి క్షమాపణలు చెప్పిన యాంకర్ శివజ్యోతి



**తిరుమల,నవంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో భక్తులకు అందించే అన్నప్రసాదాలపై వ్యంగ్యంగా మాట్లాడటం పొరపా టైందని, ఈ తప్పునకు క్షమాపణలు చెబుతున్నానని యాంకర్ శివజ్యోతి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె వ్యాఖ్యలు వీడియో విడుదల చేశారు. ఇటీవల తాను, తన సోదరుడు, భర్త, స్నేహితులతో కలసి తిరుమలకు వచ్చామని, పదివేల రూపాయలు శ్రీవాణి దర్శనం టిక్కెట్ కొని దేవదేవుని దర్శనానికి వెళ్ళే సమయంలో క్యూలైన్లో అన్నప్రసాదాలు అందించడం, వాటిని తీసుకుని రిచెస్ట్ బిక్షగాళ్ళమని వ్యాఖ్యలు చేయడం దుమారం రేపింది. దీనిపై ఆమె భక్తులకు క్షమాపణలు చెబుతూ వీడి యోను విడుదల చేసింది. నా మాటలు తప్పు అని, నన్ను క్షమించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. తనకు శ్రీవేంకటేశ్వరస్వామి అంటే ఎనలేని భక్తి అని, నాలుగునెలలుగా ప్రతి శనివారం వ్రతం కూడా చేస్తున్నానని తెలిపారు. తనకు అత్యంత విలువైన బిడ్డను ఆ దేవుడే వరంగా ఇచ్చాడని ,అలాంటిది నేనెలా దేవుడిని తప్పుగా మాట్లాడ తానని భావోద్వేగానికి గురయ్యారు. ఆమె క్షమాపణతో వివాదం సద్దుమణిగినట్లేనని తెలుస్తోంది.



## ఉదయం నుండి తిరుమలలో జడివాన

**తిరుమల,నవంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సప్తగిరులపై జడివాన కురుస్తోంది. శనివారం సాయంత్రం నుండి జోరువాన కురిసినా ఆదివారం ఉదయం నుండి మళ్ళీ గంటగంటకూ తెరపించి తెరపించి బలమైన వాన కురుస్తోంది.కురుస్తున్న వర్షానికి తిరుమలకొండ జలమయంగా మారింది. అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడురోజులు బలమైనవానలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో టిటిడి అధికారులు కూడా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు. జడివాన కురుస్తుండటంతో ఎప్పుడు బలంగా కురుస్తుందో, ఎప్పుడు తెరపిస్తుందో తెలియనిపరిస్థితి ఉంది. ఆలయం ముందుభాగం, పరిసరాలు,మాఢవీధుల్లో వర్షపునీటితో భక్తులు తడిసి ముద్దవుతున్నారు. వర్షాలతో వాతావరణం పూర్తిగా మారడంతో విపరీతమైన చలిగాలులు వీస్తున్నాయి. కొండపై ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు. వర్షం తగ్గుముఖం పట్టేవరకు భక్తులు తిరుమలలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. పొగమంచుతో భక్తులు,వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## భవిష్యత్తు తరాలు సత్యసాయి మార్గంలో నడవాలి

### శత జయంతి ఉత్సవాలలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



ఆదివారం పుట్టపర్తిలో సత్యసాయి జయంతి సభలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

**పుట్టపర్తి టౌన్, నవంబరు 23, ప్రభాతవార్త:** భవిష్యత్ తరాలు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా చూపించిన మార్గంలో నడవాలని ప్రేమ,సేవ, దైవస్ఫూర్తి మార్గాన్ని అనుసరించాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ విలువలు వికాసానికి భగవాన్ సత్యసాయి బాబా చేసిన సేవలు అపూర్వమని, 1950లో స్థాపించిన సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మానవత్వం మరియు దైవత్వం మధ్యనున్న దూరాన్ని తగ్గించేందుకు బాబా తీసుకున్న దైవ సంకల్పం అన్నారు. ఈ శత జయంతి ఉత్సవాలలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని గవర్నర్ పేర్కొ న్నారు. పుట్టపర్తి లోని ఒక చిన్న గ్రామంలో జనరల్ హాస్పిటల్ గా ప్రారంభమైన వైద్య సేవలు ఈరోజు ప్రపంచ స్థాయికి ఎదగడం బాగా దివ్యకార్యానికి సాక్ష్యం అన్నారు. విశ్వవిద్యాలయాన్ని స్థాపించి కేజీ నుంచి పీజీ వరకు విలువలతో కూడిన ఉచిత విద్యను తెలివితేటలతో పాటు వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో గొప్ప పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఇది దేశంలో విలువల విద్యకు ప్రామాణిక ఉదాహరణగా నిలుస్తోందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతంలో తాగునీటి ప్రాజెక్టులు అందించడం ద్వారా బాబా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని గవర్నర్ గుర్తు చేశారు. సత్య సాయి బాబా చేపట్టిన ప్రతి ప్రాజెక్టు ప్రజల మౌలిక అవసరాలను తీర్చడానికి అంకితమైందన్నారు. సత్య సాయి సేవా ఉద్యమం గ్లోబల్ సేవ ఉద్యమంగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది సేవాభావంతో ఐక్యం చేసిందని, వద్రంగి నుండి సీఈవో వరకు, పాట్నా నుండి పెరుగ వరకు, గుజరాత్ నుండి కెనడా వరకు ఒకే సేవా ధ్యేయంతో ముందుకెళుతున్న ఒక్క మిలియన్ పైగా సాయి సేవలు సాయిబాబా బోధనలు ఒకే తాడు మీద కట్టేసాయని ఆయన పేర్కొన్నారు. సేవ ద్వారా ప్రతి వ్యక్తిలోని దైవత్వాన్ని వెలికి తీయాలన్నా బాబా సంకల్పం ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని గవర్నర్ పేర్కొన్నారు.

## కార్మికులతోనే దేశం బలపడుతుంది

### వారి జీవన ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి సుభాష్

**తాడేపల్లి, నవంబరు 23 ప్రభాతవార్త:** కార్మికుడు బలపడితే దేశం బలపడుతుంది. కార్మికుల జీవన ప్రమాణాల పెంపు కోసం, భద్రత కోసం, గౌరవం కోసం ఈ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు చారిత్రాత్మక సంస్కరణలని తెలిపారు. సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ సామాజిక భద్రత కోడ్ 2020 సామాజిక భద్రత రంగంలో తొమ్మిది చట్టాలను ఏకీకరించి కొత్త కోడ్ తెచ్చామని, ముఖ్యంగా అసంఘటిత రంగం, గిగ్ ప్లాట్‌ఫామ్ వర్కర్లకు మొదటిసారిగా సోషల్ సెక్యూరిటీ ప్రయోజనాలు అందుతున్నాయని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా నేషనల్ మరియు స్టేట్ సోషల్ సెక్యూరిటీ బోర్డులు ఏర్పాటు



చేసి, సోషల్ సెక్యూరిటీ ఫండ్ సృష్టించామని వివరించారు. EPF, ESIC ప్రయోజనాలను అన్ని రంగాలకు విస్తరించాం. తల్లి, తండ్రి, భార్య, పిల్లలు మాత్రమే కాకుండా అత్త-మామలు కూడా ESIC వైద్య సేవలను పొందగలరన్నారు. మహిళ ఉద్యోగులకు 26 వారాల మాతృత్వ సెలవులు, అవసరమైతే Work From Home సౌకర్యం ఉంచామని తెలిపారు. పారిశ్రామిక వివాదాల కోడ్ 2020 51 సభ్యత్వం ఉన్న ట్రేడ్ యూనియన్‌కి చట్టబద్ధ గుర్తింపు ఇస్తున్నామని చెప్పారు.ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయీలకు కూడా శాశ్వత ఉద్యోగుల్లాగే అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.ఉద్యోగం కోల్పోయిన వారికి వర్కర్ రీస్కిల్లింగ్ ఫండ్ ద్వారా 15 రోజుల వేతనం అందిస్తామని తెలిపారు.300 మందికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో తొలగింపుకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ముఖ్యంగా కార్మికుడి ఇష్ట ప్రకారం 8 గంటలు లేదా 10 గంటల పని చేయవచ్చు అని తెలిపారు. 50 మందికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో శిశు సంరక్షణ కేంద్రం తప్పనిసరని పేర్కొన్నారు.

## హక్కుల సాధనకు సమష్టిగా కృషి: బొప్పరాజు వెంకటేశ్వర్లు

**శ్రీకాకుళం, నవంబరు 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదివారం శ్రీకాకుళం జిల్లా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రములోని శ్రీకాకుళం జిల్లాలోని రెవెన్యూ సర్వీసుల సంఘం, రెవెన్యూ ఉద్యోగులందరూ వారి ప్రత్యేకతను కనబర్చుతూ మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచారని ఇదే పంథాను అనుసరిస్తూ భవిష్యత్తులో ఐక్యమత్యంతో ప్రజలకు చేరువ అవుతూ రెవెన్యూశాఖ ఔన్నత్యాన్ని పెంచుతూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. జిల్లా మరియు రాష్ట్ర ఏపీ జేఏసీ అమరావతి నాయకత్వాలు ఎప్పుడు ఎలాంటి పిలుపులు ఇచ్చినా సంసిద్ధంగా ఉం డాలని, ఉద్యమం చేయడం ఏపీ జేఏసీ అమ రావతి ప్రధాన లక్ష్యం కాదని, సమస్యల పరిష్కారం ప్రధాన ధ్యేయమని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రధానంగా ముఖ్యమంత్రి సమస్యల సానుకూల పరిష్కారానికి సంసి ద్ధంగా



ఉన్నారని, తప్పకుండా ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతారని నమ్మకం ఉందని తెలిపారు. అలాగే రానున్న 2026 ఫిబ్రవరి 5వ తేదీన రాష్ట్ర ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంలో శ్రీకాకుళం జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు, సెక్రటరీ జనరల్ ఎస్.వి. రమణ, మహిళా విభాగం చైర్మన్ కె.ప్రవల్లిక ప్రియ, ఏపీఆర్ఎస్ఏ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, కోశాధికారి, మురళీధర్ నాయక్, సహాధ్యక్షులు యస్. గణపతిరావు, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ల సంఘం తరుపున పి.వేణుగోపాల రావు, టి.వేణుగోపాలరావు, భాషాపండితుల జిల్లా అధ్యక్షుడు పి.వసం తరావు, సమగ్ర శిక్ష అధికారుల రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు కామేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.రాజేష్, కార్యదర్శి పి.రాంజీ, కోశాధికారి జి.ఢిల్లేశ్వర రావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అప్పారావు, కె.అప్పల నాయుడు, సురేష్, రామారావు, త్రినాథ రావు, జిల్లాలో ఉన్న జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు ఉద్యోగులు హాజరయ్యారు.

## ప్రేమతత్వమే సాయి బోధనల సారాంశం

### మాజీ ఎంఎల్ఏ ఎస్‌సివి నాయుడు



పేదలకు బట్టలు పంపిణి చేస్తున్న మాజీ ఎంఎల్ఏ ఎస్‌సివి నాయుడు

**శ్రీకాళహస్తి,నవంబరు 23 ప్రభాతవార్త:** సామాజిక ప్రేమతత్వమే పుట్టపర్తి సాయి బోధనలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన సాయి మందిరంలో సాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా ఏర్పాటు చేసారు. సాయి మందిరం నిర్వాహకులు పాండురంగయ్య సారధ్యంలో బారీ ఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు మాజీ శాసనసభ్యుడుఎస్‌సివి నాయుడు ముఖ్యఅతిథిగా మాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రేమ తత్వమే సత్యసాయి బాబా బోధనల సారాంశం అని వివరించారు.మనకు ఉన్నంతలో పొరుగు వారికి సాయం చేయటం ఆయన నేర్పిన ఆలవాటు అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో గడపటమే అత్యున్నత మానవ జన్మకు సార్థకమని మోక్ష కైవల్యానికి మార్గమని ఆయన సామాన్యులకు అర్థమయ్యేరీతిలో వివరించారు.ఈ సందర్భంగా సేవా సమితి నిరుపేదలకు బట్టల పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేయగా ఎస్‌సివి నాయుడు పేదలకు బట్టల పంపిణి చేసారు.సత్యసాయి కలియుగంలో మానవ రూపంలో జన్మించిన పేదల పాలిట దేవుడుగా భావించవచ్చునన్నారు. మనిషి రూపంలో భగవంతుడు అప్పుడప్పుడుజన్మించి సేవలందిస్తారన్నారు. అలాంటి మహానీయుడు సత్యసాయి అన్నారు. సమాజ హితాన్ని కోరుతూ మానవాళిని సన్మార్గంలో నడిపించుటకు సత్యసాయి సేవలు మరువరానివన్నారు. ఆయన నిత్యం ఆధ్యాత్మిక చింతనతో గడిపి సమాజానికి మార్గదర్శకులయ్యారు. ఆయన నేటి సమాజానికి కావాల్సిన తాగునీరు,సాగునీరు, విద్య,వైద్యసేవలను అందించారన్నారు. 'సమాజాన్ని ప్రేమించండి-పరుల హితవు కోరండి' అంటూ సత్యసాయి ప్రసంగాలు ఎప్పటికి మరువలేమన్నారు. ఆయన బోధనలను ప్రతి ఒక్క ఆధ్యాత్మిక వాదే కాకుండా పాలకులు కూడా పాటించాలని సూచించారు. మనసులో దేవుని తలచుకొని, మనస్సును లగ్నం చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో సామాజిక హితాన్ని కోరుకుంటూ సన్మార్గంలో సాగి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఎస్‌సివి నాయుడు పిలుపునిచ్చారు. కాగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఽకూడా ముఖ్యఅతిథిగా హాజరై సత్యసాయి సేవలను భక్తులకు వివరించారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ చంద్రశేఖర్,సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.కాగా శ్రీకాళహస్తి మున్సిపల్‌కార్యాలయంలో కమిషనర్ భవాని ప్రసాద్ సారధ్యంలో సత్యసాయి బాబా శతజయంతోత్సవాలను నిర్వహించారు.

## పట్టుబడిన మావోయిస్టులను కస్టడీకి కోరనున్న పోలీసులు

### నేడు విజయవాడ కోర్టులో పిటిషన్

**విజయవాడ,నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** బెజవాడ పోలీసులకు చిక్కిన మావోయిస్టులను వారం రోజులు కస్టడీ కోరేందుకు విజయవాడ పోలీసులు చటపరం సన్నదమవుతున్నారు.మావోల కదలికలు, తదితర సమాచారం సేకరించేందుకు, దీనిపై లోతైన విచారణ జరపటానికి పోలీసులు ఈ నిర్ణయానికి వచ్చారు. కృష్ణాజిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన మొత్తం 28 మంది మావోయిస్టులను 3 దఫాలుగా పోలీసులు కస్టడీ కోరనున్నారు. మొదటగా 10 మందిని కస్టడీ కోరుతూ రేపు పిటిషన్ వేయనున్నారు. కృష్ణా జిల్లా పోలీసులు గత కొద్ది రోజులుగా నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో మొత్తం 28 మంది మావోయిస్టు నేతలు, క్యాడర్‌లను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరిలో నలుగురు సీనియర్ మావో నాయకులు కూడా ఉన్నారు. ఇప్పుడు పోలీసులు ఈ నలుగురి సహా మొత్తం 28 మందినీ పోలీస్ కస్టడీకి తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. రేపు (నవంబర్ 24) మొదటి దఫాలో మొదటి 10 మంది కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. అరెస్టయిన వారిలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ఉన్నారు. వీరి ద్వారా మావోల రహస్య స్థావరాలు, ఆయుధ డంపులు, ఫైనాన్స్ ఛానెళ్లు, కొత్త రిక్రూట్‌మెంట్ నెట్‌వర్క్ గురించి లోతైన సమాచారం సేకరించాలి. ఇటీవల ఏపీ, తెలంగాణ, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోల కదలికలు పెరిగాయన్న నిఘా నివేదికలు ఉన్నాయి. ఈ తరుణంలోనే పోలీసులు దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నవంబర్ 24న మొదటి బ్యాచ్ - 10 మంది, నవంబర్ 26, 28 తేదీల్లో మిగతా 18 మందిని కస్టడీకి కోరబోతున్నారు. అరెస్టయిన వారిలో మహిళలు, విద్యార్థులు, మాజీ ఉద్యమకారులు కూడా ఉన్నారని, వీరంతా కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో దాగి ఉంటూ పార్టీ పనులు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## తిరుమల సమాచారం



### శ్రీవారి ఆశీస్సులతో సకలశుభాలు

#### హైకోర్టు జడ్జి మానవేంద్రరాయ్

**తిరుమల,నవంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతో మనస్సు ఆనందంగా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ మానవేంద్రరాయ్ తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో అందరికీ సకలశుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్న న్యాయమూర్తి తోలుత ధ్వజస్తంభానికి నమస్కరిం చారు. ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టును దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



### తిరుమలేశుని దర్శనంతో సకలశుభాలు

**తిరుమల,నవంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో సకలశుభాలు కలుగుతాయని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. తిరుమలకు వచ్చిన భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో మాజీ ఎంపి మోపిదేవి వెంకటరమణ, ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ దంపతులు, సినీనటి నిక్కీగల్రానిలు కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### 28నుంచి షోడశదిన సుందరకాండ పారాయణం

**తిరుమల,నవంబరు 23ప్రభాతవార్తప్రతినిధి:** లోకకల్యాణం కోసం తిరుమలలోని వసంతమండపంలో ఈనెల 28వతేదీ నుండి డిసెంబర్ 13వరకు షోడశదిన సుందరకాండ పారాయణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఈనెల 27వతేదీ సాయంత్రం ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో అంకురార్పణ చేపడతారు. ఈ పారాయణంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8.30గంటల నుండి 9.30 గంటల వరకు తిరుమల వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్టానం నిర్వహిస్తారు. డిసెంబర్ 13వతేదీ ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు వేదవిజ్ఞానపీఠంలో పూర్ణాహుతితో ఈ కార్యక్రమం పరిసమాప్తమవుతుంది. ఈ ఏర్పాట్లను ప్రిన్సిపాల్ కుప్పాశివ సుబ్రమణ్య అవధాని పర్యవేక్షిస్తున్నారు.

## రాష్ట్రాన్ని దోచుకుంటున్న కూటమి నేతలు: మాజీ మంత్రి పేర్నినాని

**విజయవాడ,నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని కూటమి నేతలు దోచుకుంటున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, కొబ్బరి, పామాయిల్, ధాన్యం ఇలా ఏ పంటకూ ధర లేదన్నారు. రైతులు దెబ్బతింటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అయిన తరువాత చంద్రబాబు ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా తీసుకురాలేదని పేర్కొన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుతుంటే చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కోర్టు విచారణలో ఉండగా వీడియో తీసేందుకు ఎవరు అనుమతినిచ్చారని ఆయన ప్రశ్నించారు. కోర్టు వీడియోను విడుదల చేయడం నేరమని, దీనిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### పేరాయిపల్లెమెట్ట వద్ద ఘోర ప్రమాదం

## ఇద్దరు అక్కడికక్కడే మృతి

### ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

**నంద్యాల, నవంబరు 23,ప్రబాతవార్తప్రతినిధి:** కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలో ఆళ్లగడ్డ మండల పరిధిలోని పెరాయిపల్లె మెట్ట వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈదుర్ఘటనలో ఇద్దరు మృతి చెందగా 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషయమంగా ఉండడంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్, రూరల్ సిఐ మురళీదర్‌రెడ్డి, ఎస్ఐ వరప్రసాద్‌తో పాటు సిబ్బందితో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైత్రి ట్రావెల్స్‌కు చెందిన హైదరాబాద్ మియాపూర్ నుండి శనివారం రాత్రి బయలుదేరి పాండిచేరి (పుదుచ్చెరి) వెళ్తుండగా ఆదివారం తెల్లవారుజామున పేరాయిపల్లె గ్రామం వద్ద ప్రయాణికులు టాయిలెట్స్ కోసం అగివున్న బస్సును వెనుక వైపు నుండి లారీ ఢీకొనడంతో బస్సు ముందర అగివున్న లారీని బలంగా ఢీకొనడంతో బస్సులో వెనుకవైపు కూర్చొన్న తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన గడ్డం బద్రినాథ్ (25), పుదుచ్చేరికి చెందిన హరిత (22) ఇద్దరు మరణించారు. ఇద్దరు ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన సంఘటనలో మైత్రి ట్రావెల్స్ బస్సు ముందు వెనుకభాగాలు దెబ్బతిన్నాయన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆళ్లగడ్డ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం తరలించారు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు రోప్ సహాయంతో బయటకు తీసుశారు. ప్రమాద ఘటన తెలియగానే జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఘటన స్థలాన్ని సందర్శించి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను అదేశించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలు అరాతీశారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను అదేశించారు. కాగా సంఘటన స్థలాన్ని డిటివో శివారెడ్డి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ నాయక్ పరిశీలించారు. మృతిచెందిన బద్రినాద్, హరితలు స్నేహితులు వీరిద్దరు పాండిచ్చేరికి వెళ్లి అక్కడి స్నేహితులతో వీకెండ్‌కు వెళ్లాలనుకున్నారు. ఇది ఇలా ఉండగా జాతీయ రహదారిపై వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో స్థానికులు తీవ్ర అందోళన చెందుతున్నారు.



వార్త

అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

-మహాత్మాగాంధీ

# కార్మిక స్మృతి పథం!

నిరంతరం హక్కులు బాధ్యతల మధ్య నలిగిపోయే కార్మిక సమాజానికి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను వరప్రసాదంగా అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం భద్రతను లక్ష్యంగా పెట్టుకుని ఈ కోడ్‌లగమనాన్ని కసరత్తు చేశారు. ఈ నాలుగు కార్మిక స్మృతులుఅమల్లోకి రావడంతో కార్మికులందరికీ సామాజిక భద్రతఏర్పడ్తుంది. ఎన్నాళ్లుగానో ప్రభుత్వం కార్మిక చట్టాలను సంస్కరించాలని చూసినా కార్మిక సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. కొన్ని అంశాలపై కేంద్రానికి కార్మిక సంఘాలకు మధ్య ఏకాభిప్రాయం రాలేదు. దశాబ్దాల నాటి పాత 29కార్మిక చట్టాల స్థానంలో కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు నిర్ణయించారు. దేశ స్వాతంత్ర్య ఫలసాధన తర్వాత తొలిసారిగా కార్మిక చట్టాలకు నిజాయితీగా రూపకల్పన చేసినట్లు కేంద్రం ప్రకటించుకుంది. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న నాలుగుస్మృతులను తక్షణమే అమల్లోకి తెస్తున్నట్లు శుక్రవారం కేంద్రం ప్రకటించింది. ఈ సంస్కరణలన్నీ నారీశక్తి,యువశక్తికి మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని, సార్వత్రిక సామాజిక భద్రతకు పటిష్టమైన పునాదులు వేస్తాయని ప్రధాని నరేంద్రమోడీ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, ఠంచనుగా వేతన బట్వాడా మహిళా సాధికారత, సామాజిక భద్రత అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో సంస్కరణలు రూపొందించినట్లు కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయా కూడా ఢంకా భజాయించి చెబుతున్నారు. ప్రధానంగా అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు సంపూర్ణ రక్షణ లభిస్తుంది. ఉపాధిని సంఘటితపరచడం కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం,కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతోపాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చుననే బలమైనఅభిప్రాయంతో కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఈ స్మృతులను రూపొందించింది. ఇవి ఆత్మనిర్భర భారత్‌కు పునాదుల్లాంటివని విశ్వాసంతో ముందుకు కదులుతున్నారు. కాలం చెల్లిన చట్టాలను సుసంపన్నమైన రీతిలో తిరగరాయించడంలో కార్మిక సంక్షేమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త చట్టాలకు రూపకల్పన చేశారు. ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ పని విధానాలు పూర్తి భిన్నంగా ఉన్న పరిస్థితుల్లో క్రోడీకరించుకున్న చట్టాలు దేశ కాల మాన పరిస్థితుల రీత్యా కార్మిక సంస్కరణలు తప్పలేదు.ఎన్నోదేశాలు తమ కార్మిక చట్టాలను సవరించుకుంటూ వస్తున్నా భారతదేశంలో కార్మిక ఉద్యమం బలీయంగా ఉన్నందున కొంత జాప్యమే జరిగింది.ఎప్పటికైనా సంస్కరణలు తప్పవు.అవి ఇప్పుడు అమల్లోకి వచ్చాయి. 2019-20లో పార్లమెంట్‌లో ఆమోదించిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను తాజాగా నోటిఫై చేసినందున తక్షణం అమల్లోకి వస్తాయి. 45 రోజుల్లో ఈ కోడ్‌లకు సంబంధించిన విధి విధానాలను, నియమ నిబంధనలను కార్మికలోకం ముందుంచుతారు.చట్టం అమల్లోకి వచ్చినందున ఇకపై కార్మికులెవరైనా రోజుకు 8-12 గంటల చొప్పున అంటే వారంలో గరిష్ఠంగా 48గంటలు విధులు నిర్వహించవచ్చు. కాగా ఓవర్‌టైమ్ డ్యూటీ చేస్తే అట్టి కార్మికులకు రెట్టింపు వేతనం ఇవ్వాల్సి ఉంటుంది. కష్టేఫలి అన్నమాట. వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్,వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పనిప్రదేశంలో పనిచేసే పరిస్థితుల కోడ్ ఇవన్నీ కార్మిక సంరక్షణ భద్రతలకు లోబడి ఈ జాబితాలో సమకూర్చారు. 40కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభించే మార్పులివి. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఏడాది సర్వీసు ఉంటే గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు దక్కుతాయి. 2047 కల్లా అభివృద్ధి చెందిన స్వయం సమృద్ధ భారత్‌గా ఎదిగేందుకు ఇవన్నీ మంచి మార్గదర్శకం చూపుతాయన్న ఆశయం నెరవేరితే మంచిదే. కొత్త కోడ్‌ల కింద ఉద్యోగులందరికీ నియామక పత్రాలు ఇవ్వడం యాజమాన్యం బాధ్యత. అలా ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు తప్పవు. ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. కనుక కార్మికులు ఎంతో సంతోషంగా ఉంటారని ప్రభుత్వం భావిస్తుండగా ట్రేడ్‌లేబర్ యూనియన్‌లు మాత్రం ఈకోడ్‌లకు కొత్తభాష్యం చెబుతున్నాయి.కంపెనీల మూసివేత, ఉద్యోగాల కోత, సమ్మె, కనీస వేతనాల్లో స్పష్టత ఏ అంశం గురించి విశ్లేషించినా అవి యాజమాన్యాలకే ప్రయోజనం కలిగిస్తాయని ఆరోపిస్తున్నారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం నెలకు 26వేలుగా నిర్ణయించాలని కార్మిక సంఘాలు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆకస్మిక నిరసనలను వ్యక్తంచేసే అవకాశం ఇవ్వకుండా కార్మికుల గొంతును నొక్కివేసినట్లు అవుతుందని భావిస్తున్నారు. కార్మికుల విషయంలో కంపెనీలు చేసే అపరాధాలకు కేవలం జరిమానాలతో సరిపెట్టింది. జైలు శిక్ష అన్నదే లేకుండా యాజమాన్యాలకు వెసులుబాటు. వెన్ను విరిచే విధంగా ఎలాంటి శిక్షలు లేకపోతే వారికి కార్మికులంటే చులకన భావం ఏర్పడ్తుంది. ప్రమాదకర పరిస్థితుల మధ్య పనిచేసే కార్మికుల ఆరోగ్యం వంటిఅంశాలపై ప్రత్యేకంగా నిర్ణయించింది. ఏమీ లేదని సంఘాలు గొంతెత్తి అరుస్తున్నాయి. గిగ్, ప్లాట్ ఫారమ్ వర్కర్ల స్థితిగతుల బాగుకు నిర్దిష్ట విధివిధానాలు రూపొందించారు. వీరు ఇతర రాష్ట్రాలకు వెళ్లినా సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆగిపోకుండా మార్గం చూపారు. వలస కార్మికులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ద్వారా మేలు కలుగుతుంది. డాక్ వర్కర్లు, ఐటి ఉద్యోగులు, ఔళి కార్మికులు, గని కార్మికుల ప్లాంటేషన్ వర్కర్లు సంక్షేమ ప్రయోజనాలపై కేంద్రప్రభుత్వం విస్తృతంగా విశ్లేషించింది. ఎన్నో కోణాల నుంచి ఆలోచించి చట్టాలు వాటి విధి విధానాలను రూపకల్పన చేసినా అమలులో వెనుకబడితే అంతా బూడిదలో పోసిన పన్నీరే.

చేయగలిగే శక్తి ఉన్నవాడి కంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.



జి. ముర్రే

నైతిక విలువలు విడిచిపెట్టి, పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా అది భక్తి కాదు, రాక్షసభక్తి.



బెర్నార్డ్ షా

# సమాచార హక్కు సామాన్యులకు ఎండమావేనా!

***దేశంలో కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరుగా సమాచార హక్కు కమిషన్లు ఉన్నప్పటికీ ఎవరూ చట్టాన్ని సరిగా అమలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్రాల్లోని కమిషన్లలో ఏటేటా లక్షల్లో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. అప్పీళ్లపైనా విచారణ వేగంగా, సరిగా జరగడంలేదు. ఆర్టీఐ కమిషన్ల నియామకాల్లోనూ రాజకీయ అధికార జోక్యం కూడా ఎక్కువే. సకాలంలో నియామకాలు చేయడం లేదు. కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయి. నిబద్ధత కలిగిన వ్యక్తులను నియమించడం లేదు. ఇలాంటి ఆరోపణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. ఇవి సందర్భానుసారం సామాజిక మాధ్యమాల్లోనూ చూస్తుంటాం కూడా. 2019లో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 13, 16లను కేంద్ర ప్రభుత్వం సవరించి సమాచార కమిషనర్ల పదవీ కాలాన్ని నిర్ణయించే బాధ్యతను కట్టబెట్టుకుంది. కేంద్రం తీరుతో సమాచార కమిషనర్ల స్వతంత్రతకే ముప్పు తలెత్తిందని, సమాచార హక్కు చట్టం ఉనికి ప్రమాదమని సమాచార నిపుణుల నుంచి విమర్శలెన్నో వచ్చాయి. ఆర్‌టీఐ జబ్బు పడిన చట్టంగా మారిందని వ్యాఖ్యలు కూడా చేశారు.***

డాక్టర్.చంటి

ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వాలు నాలుగు గోడల మధ్యలో పాలన చేస్తున్నట్టు కాకుండా పారదర్శకంగా చేస్తున్నట్టు ఉండాలి. పౌరులకు తెలియని స్థలమనేది ఉండకూడదు. రహస్య ప్రాంతాల్లో అవినీతి పెరిగిపోతుంది. అదే బహిరంగ ప్రదేశాల్లోనైతే నిర్మూలించబడుతుంది అని అమెరికా మాజీ అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ అన్నారు. మన దేశంలో సమాచార హక్కు చట్టం ( రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ -2005 ) అమలులోకి వచ్చి ఇరవై ఏండ్లు పూర్తిఅయ్యింది. దేశ ప్రజాస్వామ్య పునాదిని పటిష్టంగా ఉంచే కీలకమైన చట్టాల్లో ఇది ఒకటి. ఓటు హక్కు తర్వాత అంతటి ప్రాధాన్యత కూడా దీనికే ఉంది. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలైన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఇన్నేళ్లయినా కానీ ఆర్టీఐ అమలు తీరు మేడి పండు చందంగానే ఉంది. సమాచార పారదర్శకతపై ప్రభుత్వాలు, అధికారులు చెప్పే మాటలకు చేతల్లో పొంతనే లేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఆఫీసుల్లో పాలన రికార్డుల వివరాలను పొందడానికి ఎన్నో సవాళ్లను, అడ్డంకులను, వైఫల్యాలను ఎదుర్కొంటున్నారు. దీనికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్లు, వ్యవస్థాగత లోపాలు వంటివే కారణాలుగా ఉన్నాయని చెప్పొచ్చు.రాజ్యాంగం తర్వాత అంతటి ప్రాముఖ్యత ఆర్టీఐకే దక్కింది. పార్లమెంట్ చేసిన చట్టాల్లో ఇదొక మైలురాయిగా నిలిచిపోయింది. అవినీతి నిర్మూలన, విధుల్లో బాధ్యతారాహిత్యాన్ని తగ్గించడంతోపాటు పారదర్శకతను పెంపొందించడం, సుపరిపాలనను అందించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యాలుగా ఉన్నాయి. పంచాయతీ నుంచి ప్రధాని ఆఫీసుదాకా.. వివిధ స్థాయిల్లో జరిగే అవినీతిని బయటపెట్టడం, జవాబుదారీతనాన్ని పెంచడం, అభివృద్ధి, సంక్షేమాలపై తెలుసుకోవడం, ప్రభుత్వ రికార్డుల తనిఖీ ఆర్టీఐ సామాన్యులకు కల్పించిన ఒక ప్రధాన అస్త్రం కూడా. ఇది అమలులోకి వచ్చి ఇరవై ఏళ్లు అయినా దీనికి తొలి అడుగు పడినది దశాబ్దాల కిందటే అని చెప్పొచ్చు. 1976లో ఉత్తరప్రదేశ్ స్టేట్ వర్సెస్ రాజ్ నారాయణ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పునిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పని తీరుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తప్పకుండా ఇవ్వాల్సిందే.! సమాచార హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగమని, స్వేచ్ఛ హక్కు 19(1)(ఏ)లో ఇమిడి ఉందని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతనే సమాచార హక్కు చట్టం రూపొందించుకోవాలనే ఆలోచన పాలకుల్లో వచ్చింది. అనంతరం 2005 నుంచి అమలులోకి వచ్చింది.

రెండు దశాబ్దాల కాలంలో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారులు సాధించిన విజయాలెన్నో ఉన్నాయి. ఇందుకు ఉదాహరణగా 2జీ స్పెక్ట్రం కేటాయింపులు,కామన్వెల్త్ గేమ్స్, కోల్ గేట్‌స్కామ్ అవినీతి గుట్టు బయట పెట్టడంలో ఆర్టీఐ కీలకంగా నిలిచింది. జాతీయ ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్, రికార్డుల తనిఖీలో ఎంతో సమర్థవంతంగా వినియోగించుకునేలా దోహదపడింది. ఇకదరఖాస్తుదారులకు అడ్డంకులు కూడా చాలా ఎక్కువే. సమాచారం ఇచ్చేందుకు




అధికారులు కావాలనే ఆలస్యంచేయడం, లేదా అసంపూర్తిగా ఇవ్వడం, లేదంటే దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితులను నూటికి తొంభై శాతం మంది ఎదుర్కొంటుంటారు. అవినీతి బహిరంగ పరిచే ఆర్టీఐ కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడడం, దాడులు వంటివి చేస్తున్నారు. ఇప్పటివరకు వందల మంది కార్యకర్తలు హత్యకుగురయ్యారు. వేలమంది దాడులు ఎదుర్కొన్నారు.దేశంలో సామాన్యులు సమాచార హక్కును పొందడంలో ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులను ఎదుర్కొంటున్నట్టు సర్వేలు తేల్చిచెబుతున్నాయి. 30 రోజుల గడువులోపు ఇవ్వాల్సిన సమాచారానికి నెలల,ఏండ్లకు ఏళ్లు ఎదురు చూడాల్సి పరిస్థితులు నెలకొన్నాయి.ఇందుకు ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం, పారదర్శకత పాటించకపోవడం కారణాలని సమాచారనిపుణులు సైతం పేర్కొంటున్నారు. దేశంలోని పౌరులకు ఆర్టీఐ ఒక శక్తిమంతమైన సాధనం అయినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో సరిగా అవగాహన కల్పించడం లేదు.ప్రచారం చేయడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మందికి ఆర్టీఐ ఉందనేది కూడా తెలియదు.తద్వారా ఆఫీసుల్లో సమాచారాన్ని పొందే హక్కు సామాన్యులకు దక్కడం లేదు. పాఠశాల స్థాయి నుంచే సమాచార హక్కు ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించాలి. కేంద్ర, రాష్ట్రాల కమిషన్ల వెబ్ సైట్లు కూడా యూజర్ ఫ్రెండ్లీగా లేవు. అప్లికేషన్ల ఫాలోఅప్, ఓటీపీల్లో లేట్, పేమెంట్ ఫెయిల్యూర్లు వంటి టెక్నికల్ ఇష్యూలు దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారాయి. దరఖాస్తుదారులు కావలసిన సమాచారం పొందేందుకు నగదును చెల్లిస్తున్నా.. సమాచారం ఇవ్వకుండా.. చట్టాన్ని సరిగా అమలు చేయకుండా నీరుగార్చుతున్నారు. ఇలాంటివి కూడా చట్టాన్ని బలహీనం చేస్తూ పారదర్శకతకు విఘాతంగా మారాయి. ఆర్టీఐ కమిషన్లను బలోపేతంచేసి.. డిజిటల్ టెక్నాలజీని మెరుగుపరచాలని దరఖాస్తుదారులు, సమాచార నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్టీఐ విజయవంతం అమలవ్వాలంటే కమిషన్లను క్రమానుగతంగాబలోపేతం చేస్తుండాలి. మౌలిక వసతులు కల్పిస్తుండాలి.దరఖాస్తులను, అప్పీళ్లను సకాలంలో పరిష్కరించాలి. ఇలా సమాచారం వేగంగా, స్పష్టంగా పొందినప్పుడే సామాన్యులుప్రజాస్వామ్య వ్యవస్థలో చురుకుగా భాగస్వాములవుతారు.ఇలా చేయాల్సిన బాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంది. ఆఫీసుల్లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శిస్తుంటే ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తారు. మెరుగైన సేవలను అందడంతోపాటు అధికారుల్లో పారదర్శకత కూడా పెరుగుతుంది. అవినీతి తగ్గుతుంది. ఇలాంటి చర్యలు తీసుకున్నప్పుడే ప్రజాస్వామ్య విజయవంతానికి ఓటు హక్కు మాదిరిగానే సమాచార హక్కు తయారవుతుంది. దేశంలో కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరుగా సమాచార హక్కు కమిషన్లు ఉన్నప్పటికీ ఎవరూ చట్టాన్ని సరిగా అమలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్రాల్లోని కమిషన్లలో ఏటేటా లక్షల్లో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. అప్పీళ్లపైనా విచారణ వేగంగా, సరిగా జరగడంలేదు. ఆర్టీఐ కమిషన్ల నియామకాల్లోనూ రాజకీయ అధికార జోక్యం కూడా ఎక్కువే. సకాలంలో నియామకాలు చేయడం లేదు. కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయి. నిబద్ధత కలిగిన వ్యక్తులను నియమించడం లేదు. ఇలాంటి ఆరోపణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. ఇవి సందర్భానుసారం సామాజిక మాధ్యమాల్లోనూ చూస్తుంటాం కూడా. 2019లో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 13,16లను కేంద్ర ప్రభుత్వం సవరించి సమాచార కమిషనర్ల పదవీ కాలాన్ని నిర్ణయించే బాధ్యతను కట్టబెట్టుకుంది. కేంద్రం తీరుతో సమాచార కమిషనర్ల స్వతంత్రతకే ముప్పు తలెత్తిందని, సమాచార హక్కు చట్టం ఉనికి ప్రమాదమని సమాచార నిపుణుల నుంచి విమర్శలెన్నో వచ్చాయి. ఆర్‌టీఐ జబ్బు పడిన చట్టంగా మారిందని వ్యాఖ్యలు కూడా చేశారు. ●

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అవసరం!

కె. విజయ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం అని పదేపదే చెబుతున్నప్పటికీ, కనిపిస్తున్న వాస్తవాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. నిజమైన బలోపేతం అంటే పిల్లల సంఖ్య పెరగాలి, సరిపడా ఉపాధ్యాయులు ఉండాలి, వారికి బోధనకు పూర్తి స్థాయి సమయం ఉండాలి, పాఠశాలల్లో గుణాత్మక విద్య వికసించాలి. కానీ నేడు ఈ అవసరాలకు బదులుగా సమస్యలే పెరుగుతున్నాయి. గత మూడు విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఇలాతగ్గిపోయింది. 2023-24లో 81,08,406 మంది విద్యార్థులుండగా 2024-25లో 78,69,714, 2025-26కి76,02,854 తగ్గిపోతూ వస్తున్నది. ప్రతి సంవత్సరం లక్షల్లో పిల్లలు ప్రభుత్వ పాఠశాలల నుండి జారిపోతుంటే, ఇది బలోపేతానికి సంకేతమా లేక బలహీనతకా? గత ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలను ప్రస్తుత ప్రభుత్వం అప్పుడు విమర్శించింది. ఇప్పుడు వాటిని రద్దు చేయకుండా అదే దారిలో మరిన్ని దుష్పరిణామక చర్యలను తీసుకువస్తున్నది. విద్యా సంవత్సరం మొదలైన రోజు నుంచే పాఠాలు చెప్పే అవకాశాన్ని యాప్లు, రికార్డులు, మీటింగ్లు, అప్రయోజక కార్యక్రమాలు అడ్డుకుంటున్నాయి. లీప్ యాప్లో 70 రకాల టైల్స్, విద్యామిత్ర, ఐఎమ్ఎమ్ఎస్, దీక్ష, పిఎం,ఎస్ఎఎస్ఏ వంటి అప్లికేషన్ల పనులు ఉపాధ్యాయుల సమయాన్ని పూర్తిగా ఆక్రమిస్తున్నాయి. ఆన్లైన్ ట్రైనింగులు, 20 రోజులపాటు యోగా డే, మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాలు ఇవన్నీ కలిపి బోధనా పీరియడ్లను తీవ్రంగా తగ్గించాయి. పరీక్షల మూల్యాంకనం గందరగోళంగా ఉందని ఉపాధ్యాయుల అభిప్రాయం. ఎన్ఇపి విధానాల బలవంతపు అమలు పరిస్థితులను మరింత క్లిష్టం చేశాయి. ఇతర రాష్ట్రాల్లో ఎప్పుడూ చూడని విధంగా ఉపాధ్యాయులు "పాఠాలు చెప్పనీయండి' అంటూ ఉద్యమానికి దిగాల్సిన పరిస్థితి వచ్చింది.



పిల్లలు తగ్గిపోతున్నారు, ఉపాధ్యాయులు తగ్గుతున్నారు, తరగతులు విలీనమవుతున్నాయి. పాఠశాలలు మూతపడుతున్నాయి. 9 రకాల పాఠశాలలతో గందరగోళం పెరిగింది. ఈ పరిస్థితుల్లో విద్యను బలోపేతం చేస్తామనడం ఎలా నమ్మాలి? ఉపాధ్యాయుల బోధనకన్నా డిజిటల్ ట్రాకింగ్, యాప్లు, గణాంకాలు ముఖ్యమయ్యాయి. పిల్లల అభ్యసనానికి అవసరమైన వాతావరణం బలహీనమైంది.వర్క్ ఫౌండేషన్, ఎన్ఎఫ్ఇఆర్ నివేదికల ప్రకారం ఉపాధ్యాయులు అత్యధిక ఒత్తిడికి గురవుతున్నారు. సెలవుల్లో కూడా వృత్తికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. నిరంతరఆన్లైన్ గణాంకాల సమర్పణ ఒక నియమంగా మారింది. 35 దేశాల సర్వేలో భారత యువత ఉపాధ్యాయ వృత్తిని8వ స్థానంలో మాత్రమే ఎంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్లో ఉపాధ్యాయులపై జరుగుతున్న ఒత్తిడి, గౌరవహీనత దీనికి ప్రధాన కారణాలు. మాతృభాషలో బోధన నిలిపివేత, పూర్తిగా ఆంగ్ల మాధ్యమం, 9 రకాల పాఠశాలలు, సింగిల్ మీడియం కారణంగా ఉపాధ్యాయుల తగ్గింపు, ప్రాథమిక పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల బదిలీలు, 12వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు, బడ్జెట్ కేవలం రూ.10 కోట్లు మాత్రమే. ఒకే ఏడాదిలో 2,66,860 మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకుమారడం. ఈ సంఖ్యలు ప్రభుత్వ విద్యావ్యవస్థపై పెరిగిన అనుమానం విధానాల వైఫల్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. నష్టదాయక సంస్కరణలను తక్షణం రద్దు చేయాలి. ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలి. పరీక్షా, మూల్యాంకన విధానాల పునర్విమర్శ, ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక నిధుల కేటాయింపు, ఎన్ఇపి 2020 రద్దు, రాష్ట్ర అవసరాలకు అనుగుణమైన విధానం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో విస్తృత చర్చలు చేయాలి. విద్యారంగం బలోపేతం కావాలంటే మాటలు కాదులోపాలను అంగీకరించి, విధానాలను సరిచేసి, ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచేదిశగా ప్రభుత్వం నడవాలి.విద్యను వ్యాపారీకరణ వైపుకు లాకెళ్లే మార్గాలను విడనాడి, పిల్లల అభివృద్ధి కేంద్రంగా ఉండే పాఠశాల వ్యవస్థను పునర్నిర్మించడం ద్వారా మాత్రమే నిజమైన బలోపేతం జరుగుతుంది. ●

# కుటీర పరిశ్రమలే సాంకేతిక విప్లవ మూలాలు

చిటికెన కిరణ్ కుమార్

మనిషి జీవనప్రస్థానంలో నిత్యం ముందడుగు వేస్తూ వచ్చిన ప్రధానమైన శక్తి సృజనాత్మకత. ఆ సృజనాత్మకత మొదట చూపిన రూపం చేతివృత్తులు. మట్టి ముద్దతో కుండలు చేయడం నుంచి, చేనేత బట్టలు నేయడం వరకు, చెక్కతో పనిముట్లు తయారు చేయడం నుంచి లోహాలతో ఆయుధాలు మలచడం వరకు అన్నీ మొదటి దశల సాంకేతిక ఆవిష్కరణలే. ఇవే తర్వాతి తరాల శాస్త్ర విజ్ఞానానికి పునాదులయ్యాయి. చేతివృత్తుల పుట్టుకలో విజ్ఞాన విత్తనాలు ప్రాచీన కాలంలో మనిషి ప్రకృతిని పరిశీలిస్తూ తన అవసరాలకు అనుగుణంగా సాధనాలను రూపొందించుకున్నాడు. మట్టి, చెక్క, రాయి, లోహాలు వంటి సహజ వనరులను ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకున్నాడు. ఒక కుండ తయారు చేయడానికి అవసరమైన తిప్పే చక్రం సూత్రం, చక్రం నుంచే రవాణా సాంకేతికత పుట్టుకకు దోహదపడింది. చేనేత బట్టలు నేయడానికి ఉపయోగించిన నూలు ముగ్గు సూత్రం, నేటి ఆటోమేటిక్ లూమ్స్, కంప్యూటరైజ్డ్ టెక్స్టైల్ పరిశ్రమలకు బీజమైంది. కుటీర పరిశ్రమలు అంటే కుటుంబ స్థాయిలో, గ్రామస్థాయిలో జరిగే ఉత్పత్తి కార్యకలాపాలు. ఇవి పెద్ద పరిశ్రమల పుట్టుకకు ముందు వాణిజ్యానికి, శిల్పకళకు, పరిశ్రమలకు విత్తనాలు వేశాయి. ఉదాహరణకు, లోహ పనులు చేసిన చిన్న చిన్న వర్క్‌షాప్‌లు నేటి భారీ మెటలర్జీ పరిశ్రమలకు పునాది. మట్టి పనులు చేసిన కుంచెలు, ఇటుకల తయారీదారులు నేటి సిమెంట్, నిర్మాణ రంగానికి మార్గదర్శకులు. చేనేత బట్టలు నేసిన నేయుగాళ్లు నేటి టెక్స్టైల్ మిల్స్‌కి ఆద్యులు.మొదటి మానవుడు వాడిన రాయి పరికరం, తర్వాతి తరాల మెషిన్ టూల్స్‌కు మార్గం చూపింది. కుండ చక్రం నుంచి మిల్లులు, ఆ తర్వాత విద్యుత్ ఆధారిత యంత్రాల వరకు మార్పు ఒకే పంథా. కుటుంబ అవసరాల కోసం తయారీ నుంచి మార్కెట్‌కి సరఫరా చేసే దిశగా ప్రయాణం మొదలైంది. ఇది ఆధునిక గ్లోబల్ ట్రేడ్‌కు పునాది. లోహం కరిగించడం, రంగులు తయారు చేయడం, నూలు మలచడం ఇవే తర్వాతి రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, యంత్ర శాస్త్రానికి మొదటి పాఠాలు. నేటి సాంకేతిక ప్రపంచంపై పభావం ప్రస్తుత డిజిటల్ యుగంలో కూడా చేతివృత్తుల ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తాయి. ఒక మొబైల్ ఫోన్ రూపకల్పనలోనూ, ఒక కంప్యూటర్ ప్రోగ్రాం నిర్మాణంలోనూ 'హ్యాండ్‌మేడ్' ఆలోచనలే పునాది. ఉదాహరణకు, నూలు ముగ్గులో ఉన్న పద్ధతి ఆధారంగా పంచ్ కార్డులు తయారై, అవే మొదటి కంప్యూటర్లకు డేటా ప్రాసెసింగ్ సిస్టమ్స్ అయ్యాయి. ఇదే కుటీర పరిశ్రమలు ఇచ్చిన సాంకేతిక వారసత్వం. చేతివృత్తులు కేవలం ఆర్థిక అవసరాలకే కాకుండా, ఒక సమాజపు సాంస్కృతిక స్వరూపాన్ని



కూడా ప్రతిబింబించాయి. కుండలు, బొమ్మలు, చేనేతలు, చెక్క పనులు ఇవి మన కళాత్మకతను ప్రపంచానికి చూపించాయి. అదే సృజనాత్మకత ఆధునిక డిజైన్ టెక్నాలజీలలో కొనసాగుతోంది. ముగింపు ఆలోచన నేటి సాంకేతిక విప్లవం ఒకే రోజులో పుట్టినది కాదు. ఇది శతాబ్దాల కృషి, అనుభవం, పరిశోధన, ప్రయోగాల ఫలితం. ఆ ప్రయాణంలో మొదటి అడుగులు వేసింది చేతివృత్తులే. కుటీర పరిశ్రమలు సమాజానికి ఆర్థిక స్వావలంబన ఇచ్చినట్లే, శాస్త్ర సాంకేతిక విప్లవానికి ఆలోచనా శక్తి, ప్రయోగ పటిమ అందించాయి. కాబట్టి మనం ఈ రంగాలను కేవలం సంప్రదాయం అని చూసుకోకుండా, నేటి టెక్నాలజీ మూలాలు అని గౌరవించాలి. ప్రపంచ నాగరికత గమనాన్ని వెనక్కి తిప్పి చూస్తే, ప్రతి అభివృద్ధి వెనుక ఒక చేతివృత్తి జాడ తప్పక కనిపిస్తుంది. మనిషి తన చేతులతో సృష్టించిన వస్తువులు కాలక్రమేణా యంత్రాల రూపంలో విస్తరించాయి. ఒక బుట్ట నేసిన పద్ధతి నేడు ప్లాస్టిక్ మోల్డింగ్ పరిశ్రమగా మారింది. ఒక గిన్నెను మలిచిన కళ నేడు ఆటోమేటెడ్ సిరామిక్స్ పరిశ్రమగా అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో, చిన్న స్థాయి వృత్తులు ఎప్పుడూ పెద్ద మార్పులకు ద్వారం తీశాయి. మనిషి మొదటిసారి మట్టిని ఉపయోగించి పళ్లెం, కుండ వంటివి చేసినప్పుడు, పదార్థ శాస్త్రపు తలుపులు తెరిచాడు. ఇనుము కరిగించి పనిముట్లు చేసినప్పుడు, మెటలర్జీకి దారి చూపాడు. చేనేతలో రంగులు వేసినప్పుడు రసాయన శాస్త్రపు ప్రాథమికాలను తెలుసుకున్నాడు. ఒకే విత్తనం నుంచి వేల కొమ్మలు విరజిమ్మినట్లే, చేతివృత్తులే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వృక్షానికి మూలమయ్యాయి. కుటీర పరిశ్రమలు కేవలం కుటుంబ ఆర్థికస్థితిని బలోపేతం చేయడమే కాదు, సామాజిక వ్యవస్థలో సహకార భావనను పెంచాయి. ఒక గ్రామంలో వడ్రంగి, కులాయి, నేయుగాడు, బంగారు, కుంచె ప్రతీ వృత్తి ఒకదానిని మరొకటి పూర్తి చేస్తూ, సమాజానికి సమగ్రతను ఇచ్చింది. ఈ సహకార వ్యవస్థే ఆధునిక పరిశ్రమలలో 'టీమ్ వర్క్' అనే భావనకు పునాది అయింది. నేటి కార్పొరేట్ రంగాలు గర్వంగా చెప్పుకునే మేనేజ్‌మెంట్ సూత్రాలు, అప్పట్లో సహజంగా గ్రామజీవనంలో నడిచేవే. ఇండస్ట్రియల్ రివల్యూషన్ యూరప్‌లో పుట్టిందని చెప్పినా, దానికి కావలసిన ప్రాథమిక స్ఫూర్తి మానవ సమాజాలందరిలోనూ ఉన్న చిన్నస్థాయి వృత్తుల ద్వారానే వచ్చింది. కుదుర్చిన కర్రను చక్రంలా తిప్పడం, నూలును వడిగా కట్టడం, మెటల్‌ను పులుమడం ఈ సాధారణ ఆవిష్కరణలే శతాబ్దాల తర్వాత యంత్ర విప్లవానికి దారితీశాయి. మన సమాజంలో చేతివృత్తులు కేవలం సాంకేతిక పరిణామానికి మాత్రమే కాదు, సౌందర్యాన్వేషణకు కూడా బాట వేసాయి. ఒక మట్టి బొమ్మలోని రూపకల్పన, ఒక నకలులోనిఅందం, ఒక బట్టలోని నూలుపోగుల నైపుణ్యం ఇవి నేటి డిజిటల్ డిజైనింగ్ వరకు స్ఫూర్తినిచ్చాయి. కళ, శిల్పం, విజ్ఞానం, మూడు కలిసిన ప్రథమ వేదికే చేతివృత్తులు. ఈరోజు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ఇవి అంతరిక్షాన్ని తాకుతున్నా, వాటి విత్తనాలు మట్టిలోనే ఉన్నాయి. ఒక కూలీ చేతి చెమటలో, ఒక నేతవాళ్ల నూలు పోగులో, ఒక శిల్పి మలచిన విగ్రహంలో ఉన్నాయి. ఈ మూలాలను మరచిపోకుండా గౌరవించగలిగితేనే భవిష్యత్ సాంకేతికతకు దృఢమైన దారి సుగమమవుతుంది. ●

## ప్రజావాక్కు



### బిల్లులపై కాలపరిమితి!

ఈమధ్య గవర్నర్, రాష్ట్రప్రభుత్వానికి మధ్య వివాదాలు ఎక్కువవుతున్నాయి. కేంద్రంలోఒకపార్టీప్రభుత్వం, రాష్ట్రంలో తన్మదీయ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి వివాదాలు వస్తున్నాయి. రాష్ట్ర శాసన సభ ఆమోదించిన బిల్లు గవర్నర్ సంతకం పెడితేనే చట్టంగా మారుతుంది. ఆయన సంతకం పెట్టాలి, లేదా తిప్పి పంపాలి లేదా రాష్ట్రపతి అభిప్రాయాన్ని కోరుతూ పంపాలి. ఇలా ఏదో ఒక నిర్ణయం ఎప్పటిలోగా తీసుకోవాలన్నది రాజ్యాంగం చెప్పలేదు. అది ఆధారం చేసుకొని కొంతమంది గవర్నర్లు ఎటూతేల్చకుండా తీవ్రజాప్యం చేస్తున్నారు. ఇలాంటి కేసుల్లోగతంలోసుప్రీంకోర్టుతీర్పుఇచ్చిందిఏమంటే మరీజాప్యం చేసినబిల్లుల్ని ఆటోమేటిక్‌గా ఆమోదంపొందినట్లు. అయితే ఇప్పుడు అదే సుప్రీంకోర్టు అలా ఆటోమేటిక్ ఆమోదం అన్నది( డీమ్డ్‌అస్సెంట్) రాజ్యాంగ బద్ధం కాదంది. అలాగే రాష్ట్రపతి, గవర్నర్‌లు నిర్ణయం తీసుకోవడం పై ఎలాంటి గడువు లేదంది. పైగా వారి నిర్ణయాలు న్యాయ సమీక్షకు అతీతం అని కూడా అభిప్రాయ పడింది. అయితే బిల్లులపైజాప్యం చెయ్యడం అన్యాయమని తోస్తే వాటిపై కాల పరిమితి పెట్టే అవకాశంకోర్టు తీసుకుంటుందని చెప్పింది.

- డా.డి.వి.జి. శంకరరావు,పార్వతీపురం

### దూది రైతుకు దుఃఖం

పత్తి బాగా పండించే తెలంగాణ అందులో ఒక్క ఉత్తర తెలంగాణలోనే 20లక్షల ఎకరాలకు పైగా పత్తిసాగు చేసే నేపథ్యంలో ఆదిలాబాద్ వరంగల్ లాంటి జిల్లాల రైతులు ఆగం అవుతున్న పరిస్థితి ఉంది. బయట అమ్ముకుందాం అంటే క్వింటాలుకు 1500 పైన నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. ఇది పొడుగు పింజ పత్తి పండించే తెలంగాణ లాంటి రాష్ట్రాలకే పెను శాపంగా మారింది

- భారత అవినాష్, జనగామ

### నీటిపారుదల సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్రంలోని పట్టా కలిగిన బీడు భూములను సాగు చేయడానికిఉపాధిహామీ ద్వారా అవకాశంఉంది. అయితే భూమి చదును కార్యక్రమాల కింద విస్తృత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ఉత్తర తెలంగాణలోనే కాదు దేశంలోనే వ్యవసాయ అవసరాల కోసమే నిర్మించినప్రాజెక్టులు, డ్యాంతోతెలంగాణలో నీటి పారుదల సౌకర్యాలు పెరిగినవి.

-కె.మురళీకృష్ణ, వరంగల్‌జిల్లా

### స్పెషల్ ట్రైన్‌లను నడపాలి

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంక్రాంతి పండుగ సమయంలో ప్రయాణ అవసరాలు అసాధారణంగా పెరుగుతాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో పనిచేసే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ పండుగను స్వగ్రామాల్లోనే జరుపుకోవాలనుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం కనిపించే రైల్వే రద్దీ, ఈసారి మరింత తీవ్రమైంది. కేవలం ఐదు నిమిషాల్లోనే ఏపీ రూట్లన్నింటి టికెట్లు అమ్ముడుపోవడం, వందలసంఖ్యలో వెయిటింగ్ లిస్టులుపెరగడం, అనేక రైళ్లలో రిగ్రెట్ చూపించడం ఒకే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతరైలు సేవలు డిమాండ్‌ను తీర్చలేకపోతున్నాయి. రైల్వే ముందస్తు రిజర్వేషన్‌ను మూడు నెలల నుండి రెండు నెలలకు తగ్గించడంతో, బుకింగ్స్ ఓపెన్ అయిన వెంటనే భారీ డిమాండ్ ఒక్కసారిగా కేంద్రీకృతమైంది. సంక్రాంతిరద్దీని దృష్టిలోఉంచుకొని, రైల్వేముందుగానే అదనపు స్పెషల్ ట్రైన్లను నడపడం, ఉన్నరైళ్లకు అదనపు బోగీలు జత చేయడం, డిమాండ్ ఆధారిత డైనమిక్ ప్లానింగ్ చేపట్టాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### కృత్రిమ మేధస్సు పట్ల అవగాహన

భారతదేశంలోని ప్రతి పౌరునికి కృత్రిమ మేధస్సు అవగాహనను చేరవేయాలనే లక్ష్యంతో, ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖమిషన్‌లో భాగంగా యువఎఐఫర్ ఆల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎఐపట్ల ప్రాథమిక అవగాహనను సులభమైన భారతీయ ఉదాహరణలతో కొన్ని గంటల్లో నేర్పించే ఈ ఉచిత కోర్సు,ఫ్యూచర్ సిల్స్ ప్రైమ్, ఐ గాట్ కర్మయోగి వంటి ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులోఉంది. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, వృద్ధులు సహా ఏ వయసు, ఏ వర్గానికి చెందిన వారైనా దీనిని సులభంగా ఉపయోగించుకోవచ్చు.

- డాక్టర్ కృష్ణ కుమార్ వేపకొమ్మ, హైదరాబాద్

### డిప్యూటీ ప్రిన్సిపాల్ హోదా అవసరం

గురుకులలో 600కు పైగా విద్యార్థులు ఉన్న విద్యా సంస్థలలో డిగ్రీ విద్యార్థులు. జూనియర్ కళాశాల విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు, టీచింగ్‌స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్, ఉన్నచోట తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం డిప్యూటీ ప్రిన్సిపాల్ హోదాలో ప్రస్తుతం ఉన్న టీచింగ్ స్టాఫ్‌లలో ఒకరికి ఉన్నత విద్యార్హత కలిగిన డాక్టరేట్ పట్టా బద్రులకు డిప్యూటీ ప్రిన్సిపాల్ హోదాలను కల్పించాలి. వికలాంగులకు కూడా కల్పించాలి.

- రాపాక రవీందర్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మళ్లీ ప్రచారరథం ఎక్కిన విజయ్



## కరూర్ దుర్ఘటన తర్వాత ప్రజల్లోకి వచ్చిన టివికె అధినేత

## కాంచీపురం జిల్లాలోని పార్టీ కేడర్‌తో సమావేశం

**చెన్నై,నవంబరు 23:** తమిళనాడులో తన రాజకీయ ప్రచారాన్ని ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టివికె) అధినేత విజయ్ పునః ప్రారంభించారు. ఇందులో భాగంగా కాంచీపురం జిల్లాలోని మూడు తాలూకాలకు చెందిన ఎంపిక చేసిన పార్టీ క్యాడర్‌తో ఆయన రహస్యంగా సమావేశమయ్యారు. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత దాదాపు మూడు నెలల పాటు నిలిచిపోయిన ప్రచార కార్యక్రమాలను తిరిగి ప్రారంభించడంపై ఈ సమావేశంలో చర్చించారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, చేపట్టబోయే కార్యక్రమాలపై విజయ్ తన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా కరూర్‌లో జరిగినటువంటి తొక్కిసలాట వంటి దురదృష్టకర ఘటనలు మళ్లీ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన కార్యకర్తలకు కీలక సూచనలు చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీని స్థాపించిన విజయ్, కరూర్‌లో నిర్వహించిన తొలి బహిరంగ సభలోనే తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆ సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించడంతో విజయ్ తన ప్రచారాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో డిసెంబర్ 4న సేలంలో ర్యాలీ నిర్వహించేందుకు టివికే పార్టీ పోలీసుల అనుమతి కోరగా, వారు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయ్ తన తదుపరి అడుగులను ఆచితూచి వేస్తున్నారు. డిఎంకేపై విమర్శలు గుప్పించారు. డిఎంకేది దోపిడీ భావజాలమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ వారసత్వ రాజకీయాలకు, ర్యాడికల్స్‌కు నిలయమని విమర్శించారు.

సమానత్వం కోసం తన పాలసీలను ఆయన వివరించారు. పేద, పెద్ద అనే తేడా చూపకుండా అందరినీ సమానంగా చూడాలనేదే తన పార్టీ పాలసీ అని చెప్పారు. కరూర్ తొక్కిసలాట అనుభవం నేపథ్యంలో ఈ సమావేశానికి తగిన జాగ్రత్త చర్యలు తీసు కున్నారు. సదస్సు కోసం ఓ ప్రైవేటు కాలేజీ ప్రాంగణాన్ని ఎంచుకొన్నారు. దాదాపు 1500 మందికి క్యూఆర్‌కోడ్ పాస్‌లు ఇచ్చి.. వారిని మాత్రమే అనుమతించారు. సభకు వచ్చే వారి కోసం ఆహారం, నీరు, ఇతర ఏర్పాట్లు చేశారు. అనుమతులు లేనివారు రాకుండా ప్రాంగణం చుట్టూ షీట్లు అమర్చారు. కాగా నిర్వహించిన కార్యకర్తలు ముఖ్యనాయకుల సమావేశంలో డిఎంకేపై విమర్శలు గుప్పించారు. డిఎంకేది దోపిడీ భావజాలమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఆ పార్టీ వారసత్వ రాజకీయాలకు, ర్యాడికల్స్‌కు నిలయమని విమర్శించారు. సమానత్వం కోసం తన పాలసీలను ఆయన వివరించారు. పేద, పెద్ద అనే తేడాచూపకుండా అందరినీ సమానంగా చూడాలనేదే తనపార్టీ పాలసీ అని చెప్పారు. కరూర్ తొక్కిసలాట అనుభవం నేపథ్యంలో ఈ సమావేశానికి తగిన జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సదస్సు కోసం ఓ ప్రైవేటు కాలేజీ ప్రాంగణాన్ని ఎంచుకొన్నారు.



### హైకమాండ్ ఆదేశాలకు

## కట్టుబడి ఉంటా

### - కర్ణాటక సిఎం

**బెంగళూరు, నవంబరు 23:** కర్ణాటక రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు తీవ్రమైన నేపథ్యంలో సిఎం సిద్ధ రామయ్య కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో బెంగళూరులో సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాత సిద్ధరామయ్యమాట్లాడుతూ పార్టీ సంస్థాగత అంశాలు, స్థానిక సంస్థల ఎన్నికలపైనే చర్చించామని, నాయకత్వ మార్పు ప్రస్తావన రాలేదని స్పష్టం చేశారు. సిఎం మార్పు అనేది కేవలం మీడియా సృష్టేనని ఆయన కొట్టిపారేశారు. అయితే, అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు ఎక్కడికైనా వెళ్లొచ్చు. కానీ చివరికి అధిష్టానం ఏదిచెబితే అది మేమంతా అంగీకరించాలి. అది నేనైనా, డికె శివకుమార్ అయినా సరే" అని ఆయన పేర్కొన్నారు. అధిష్ఠానం పిలిచినప్పుడు ఢిల్లీవెళ్తానని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయిన నేపథ్యంలో, సిఎం పదవిని పంచుకోవాలన్న ఒప్పందం ఉందని కెపిసిసి అధ్యక్షుడు డికె శివకుమార్ వర్గం వాదిస్తోంది. ఈ క్రమంలోనే ఆయన వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇటీవల ఢిల్లీ వెళ్లి అధిష్ఠానాన్ని కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని నిఘా వర్గాలు కూడా నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఖర్గే సిద్ధరామయ్యను ఢిల్లీకి రావాలని ఆహ్వానించారు.

మరోవైపు, ఈ రాజకీయ సంక్షోభాన్ని ఎన్డీయే తనకు అనుకూలంగా మలుచుకుంటోంది. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ కర్ణాటకలో ఊహించని రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని, కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ము లాటలు తారస్థాయికిచేరాయని ఆరోపించారు. స్థానిక ఎన్నికల లోపు ఈ ప్రతిష్టంభనకు తెరదించాలని, పాలనను గాడిలో పెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## అతి త్వరలో కెనడా పౌరసత్వ నిబంధనల్లో మార్పులు!



**ఒట్టావా, నవంబరు 23:** కెనడా పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్న వారికి మరికొన్నాళ్లలో ఓ సానుకూల కబురు వెలువడనుంది. ఆ దేశం అతి త్వరలోనే పౌరసత్వ నిబంధనలు సవరించనుంది. ఈ మేరకు సిటిజన్‌షిప్ యాక్ట్‌ను సవరిస్తూ బిల్-సి3కు రాజు నుంచి ఆమోద ముద్ర లభించింది. దీంతో అతి త్వరలోనే ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఫెడరల్ గవర్నమెంట్ తేదీలను ప్రకటించనుంది. ఇప్పటికే ఆ దేశంలో చర్చనీయాంశంగా ఉన్న సెకండ్ జనరేషన్ కటాఫ్‌లోని సమస్యలను పరిష్కరించింది. గతంలో ఉన్న నిబంధన విదేశాల్లో జన్మించిన కెనడా వాసులకు ఆటోమేటిక్‌గా పౌరసత్వం సంక్రమించకుండా అడ్డుకునేది. దీంతో ఇలా నష్టపోయిన వారితో ఆ దేశంలో 'లాస్ట్ కెనెడీయన్స్' పేరిట గ్రూప్ కూడా ఏర్పడింది. వాస్తవానికి 2009లో తెచ్చిన పరిమితి ప్రకారం విదేశాల్లో జన్మించిన పిల్లల తల్లిదండ్రుల్లో కనీసం ఒకరైనా కెనడాలో పుట్టడమో.. కన్నుమూయడమో జరిగిన వారికే పౌరసత్వాన్ని పరిమితంచేసింది. కానీ, ఒంటారియో న్యాయస్థానం ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దీనిని ప్రభుత్వం కూడా అంగీకరించి.. అప్పీల్‌కు వెళ్లలేదు.

తాజాగా తెచ్చిన బిల్ సీ-3 ప్రకారం పాత నిబంధన ప్రకారం పౌరసత్వం కోల్పోయిన వారందరికీ ఇప్పుడు ఇవ్వనున్నారు. దీని ప్రకారం కెనడా బయట జన్మించిన తల్లిదండ్రులు పిల్లలను కనడానికి లేదా దత్తత తీసుకోవానికి ముందు కనీసం 1,095 రోజులు దేశంలోనే ఉన్నట్లు నిరూపించుకోవాలి. యుకె, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పౌరసత్వ ప్రక్రియలో ఇటువంటి విధానాలను పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ దేశ మంత్రివర్గం తేదీ నిర్ణయించగానే ఇది అమలులోకివస్తుంది. న్యాయ స్థానంకూడా దీని అమలు తుదిగడువును 2026 జనవరి నాటికి పొడిగించింది. ఒక్కసారి ఇది అమల్లోకి రాగానే పౌరసత్వదరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని లాయర్లు పేర్కొన్నారు.

## శబరిమలకు పోటెత్తుతున్న భక్తులు

### లక్షల సంఖ్యలో పెరిగిన దర్శనాలు



**తిరువనంతపురం:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మండలం, మకరవిలక్కు వార్షిక ఉత్సవాల నేపథ్యంలో భక్తులు తరలివస్తున్నారు. తొలివారంలోనే ఏకంగా 5.75లక్షల మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నట్లుగా అధికారులు వెల్లడించారు. భక్తుల తాకిడి కొనసాగుతుందని, అడపాదడపా వర్షాలు కురుస్తున్నా ఎలాంటి ఆటంకాలు లేకుండా శబరిమలయాత్ర కొనసాగుతుందని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భక్తుల కోసం క్యూ షెల్టర్ల వద్ద ఎక్కువ సేపు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఇదిలా ఉండగా భక్తుల రద్దీ నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి వీఎన్ వాసవన్ ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంపలో నిర్వహించిన ఈ సమావేశంలో రద్దీకి అనుగుణంగా స్పాట్ బుకింగ్‌ను రద్దుబాటు చేయాలని నిర్ణయించారు. ఎక్కువ మంది భక్తులకు దర్శనాలుకల్పించేందుకు వీలుగా 18 మెట్లను ఎక్కే భక్తుల సంఖ్యనుపెంచాలని సూచించారు. గత సంవత్సరం ఈ సీజన్‌లో 53.6 లక్షల మంది అయ్యప్ప భక్తులు శబరి మలను సందర్శించారు. ఈ సారి ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

## 28 పాయింట్ల అజెండా రష్యానుంచి వచ్చిందే!

### ట్రంప్‌ను ఏకిపారేస్తున్న యూరోపియన్ దేశాలు

**క్వీవ్, నవంబరు 23:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇది తన తుది ప్రతిపాదన కాదని ట్రంప్ స్పష్టంచేసినప్పటికీ, నవంబర్ 27లోగా అంగీకరించాలంటూ ఉక్రెయిన్‌పై తీవ్రఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు, ఈ ప్రణాళికలో చాలా మార్పులు అవసరమని ఉక్రెయిన్ మిత్రదేశాల కూటమి తేల్చిచెప్పింది. వైట్‌హౌస్ వద్ద విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఒకవేళ జెలెన్‌స్కీ ఈ ఒప్పందాన్ని అంగీకరించకపోతే, ఆయన చివరి వరకు పోరాడుకోవచ్చని వ్యాఖ్యానించారు. శాంతిస్థాపనే తమ లక్ష్యమని, ఎలాగైనా దాన్ని సాధిస్తామని అన్నారు. ఈ ప్రణాళికపై మరో తీవ్రమైన ఆరోపణ తెరపైకి వచ్చింది. 28 పాయింట్లు ఉన్న ఈ పత్రం వాస్తవానికి రష్యా నుంచి వచ్చిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సెనేటర్లకు చెప్పినట్లు రిపబ్లికన్ సెనేటర్ మైక్ రౌండ్స్ వెల్లడించారు. అయితే ఈ వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ అధికారికంగా స్పందించలేదు. ప్రస్తుతం ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న తూర్పు దొనెట్స్క్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి దళాలను ఉపసంహరించు కోవాలని, దొనెట్స్క్, లుహాన్స్క్, క్రిమియాలపై రష్యా నియంత్రణను అంగీకరించాలని ఇందులో ఉంది. అంతేకాకుండా, ఉక్రెయిన్ సైన్యాన్ని 6 లక్షల మందికి పరిమితం చేయాలనే నిబంధనపై పశ్చిమ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.అంతేకాకుండా ఐరోపా దేశాలు కూడా ఈ 28 పాయింట్ల అజెండాపై తీవ్ర వ్యతిరేకతకనబరిచాయి. ఇకపై జరిగే చర్చల్లో ఐరోపా ప్రతినిధి బృందం ఉంటుందని, ఐరోపాకూటమి పరోక్షంగా జరిగే చర్చలను స్వాగతించలేమని ఈ అజెండా మొత్తం రష్యాకు అనుకూలంగా ఉందని, ఉక్రెయిన్‌కు ఆత్మహత్యాసదృశమని కూడా ధ్వజమెత్తాయి.

# జి-20 సదస్సులో మోడీ తీర్మానాలు ఆమోదం



**జోహాన్స్‌బర్గ్, నవంబరు 23:** దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జి-20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, సదస్సును బహిష్కరించినప్పటికీ వాతావరణ మార్పులు, ఇతర ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంపై సభ్య దేశాలు ఒక కీలక ఉమ్మడి తీర్మానాన్ని ఆమోదించాయి. సదస్సు ప్రారంభోత్సవంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా మాట్లాడుతూ జి-20 సమగ్రతను కాపాడతామని, గ్లోబల్ సౌత్, ఆఫ్రికా ఖండం ప్రాధాన్యతలకు అజెండాలో చోటు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి ఆరు కీలక ప్రతిపాదనలను ఉంచారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాద సంబంధాలపై పోరాటానికి ప్రత్యేక చొరవతీసుకోవాలని పిలుపునిచ్చారు. దీంతో పాటు జి-20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్, ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనిషియేటివ్, గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ వంటి అంశాలను ఆయన ప్రతిపాదించారు. అయితే, ఈ తీర్మానాన్ని అమెరికా తీవ్రంగా వ్యతిరేకించింది.

దక్షిణాఫ్రికా జి20 అధ్యక్ష పదవిని దుర్వి నియోగం చేస్తోందని, సమూహం మౌలిక సూత్రాలను దెబ్బతీస్తోందని వైట్‌హౌస్ పేర్కొంది. దక్షిణాఫ్రికాలో జాత్యహంకార, శ్వేతజాతీయుల వ్యతి రేక విధానాలు అమలవుతున్నాయని ఆరోపిస్తూ ట్రంప్ ఈ సదస్సును బహిష్కరించాలని ఆదేశించారు. ఈ తీర్మానంలో సంక్లిష్ట ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుకు, వాతావరణ మార్పులను ఎదుర్కొనేం దుకు నిధులను బిలియన్ల నుంచి ట్రిలియన్లకు పెంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. తీర్మానంలో ఉక్రెయిన్ ప్రస్తావన ఒకసారి మాత్రమే వచ్చిన ప్పటికీ, సదస్సు వేదికగా పశ్చిమ దేశాల నేతలు ఈ అంశంపై చర్చలు జరుపుతున్నారు. అమెరికా శాంతి ప్రణాళిక లీక్ అయిన నేపథ్యంలో యూరోపియన్ నేతలు ఒక ప్రకటన విడుదల చేసారు.

# చండీఘర్ ఎప్పటికీ పంజాబ్‌దే..

### రాజ్యాంగ సవరణల ప్రతిపాదనలపై పంజాబ్ ఆగ్రహం!



**న్యూఢిల్లీ, నవంబరు 23:** కేంద్రపాలిత ప్రాంతమైన చండీఘర్‌ను రాష్ట్రపతి ప్రత్యక్ష నియంత్రణలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ పాలన కింద ఉన్న చండీఘర్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 240 కిందకు తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ మేరకు రాజ్యాంగ సవరణకు సంబంధించిన చండీఘర్ బిల్లును పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి) నేతలు కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పంజాబ్, హర్యానాకు ఉమ్మడిరాజధానిగాఉన్న చండీఘర్ కేవలం పంజాబ్‌కే చెందుతుందని అన్నారు. పంజాబ్ నుంచి చండీఘర్‌ను వేరు చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నదని ఆ పార్టీల నేతలు ఆరోపించారు. మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. చండీఘర్ బిల్లుపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. 'కేంద్రపాలిత ప్రాంతమైన చండీఘర్‌కు చట్టాలను సులభతరం చేసే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. తుది నిర్ణయం తీసుకోలేదు. చండీఘర్ పరిపాలన లేదా పంజాబ్ లేదా హర్యానాతో దాని సాంప్రదాయ సంబంధాల గురించి ఈ ప్రతిపాదనలో ఏమీ లేదు. అందరిని సంప్రదించిన తర్వాత చండీఘర్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఏదైనా నిర్ణయం తీసుకుంటాం. రాబోయే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చండీఘర్ విషయంలో ఎలాంటి బిల్లును తీసుకురావాలని కేంద్రం యోచించడంలేదు' అని ఎక్స్‌లోపేర్కొంది. నిజానికి స్వాతంత్ర్యానికి పూర్వం అవిభక్త పంజాబ్‌కు లాహోర్ రాజధానిగా ఉంది. తూర్పు పంజాబ్ రాజధానిలేకుండా కొనసాగింది. అప్పటికేంద్రం కొత్తనగరం నిర్మాణంచేసారు. 240 అధికరణం ప్రకారం అండమాన్‌నికోబార్, లక్షద్వీప్, దాద్రానగర్ హవేలీ, దామన్ దయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాలపై రాష్ట్రపతికే అధికారాలున్నాయి. 131వ సవరణతో చండీఘర్‌నుకూడా 240 అధికరణంలోకి తీసుకువస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతం అయిన చండీఘర్ పాలనా బాధ్యతలు పంజాబ్ గవర్నర్‌చూస్తారు. రాజ్యాంగ సవరణజరిగితే అధికారాలన్నీ రాష్ట్రపతికి వెళ్లిపోతాయి. చండీఘర్‌నగరం పంజాబ్ హర్యానాల సరిహద్దుల్లో ఉంది. చండీఘర్‌తోపాటు పంజాబ్‌లోని మొహాలి, హరియాణాలోని పంచకుల ప్రాంతాలను కలిపి పెద్దనగరంగా చూస్తారు. దీనితో రెండు రాష్ట్రాలు కూడా చండీఘర్‌ను వదులుకోడానికి సుముఖంగా లేవు.

# భారత్ ఒక సంపూర్ణ హిందూ దేశం!

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**లక్నో,నవంబరు 23:** భారత్ ఒక హిందూ సమాజమని, ఈదేశం ఒక హిందూ దేశమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆదివారం లక్నోలో జరిగిన దివ్య గీతా ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమంలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ భగవద్గీత బోధనలు ప్రతీ యుగానికి, ప్రతీ పరిస్థితికి మార్గనిర్దేశం చేస్తాయని అన్నారు. ప్రస్తుతం సమాజంలో భౌతిక సంపద పెరుగుతున్నప్పటికీ, శాంతి, నైతికత, సంతృప్తి కొరవడుతున్నాయి. దీనికి పరిష్కారం మన సనాతన జీవన విలువలలోనే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సమస్యల నుంచి పారిపోకుండా, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు గీతలో బోధించారని గుర్తు చేశారు. భారతదేశ చరిత్రను ప్రస్తావిస్తూ, ఒకప్పుడు విశ్వగురువుగా వెలుగొందిన మన దేశంపై శతాబ్దాల పాటు దండయాత్రలు జరిగాయని, ఆలయాలను ధ్వంసం చేసి బలవంతపు మతమార్పిడులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. "అయితే, ఆ దండయాత్రల రోజులు ఇప్పుడు పోయాయి. మనం అయోధ్య రామమందిరంపై కాషాయ పతాకాన్ని ఎగురవేశాం" అని ఆయన అన్నారు.

# మన స్నేహం కలకాలం ఉండాలి

### పిఎం మోడీని ఉద్దేశించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పోస్టు



**ప్యారిస్, నవంబరు 23 :** భారత్‌తో స్నేహం కలకాలం ఉండాలని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ అన్నారు. దక్షిణాఫ్రికాలోని జొహెన్నెస్‌బర్గ్ వేదికగా జరిగిన జి-20 సదస్సులో మోడీతో సమావేశం తర్వాత ఆయన ఇరుదేశాల మధ్య బంధం గురించి సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. 'భారత ప్రధాని, ప్రియమిత్రుడు నరేంద్రమోడీకి ధన్యవాదాలు. ప్రపంచ దేశాలు ఒకరికి ఒకరు సహకరించుకుంటూ.. కలిసి ముందుకు వెళ్లినప్పుడే అవి బలంగా మారుతాయి. అదేవిధంగా మన దేశాల మధ్య స్నేహం చిరకాలం ఉండాలి' అని పేర్కొన్నారు. సదస్సులో మోడీతో ఉన్న ఫొటోను షేర్ చేశారు. అంతకుముందు జరిగిన జి-20 శిఖరాగ్రసదస్సులో మేక్రాన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభాలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జి-20 కూటమి ఉనికి ప్రమాదంలో ఉందన్నారు. ప్రధాన సంక్షోభాలను పరిష్కరించేందుకు కలిసికట్టుగా పోరాడటంలో కూటమి ఇబ్బంది పడుతోందన్నారు. కొన్ని ప్రాధామ్యాలపై సమష్టిగా కృషి చేయకుంటే జి-20 ప్రమాదంలో పడుతుందని ప్రపంచ నేతలు గుర్తించాలన్నారు.

**ప్రపంచ దేశాధినేతలతో మోడీ భేటీ..**

జొహెన్నెస్‌బర్గ్‌లో శనివారం జరిగిన జి-20 దేశాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ సహా ప్రపంచ దేశాధినేతలు పాల్గొన్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్, కెనడా ప్రధాని మార్క్ కార్నే, ఫ్రాన్స్, కొరియా, బ్రెజిల్ దేశాధినేతలతోనూ మోడీ భేటీ అయ్యారు. ఉగ్రవాదులకు, మాదకద్రవ్యాలకు మధ్యనున్న సంబంధాలకు అడ్డుకట్ట వేద్దామని భారత ప్రధాని నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. ఈ మేరకు కూటమి దేశాలు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రతిపాదించారు.

## సంక్షిప్తంగా..

### పైలట్ కుటుంబం మొత్తం దేశసేవలోనే...



**దుబాయి, నవంబరు 23:** దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ జెట్ కుప్పకూలిన విమాన పైలట్ కుటుంబం మొత్తం దేశసేవలోనే కొనసాగింది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన నమాన్ష్ కుటుంబం మొత్తం దేశసేవలో నిమగ్నమై ఉంది. ఆయన తండ్రి జగన్నాథ్ శ్యాల్ సైన్యంలో పనిచేసి పదవీ విరమణ చేశారు.తల్లి వీణ గృహిణి కాగా, నమాన్ష్ భార్య అఫ్షాన్ కూడా ఎయిర్ ఫోర్స్‌లో ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నమాన్ష్ దుబాయ్ ఎయిర్ షోలో ప్రదర్శన చేస్తున్న సమయంలో అఫ్షాన్ కోల్‌కతాలో ట్రైనింగ్ తీసుకుంటు న్నారు. ప్రమాద వార్త తెలిసి హుటాహుటిన కోయంబత్తూరులోని అత్తామామల వద్దకు చేరుకున్నారు. నమాన్ష్, అఫ్షాన్ దంపతులకు ఆర్య (7) అనే కుమార్తె ఉంది. కాగా, హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా పతియాల్కర్ గ్రామంలో నమాన్ష్ అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈరోజు సాయంత్రం అంత్యక్రియలు పూర్తవుతాయని బంధువులు తెలిపారు.


### కరెంటు తీగ తగిలి దగ్ధం అయిన స్లీపర్‌బస్సు

**జైపూర్, నవంబరు 23:** రాజస్థాన్‌లో పెళ్లి బృందాన్ని ఎక్కించుకోవడానికి వెళ్తున్న ఓ స్లీపర్ బస్సులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కిందకు వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగ తగలడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సమీపంలో పశువులను మేపుతున్న ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ధోల్‌పూర్ జిల్లా రాజఖేడా పోలీస్ స్టేషన్ పరిధిలోని సమోనా గ్రామంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సాయంత్రం 5:15 గంటల సమయంలో ఓ స్లీపర్‌బస్సు పెళ్లి బృందాన్ని ఎక్కించుకునేందుకు సమోనా గ్రామానికి బయలుదేరింది. మార్గమధ్యంలో కిందకు వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్‌తీగను డ్రైవర్ అంచనా వేయలేకపోయాడు. దీంతో బస్సు పైభాగం వైర్‌కుతగలడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే బస్సు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో పక్కనే పశువులను మేపుతున్న భగవాన్ దేవి అనే మహిళకు తీవ్ర కాలిన గాయాలయ్యాయి.

### నెలరోజుల్లో జన్‌సూరజ్ కొత్త కమిటీలు

**పాట్నా,నవంబరు 23:** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జనసురాజ్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో పార్టీలో భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర స్థాయి నుంచి పంచాయతీ స్థాయి వరకు ఉన్న అన్ని సంస్థాగత కమిటీలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. నెలన్నర రోజుల్లో కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టంచేసింది. పాట్నాలో జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జనసురాజ్ పార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ మసిహుద్దీన్ తెలిపారు. పార్టీ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ గైర్హాజరీలో బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. పార్టీ సమన్వయకర్త ప్రశాంత్ కిశోర్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

### మిస్ యూనివర్స్ పోటీల్లో రిగ్గింగ్!



**మెక్సికోసిటీ, నవంబరు 23:** మిస్ యూనివర్స్ 2025 పోటీలు తీవ్ర వివాదంలో చిక్కుకున్నాయి. మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ విజేతగా నిలిచిన కొద్ది గంటల్లోనే, పోటీల న్యాయనిర్ణేతల్లో ఒకరైన ఒమర్ హార్ఫౌచ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ పోటీల్లో రిగ్గింగ్ జరిగిందని, విజేతను ముందుగానే నిర్ణయించారని ఆయన ఆరోపించారు. మిస్ యూనివర్స్ యజమాని రౌల్ రోచాకు, విజేత ఫాతిమా తండ్రికి మధ్య ఉన్న వ్యాపార ఒప్పందాల కారణంగానే ఆమెను గెలిపించారని బాంబు పేల్చారు. "మిస్ మెక్సికో ఒక ఫేక్ విన్నర్" అంటూ ఒమర్ హార్ఫౌచ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. పోటీల ఫైనల్‌కు 24 గంటల ముందే తాను ఈ విషయాన్ని ఓ అమెరికన్ ఛానెల్‌కు వెల్లడించానని తెలిపారు. దుబాయ్‌లో జరిగిన సమావేశంలో రౌల్ రోచా, ఆయన కుమారుడు తనను కలిసి, వ్యాపార ప్రయోజనాల కోసం ఫాతిమాకే ఓటు వేయాలని ఒత్తిడి చేశారని ఒమర్ ఆరోపించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను 2026 మే నెలలో డాక్యుమెంటరీలో బయటపెడతానని ఆయన పేర్కొన్నారు.

# మంచి స్వతహాగానే ప్రకాశిస్తుంది: రత్నాకర్




**పుట్టపర్తి, నవంబరు 23, ప్రభాతవార్త:** 'సూర్యుడు ఉదయించినప్పుడు వెలుగు ఉందని ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం ఉందా? మంచి పని చేస్తే అది తనంతట తానే ప్రకాశిస్తుంది' అని భగవాన్ సత్యసాయి బాబా తనకు బోధించారని శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ఉద్ఘాటించారు. భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్.జె.రత్నాకర్ భావోద్వేగంతో ప్రసంగించారు. ప్రశాంతి నిలయంలోనే నిలిచిపోయి, స్వామి దివ్య పాదసేవలో జీవితం అర్పించాలని తాను తన తల్లికి మాట ఇచ్చానని అన్నారు. భగవాన్ శాశ్వత సన్నిధిని పునరుద్ఘాటిస్తూ, స్వామి మిషన్ నిత్యం సజీవంగా, విస్తారంగా కొనసాగుతోందన్నారు . ఎందుకంటే భక్తులు ప్రతి క్షణం స్వామి మార్గదర్శకత్వాన్ని, రక్షణను అనుభవిస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా తనకు వ్యక్తిగతంగా బోధించిన అనేక లోతైన పాఠాలను హృదయపూర్వకంగా స్మరించుకున్నారు. ప్రతి అడుగులోనూ స్వామి తనను మార్గనిర్దేశం చేసి, తన జీవితం, సేవ మార్గాన్ని ఎలా తీర్చిదిద్దారో వివరించారు. గంగా నదిలో మునిగి స్నానం చేయడం వల్ల గంగా నదిని మనం పవిత్రం చేయడం లేదని, మనల్ని మనం పునీతుల్ని చేసుకుంటున్నామని అలాగే, గంగా నది లాగ శ్రీ సత్య సాయి సేవా సంస్థలు ఎప్పటికీ నిలిచే ఉంటాయని, శ్రీ సత్య సాయి సేవా సంస్థల్లో చేరడం ద్వారా, సేవ చేయడం ద్వారా ప్రతి ఒక్కరు తమని తాము పునీతులు చేసుకోవడానికి అవకాశం కలుగుతుందని భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు చెప్పారన్నారు. ఇటువంటి బలమైన నమ్మకంతో, విశ్వాసంతో, సంకల్పంతో 7.5 లక్షల మంది శ్రీ సత్య సాయి సేవా సంస్థల సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారన్నారు. తమ అత్యంత రద్దీ షెడ్యూళ్లలోను సమయం కేటాయించి హాజరైన అతిథులందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశ్యారు. వారి సాన్నిధ్యం ఈ శతజయంతి వేడుకలకు మరింత విశేషతను చేకూర్చిందన్నారు.

# జగన్ విమర్శలను తిప్పి కొట్టిన రామానాయుడు




## నాడు నిద్రపోయారా అంటూ విమర్శలు

**పాలకొల్లు, నవంబరు 23 ప్రభాతవార్త:** కృష్ణానది జల వివాదాలకు సంబంధించి ట్రిబ్యునల్2 ముందు వాదనలు వినిపించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాసిన లేఖపై రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా స్పందించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన మీడియా సమావేశంలో జల వనరులకు సంబంధించి జగన్ వైఖరిని తూర్పారబట్టారు. దెయ్యాలు వేదాలు వల్లించడం, దొంగే దొంగ దొంగ అని అరవడం మాదిరి రాష్ట్ర ప్రయోజనాలను తను దెబ్బ కొట్టి కూటమి ప్రభుత్వం పై బురద చల్లడం విడ్డూరంగాను వింతగాను ఉందన్నారు. ఐదేళ్లపాటు అధికారమిస్తే.. అప్పుడు ఎక్కడ నిద్రపోయారు.. జల వనరులపై మీరు ఇప్పుడు ప్రదర్శిస్తున్న కపట ప్రేమ అప్పుడు ఏమైపోయింది అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అతి కీలకమైన నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసింది మీరు కదా? రాష్ట్ర జీవనాడి పోలవరం తో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర నీటిపారుదల ప్రాజెక్టులన్నిటిని నిర్వీర్యం చేసి పడుకోపెట్టేసింది మీరు కాదా? అంటూ నిలదీశారు మీ తిరోగమన పాలన వల్ల, అసమర్థ అవినీతి విధానాల వల్ల రాష్ట్ర జలవనుర్లన్నీ అధోగతి పాలవడం వాస్తవం కాదా అని అడిగారు . సదరు ప్రాజెక్టులన్ని పాతికేళ్ల వెనక్కి వెళ్ళి పోవడానికి కారకులు మీరేనని విమర్శించారు. జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణానది జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ 2 వేయడానికి, దాని అంకురార్పణకు మీ చేతకానితనం కాదా అని నిలదీశారు. 2020లో అధికారంలో ఉన్నది.. మీరు, తెలంగాణకు కెసిఆర్, అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ అప్పటి ముఖ్యమంత్రి కెసీఆర్ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలు తుంగలో తొక్కి మన రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా మాట్లాడుతుంటే మీరు ఎపెక్స్ కౌన్సిల్లో నిద్రపోయారా అంటూ మంత్రి రామానాయుడు నిలదీశారు.

# భీమవరంలో కేంద్రమంత్రి క్యాంప్ కార్యాలయం

**భీమవరం, ప్రభాతవార్త:** రాజకీయాలకతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా భీమవరంలో నూతనంగా ఆధునిక సదుపాయాలతో నిర్మించిన తన క్యాంపు కార్యాలయం పనిచేస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలోని నరసయ్య అగ్రహారంలో నూతనంగా నిర్మించిన కేంద్ర సహాయమంత్రి క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పాందువ్వ శ్రీను తదితరులు కలిసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ గోపి మూర్తి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి, ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, టీడీపీ సీనియర్ నాయకులు మెంటే పార్థసారథి, రామరాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి శ్రీదేవితోపాటు కూటమి నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకు శుభాకాంక్షలు తెలియజేశారు.



సూర్య ఉపాసన, రద్దీగా వున్న క్యూలైన్లను క్రమబద్ధీకరిస్తున్న ఇఓ, దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

# దుర్గమ్మ ఆలయంలో లోక కల్యాణార్థం సూర్య ఉపాసన

**ఇంద్రకీలాద్రి, నవంబరు 23, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం నాడు లోకకల్యాణార్దం సూర్య ఉపాసన సేవను నిర్వహించారు. ఆదిత్య హృదయం, అరుణ పారాయణ, సూర్య నమస్కారాలు, సూర్యాష్టకం తదితర ఉపాసనలతో పాటు పురుషసూక్తం పఠిస్తూ పూజాదికాలు నిర్వహించిన అనంతరం ద్వాదశ సూర్యభగవానునికి నివేదనలు, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కోగంటి వెంకటరామయ్య, కుటుంబసభ్యులు వెంకట కృష్ణారావు, ప్రజులు రు1,01,116ల విరాళాన్ని ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలం దించారు.



# నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

**నెల్లూరు, నవంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం :** ఎంపీ వేమిరెడ్డి, అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్స్ ప్రారంభించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగరంలో ఏడు చోట్ల సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు సిగ్నల్స్ లో ప్రజలు తూచా తప్పకుండా పాటించాలన్న మంత్రి అక్రమ కట్టడాల తొలగింపునకు ఆక్రమణదారులు సహకరించాలన్న మంత్రి నారాయణ నెల్లూరులో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు సిగ్నల్స్ పాయింట్ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. మంత్రి ఆదేశాలతో రూ.1.39 కోట్ల నిధులు వెచ్చించి నెల్లూరు నగరంలోని హరనాథపురం, రామలింగాపురం, వీఆర్సీ, కనకమహల్ సెంటర్ లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నుడా చైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రూరల్ టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఎస్పీ అజితా వేజెండ్ల లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు.

# కన్నులపండువగా సత్యసాయి శతజయంత్యుత్సవం

## ప్రముఖులు, భక్తకోటితో పోటెత్తిన హిల్ వ్యూ స్టేడియం



ఆదివారం పుట్టపర్తిలో స్వర్ణ రథంపై సత్యసాయి చిత్రపటం ఊరేగింపు దృశ్యం

**పుట్టపర్తి రూరల్, నవంబరు 23, ప్రభాతవార్త:** ఒక వైపు అగ్రశేణి ప్రముఖుల కోలాహలం మరో వైపు అంసఖ్యాక భక్తుల ఆగమనంతో పుడమిపై స్వర్ణకాంతుల సౌరభాన్ని తలపిస్తూ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవం కన్నులపండుగా జరిగింది. ఆదివారం ప్రేక్షకులే పర్వతగిరుల్లా తలపిస్తూ తమ ఆరాధ్య దైవం సత్యసాయీశుని శతజయంతి మహోత్సవ సంబరాలు అంబరాన్నంటేలా దేదీప్యమానంగా పుట్టపర్తి పురవీధులు మార్మోగాయి. దేశ విదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 08:00 గంటలకు హిల్ వ్యూ స్టేడియంలో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యసాయి చిత్రపటాన్ని స్వర్ణ రథంలో కొలువు తీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రాష్ట్రాల సేవా సంస్థల అభ్యర్థులు వారి రాష్ట్రంలోని ప్రసిద్ధ దేవాలయాలను ప్రదర్శిస్తూ వేషాలను ధరించారు. మేళ తాళాలతో, విద్యార్థుల నాట్యాల ప్రదర్శిస్తూ ఉండగా, ప్రముఖ గాయకుడు మనో, వాయిద్య కారుడు శివమణిల సారథ్యంలో "కదిలింది కదిలింది సాయి రథం.. సత్యరథం..." అంటూ గానాలాపన చేస్తుండగా స్వర్ణ రథం శాంతి వేదికకు చేరుకుంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, చంద్రబాబు రేవంత్ రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మేఘాలయ, ఉత్తరాఖండ్‌ల ప్రధాన న్యాయమూర్తులు సోమన్ సెన్, గుహనాథన్ నరేంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ ఉపరాష్ట్రపతికి జ్ఞాపికను బహుకరించారు. స్వాగతం ఉపన్యా సాన్ని ఆర్.జె.రత్నాకర్ ప్రసంగించారు. కర్ణాటక తమిళనాడు గుజరాత్‌కు చెందిన బాల వికాస్ విద్యార్థులు అద్భుతమైన నృత్య ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి తన సొంత గ్రామానికి సైతం త్రాగునీరు అందించారని గుర్తు చేసుకున్నారు. ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ విశ్వవ్యాప్త సత్యసాయి బోధనలకు ప్రశాంతనులే వేదికైందన్నారు. విదేశాల్లో 10 జోన్లలో సత్య సాయి సేవ దళ్ సభ్యులు అందిస్తున్న సేవలు విశేషం అని కొనియాడారు. అనంతరం త్రిపుర మేఘాలయ ప్రధాన న్యాయ మూర్తులు సత్య సాయి సేవలను తెలియజేస్తూ ప్రసంగించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ మాట్లాడుతూ సత్యసాయి నిస్వార్థమైన సేవ మార్గాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని సేవ చేయాలని పేర్కొన్నారు. అనంతరం జాతీయ గీతంతో ఉదయం వేడుకలు ముగిసాయి. ఈ వేడుకలకు సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండ్య, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తిల తోపాటు మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత,సినీ నటులు సాయి పల్లవి, సాయికుమార్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తిరిగి సాయంత్రం 05:00 గంటలకు వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి జోల మహోత్సవం నిర్వహించారు. ప్రాగ్ ఫిల్మ్ హార్మోనిక్ ఆర్కెస్ట్రాకు చెందిన 100 మంది విదేశీ మ్యూజిషియన్స్, తో పాటు ప్రముఖ సంగీత విద్వాంసుడు, పద్మ భూషణ్ అజయ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నైటింగేల్ ఆఫ్ ఇండియా కౌశికి చక్రవర్తి, గాయకుడు మను, సత్యసాయి సేవా సంస్థలు గ్లోబల్ కౌన్సిల్ నుండి 100 మంది మ్యూజిషియన్స్ ఒకే వేదికపై బృహత్తర సంగీత విభావరి కార్యక్ర మాన్ని ప్రదర్శించారు. అనంతరం సౌండ్ అండ్ లేజర్ షో నిర్వహించారు. విద్యుత్ కాంతుల ద్వారా సత్యసాయి వైభవాన్ని ప్రదర్శించారు.

ఈ కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆకాశంలో డ్రోన్లతో విత్ లవ్ బాబా అంటూ భగవాన్ సత్యసాయి చిత్రపటాలు, చేసిన విన్యాసాలు చూపులను త్రిప్పలేనంతగా అబ్బుర పరిచాయి. రంగురంగుల బాణా సంచా దీపకాంతులతో హిల్ వ్యూ స్టేడియం వెలిగిపోయింది. ఈ వేడుకలకు విచ్చేసిన దాదాపు లక్ష యాభై వేల మంది దేశ విదేశీ భక్తులకు ట్రస్ట్‌వర్గాలు ఉచిత అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అశేష భక్తుల రాకతో పుట్టపర్తి పురవీధులు భక్తజనసంద్రంగా మారాయి. అధిక జనాభాను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

# భగవాన్ సత్యసాయి స్ఫూర్తి తరతరాలకు సేవా దీప్తి

## అందరినీ ప్రేమించు.. సేవించు మార్గంలో పయనించాలన్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




సత్యసాయి జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** భగవాన్ శ్రీసత్యసాయిబాబా అందించిన స్ఫూర్తి.. తరతరాలకు సేవా దీప్తి అని, ఆయన నడచిన మార్గం, ప్రేమ తత్వానికి, సేవా భావనకు వారధి అని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు ఆదివారం నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మల్లెతీగ నిర్వహిస్తున్న జాతీయ సాహిత్య,సాంస్కృతిన ఉత్సవాల వేదికపై జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, వివిధ శాఖల అధికారులు, శ్రీ సత్యసాయి సేవా సమితుల సభ్యులు తదితరులతో కలిసి శ్రీ సత్యసాయిబాబా చిత్రపటానికి పూల మాలలు అలంకరించారు. విశ్వశాంతి, సౌభాగ్యం, మానవాళి సుఖసంతోషాల కోసం పరితపించిన భగవాన్ సేవలను స్మరించుకున్నారు. శ్రీ సత్యసాయి సేవా సమితి సారథ్యంలోని ఆధ్యాత్మిక. సేవా, విద్యా విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను విజయవాడ సమితి కన్వీనర్ ఎన్వీఎల్ నరసింహారావు వివరించారు. భజనల కార్యక్రమాల ఆధ్యాత్మిక పరిమళాలతో ప్రాంగణం శోభిల్లగా శ్రీ సత్యసాయి వాక్కులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో శ్రీ సత్యసాయిబాబా శతజయంతిని పండగలా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఇదో గొప్ప కార్యక్రమమని.. సమాజంలోని సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి శ్రీ సత్యసాయి గొప్ప ఆలోచనలు చేసి అందరికీ ఆదర్శవంతంగా నిలిచారన్నారు. ఆయన సేవా స్ఫూర్తి తరంగాలు నేడు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు అనే గొప్ప భావనలు ముఖ్యంగా ఈ తరానికి చాలా కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు విలువలను పెంపొందించుకుంటూ ముందడుగు వేయాలని.. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు సీహెచ్ సాయిగీత, ఝాన్సీ, విజయలక్ష్మి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు. ఇక విజయవాడ, సీతారాంపురంలోని శ్రీ సత్యసాయి మందిరంలో జరిగిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజ యంతి వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను ఈ కార్యక్రమంలో అందజేసారు. **అంతరిక్ష విజ్ఞాన వీచిక.. స్పేస్ ఆన్ వీల్స్..** అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికతపై విదార్థులు, యువతలో ఉత్సుకతను పెంపొందిం చేందుకు ఆధునిక అంతరిక్ష పరిజ్ఞానంపై సానుకూల దృక్పథాన్ని కల్పించేందుకు స్పేస్ ఆన్ వీల్స్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఆన్ వీల్స్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీ శ మాట్లాడుతూ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ విజయవంతంగా ముందుకు సాగుతోందని.. నగర విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా ఆదివారం, సోమవారం రెండురోజుల పాటు ఈ ప్రదర్శనను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. భారతదేశ తొలి ఉపగ్రహ వాహక నౌక నుంచి తాజాగా ఇస్రో ప్రయోగాల వరకు, లాంచ్వ్యాడ్లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తదితర విషయాలపై పరిజ్ఞానాన్ని పెంచేలా ప్రదర్శనలు ఉన్నాయన్నారు. వివిధ నమూనాలను చూడటం, వాటి విషయాలను తెలుసుకోవడం ద్వారా అంతరిక్ష విజ్ఞాన వికాసానికి వీలవుతుందన్నారు.

సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను వివరించడంతో పాటు అంతరిక్ష రంగంపై విద్యార్థులకు ఆసక్తిని కలిగించేందుకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీ శ అన్నారు. కార్యక్రమంలో షార్ టెక్నికల్ అధికారి కిరణ్ పాల్గొన్నారు. స్పేస్ ఆన్ వీల్స్ సందర్శనకు వస్తున్న విద్యార్థులకు కిరణ్.. భారత అంతరిక్ష విజయయాత్ర గురించి క్షుణ్ణంగా వివరిస్తున్నారు.

# బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపేయాలి


## వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్

**విజయవాడ, నవంబరు 23 ప్రభాతవార్త:** బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష, ప్రజా సంఘాలు నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను కోర్టులో హాజరు పరచాలన్నారు. బహుళజాతి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో బూటకపు ఎదురుకాల్పులను వ్యతిరేకిస్తూ, న్యాయ విచారణ జరపాలని కోరుతూ నిరసన సభ నిర్వహించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, న్యూ డెమోక్రసీ నేత చిట్టిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి జీవించే హక్కు కల్పించిందన్నారు. హక్కుల సాధనకు అవసరమైతే పోరాటాలు చేసి అయినా సాధించుకోవచ్చు అని చెబుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా భద్రత బలగాలు మావోయిస్టులపై జరుపుతున్న కాల్పులతో సమాజానికి ఏమైనా మేలు జరుగుతుందా అనేది ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలన్నారు. అమాయక్కులైన ఆదివాసీలను కూడా అరెస్టు చేయటం దారుణమన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సంసిద్ధతను వ్యక్తం చేసినప్పటికీ వారిని చుట్టుముట్టి కాల్చి చంపడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం ఏపీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అపారమైన ఖనిజ సంపద ఉన్న అడవులను అదానీ, అంబానీలకు అప్పగించే లక్ష ్యంతోనే మోదీ ప్రభుత్వం ఆరేషన్ కగార్ చేపట్టిందని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎదురుకాల్పుల పేరుతో మావోయిజాన్ని అంతం చేయాలనుకోవడం పాలకుల భ్రమ అని అన్నారు. 2026, మార్చి 31కి మావోయిస్టు లను రూపుమాపుతామని అమిత్ షా చెప్పడం మోదీ ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు నిదర్శనం అన్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ హిద్మాపై కేసులు ఉంటే కోర్టులో ప్రవేశపెట్టి విచారణ జరపాలి తప్ప క్రూరంగా చంపకూడదన్నారు. దేశానికి రాజ్యాంగం ఉంది చట్టాలు ఉన్నాయి వాటిని వదిలిపెట్టి మార్చి 31 లోపు మావోయిస్టుని అంతం చేస్తామని చెప్పడం దుర్మార్గమైన నిర్ణయం అన్నారు. సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడలో పట్టపగలు సజీవంగా నిర్బంధించి సాంకేతికంగా అడవుల్లో కాల్చిచంపినా సారాంశంలో మాత్రం విజయవాడలోనే ఎన్కౌంటర్లు జరిగినట్లు భావించాలని అన్నారు. ఈ సమావేశంలో ఇటీవలన జరిగిన ఎన్‌కౌంటర్ లపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఒక తీర్మానాన్ని దోనెపూడి శంకర్ ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు చిలుకా చంద్ర శేఖర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి.హరినాథ్ గారు, ఎం.సి.పి.ఐ వెంకట్ రెడ్డి గారు, ఎస్.యు.సి.ఐ లలిత గారు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు, రామకృష్ణ, ఆర్ఎస్పి జానకి రాములు రెడ్ ఫ్లాగ్ నుండి మరీదు ప్రసాద్ బాబు తదితర నేతలు ప్రసంగించారు. తొలుత సిపిఐ నాయకులు లంకా దుర్గారావు వక్తలను వేదిక మీదకు ఆహ్వానించారు. ఆంధ్ర ప్రజానాట్య మండలి కళాకారులు చంద్ర నాయక్, ఆర్.పిచ్చయ్య, శర్మ, నజీర్ అమరులపై గీతాలు ఆలపించారు. సభ ప్రారంభంలో అమరులను స్మరిస్తూ రెండు నిముషాలు అందరూ మౌనం పాటించి జోహార్లు అర్పించారు.

# కోవూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తా

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**కోవూరు (నెల్లూరు), నవంబర్ 23, ప్రభాతవార్త :** నిరు పేదల ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యూనివర్సల్ హెల్త్ పాలసీ" అనే విన్నూత్న పథకానికి శ్రీకారం చుట్టబోతున్నారన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆమె శంఖుస్థాపన చేస్సారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సందర్భంగా శిథిలావస్థకు చేరిన ఇనమడుగు పి హెచ్ సి గురించి స్థానిక నాయకులు తన దృష్టికి తెచ్చారని తాను ఎమ్మెల్యే కాగానే నియోజక వర్గంలో ప్రజలకు వైద్య సదుపాయాల గురించి తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిని సందర్శించానన్నారు. నూతన భవన నిర్మాణానికి సంబంధించి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపి ప్రత్యేక చొరవ తీసుకొని



భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వారి ద్వారా హాస్పిటల్ నిర్మాణానికి 1 కోటి 98 లక్షల సిఎస్ఆర్ ఫండ్స్ మంజూరు చేయించారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో 24 గంటల డాక్టర్లు అందుబాటులో వుండేలా జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని వేదికపై వున్న జిల్లా వైద్యాధికారికి ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య అందివ్వాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని 18 నెలల కూటమి పాలనలో కోవూరు నియోజకవర్గంలో అనారోగ్య పీడితులకు దాదాపు 6కోట్లు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేసారు. కోవూరు నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం దిశగా తాను చేస్తున్న కృషిని ఆమె ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, స్థానిక వైద్యాధికారి నిరంజన్, ఎంపీడీఓ శ్రీహరి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ కొల్లారెడ్డి సునీల్ రెడ్డి, వైస్ సర్పంచ్ చేజర్ల మహేష్, తెలుగుదేశం సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జెట్టి మదన్ రెడ్డి, నల్లపరెడ్డి సురేష్ రెడ్డి, స్థానిక నాయకులు తోట వెంకటేశ్వర్లు రెడ్డి చింతలపూడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో 3,59,733 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా

## పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టీవీ సతీష్ కుమార్

**విజయవాడ,నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ సీజన్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో ఈ సంవత్సరం మొత్తం 3,59,733 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టీవీ సతీష్ కుమార్ తెలిపారు. అందులో సుమారు 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం, జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 150 రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ద్వారా నేరుగా రైతుల నుండి మద్దతు ధర వద్ద కొనుగోలు చేయనుంది. మరియు అధనముగా 50,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయుటకు కూడా పౌరసరఫరాల ప్రధాన కార్యాలయము వారు సిద్ధముగా ఉన్నారు జిల్లాలో100 శాతం ఈక్రాప్ నమోదు పూర్తి చేశారు. రైతు సేవా కేంద్రాలు అక్టోబర్ 17వ తేదీ నుండి ప్యాడీ కొనుగోలు కార్యకలాపాలు ప్రారంభించాయి. ధాన్యం సంచుల సరఫరా చర్యల్లో భాగంగా, తిరువూరు డివిజన్‌లో 6,48,600 సంచులు, విజయవాడ డివిజన్‌లో 2,79,200 సంచులు, నందిగామ డివిజన్‌లో 1,40,000 సంచులు, మొత్తంగా 10,67,800 గోనె సంచులు రైతులకు అందుబాటులో ఉంచడం అయినది. రైతులు తమ ధాన్యాన్ని సమీప రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి విక్రయించి, మద్దతు ధర సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. అలాగే, ధాన్యం తేమ ప్రమాణాలు పాటించేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కూడాసూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 1179 జిపిఎస్ కలిగిన వాహనములు కూడా ధాన్యము రవాణాకు అందుబాటులో ఉన్నవి. ఇప్పటి వరకు జిల్లా స్థాయి నందు 13,000 మెట్రిక్ టన్నుల ధాన్యమును, 72 ధాన్యము కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరిగినది. అందులో తిరువూరు డివిజన్ నందు 42 ఆర్. ఎస్. కే లా ద్వారా . నందిగామ నందు 16 ఆర్. ఎస్. కే లా ద్వారా మరియు విజయవాడ నందు 16 ఆర్. ఎస్. కే లా ద్వారా కొనుగోలు చేయడం అయినది.



# హాకీ స్కూల్ గేమ్స్‌లో సెమీస్‌కు చేరుకున్న జట్లు

## గుంటూరు, ఈస్ట్ గోదావరి ,కడప, అనంతపురం బాలికలు

## వైజాగ్, ఈస్ట్ గోదావరి, కడప, అనంతపురం బాలురు

**చంద్రగిరి, నవంబర్ 23 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి హాకీ స్కూల్ గేమ్స్ బాలికల విభాగంలో గుంటూరు, ఈ స్ట్ గోదావరి, కడప, అనంతపురం, బాలుర విభాగంలో వైజాగ్, ఈస్ట్ గోదావరి, కడప, అనంతపురం జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో 14 ఏళ్లలోపు బాలురు, బాలికల విభాగాలకు 15 మ్యాచ్‌లు వంతున నిర్వహించారు. ఇందులో లీగ్ పోటీలు 4 గ్రూపులుగా విభజించి గ్రూప్ విన్నర్స్, రన్నర్స్ బాలికలు 8 జట్లు, బాలుర 8 జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ దశలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్ బాలుర విభాగం ఫలితాలు ఇలా వున్నాయి. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో విశాఖపట్నం-వెస్ట్ గోదావరి తలపడగా 4/3 స్కోర్‌తో విశాఖపట్నం విజయం సాధించింది. రెండవ క్వార్టర్ ఫైనల్స్‌లో కర్నూల్-ఈస్ట్ గోదావరి పోటీ పడగా ఈస్ట్ గోదావరి 4/0 స్కోర్‌తో ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకున్నది. మూడవ క్వార్టర్ ఫైనల్స్‌లో కడప-నెల్లూరు జట్ల మధ్యలో జరిగిన పోరాటంలో కడప 5/0 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో అనంతపురం-శ్రీకాకుళం పోటీలో 2/1 స్కోర్‌తో అనంతపురం విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో గుంటూరు-విశాఖపట్నం తలపడగా 1/0 స్కోర్‌తో గుంటూరు విజయం సాధించింది. రెండవ క్వార్టర్ ఫైనల్స్‌లో కృష్ణా-ఈస్ట్ గోదావరి జట్ల పోటీపడగా 8/0 స్కోర్‌తో ఈస్ట్ గోదావరి దిమ్మతిరిగే ఘనవిజయం దక్కించుకున్నది. మూడవ క్వార్టర్ ఫైనల్స్‌లో కడప-నెల్లూరు మధ్యన జరిగిన పోరాటంలో కడప 9/0 స్కోర్‌తో ఏకపక్ష విజయం సాధించింది. నాలుగవ క్వార్టర్ ఫైనల్స్‌లో అనంతపురం -కర్నూలు మధ్య జరిగిన పోటీలో 7/0 స్కోర్‌తో అనంతపురం ఘన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీలు కిషోర్, భార్గవదేవి, అబ్జర్వర్స్‌గా థామస్, ఆర్.కె.సెల్వ పాండియన్, స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి టి.కేశవయ్య, హరికృష్ణ, కిరణ్‌కుమార్, ప్రభాకర్, జేమ్స్, చంద్రశేఖర్, శ్రీనివాసులు ఆచ్చారి, పీఈటీలు, కోచ్ మేనేజర్లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

**నేడు సెమీ ఫైనల్స్‌లో తలపడనున్న జట్లు:** బాలుర విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్‌లో విశాఖపట్నం-ఈస్ట్ గోదావరి జట్లు, రెండవ సెమీ ఫైనల్స్‌లో కడప-అనంతపురం జట్లు మధ్యన జరగనున్నాయి. అదేవిధంగా బాలికల విభాగంలో మొదటి సెమీ ఫైనల్స్ కడప-విశాఖపట్నం జట్లు మధ్యన, రెండవ సెమీఫైనల్స్ ఈస్ట్ గోదావరి-అనంతపురం జట్ల నడుమ పోటీలు జరుగుతాయి.

# డ్రగ్స్ వద్దు.. సైకిల్ తొక్కు 'బ్రో'

## విజయవాడలో ఈగల్ సైకిల్ ర్యాలీ

## పాల్గొన్న డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,నవంబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈగల్ సంస్థ స్థాపించబడిందని ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. "డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో "అనే నినాదం తో విజయవాడ లో అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి సాగు నియంత్రణలోకి వచ్చిందని, కానీ వినియోగం ఇంకా కొనసాగుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం ఆపేందుకు సమాజం కూడా ముందుకు రావాలని కోరారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉందని, డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి కోరారు. డ్రగ్స్ వల్ల జాతీయ సంపదకు నష్టం, యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు తెలిపారు. డ్రగ్స్ అంతం కొరకై ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉంటూ డ్రగ్స్ నిర్మూలన క్రమంలో పోలీసు శాఖతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను చాటుతూ ప్రజా చైతన్యం కోసం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రచారం చేస్తున్నాం అని తెలిపారు. ఈ క్రమంలోనే సైకిల్ ర్యాలీని విజయవాడలో నిర్వహిస్తున్నాం అని తెలిపారు. ఎవరికైనా డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా"డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో" నినాదాన్ని అందించి సైకిల్ ర్యాలీలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈగల్ ఐజీపీఆకే.రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈగల్‌ను ఏర్పాటు చేసి డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కట్టుబడి ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 869 హాట్‌స్పాట్లు గుర్తించి, అక్కడ నిఘా పెంచినట్లు తెలిపారు. 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపి లో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించడం జరిగిందని తెలిపారు. డ్రోన్ సర్వేలెన్స్, శాటిలైట్ అడ్మిషన్, కార్గన్ అండ్ సెర్చ్, అవగాహన కార్యక్రమాల ద్వారా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈగల్ కెనైన్ డాగ్ స్క్వాడ్ ద్వారా ముఖ్య ఆపరేషన్లు చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, చట్టవిరుద్ధ ఔషధాల పైన కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ చర్యల వల్ల విద్యాసంస్థల 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకాన్ని నిషేధించామని చెప్పారు. విద్యాసంస్థల సరిహద్దుల్లో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 14-15 కోట్ల రూపాయల ఆస్తులు జప్తు చేసినట్లు తెలిపారు.



ఆదివారం విజయవాడలో డ్రగ్స్ వద్దుబ్రో సైకిల్ యాత్రలో డీజీపి హరీష్‌కుమార్ గుప్తా,ఈగల్,ఈగల్ ఐజీపీఆకే.రవికృష్ణ,ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు,డీసీపీ సరిత తదితరులు

చట్టం ప్రకారం 1200 మందికి 1-2 సంవత్సరాల శిక్షలు విధించబడ్డాయని తెలిపారు. విద్యార్థులకు ఇచ్చిన ఉదాహరణ: విశాఖపట్నం జైలులో ఒక విద్యార్థి 68 కిలోల గంజాయి కేసులో 10 ఏళ్ల శిక్ష అనుభవిస్తున్న ఘటనను వివరించారు. డ్రగ్స్ మన జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తాయనే స్పష్టమైన హెచ్చరిక ఇది అని వివరించారు.

విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం ద్వారా డ్రగ్స్ పై యుద్ధం ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో 43 డ్రోన్స్, 10,000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేరాలపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, మాట్లాడుతూ ఈగల్ విభాగం నేతృత్వంలో ఎన్టీఆర్ జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న సైకిల్ ర్యాలీ ఎంతో ప్రాముఖ్యత కలిగినదని తెలిపారు.విజయవాడ డీసీపీ సరిత,మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు వ్యవస్థలో ప్రత్యేకంగా ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ర్యాలీ విజయవంతంగా 10 కిలోమీటర్ల దూరం నిర్వహించగా రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్, సైకిల్ క్లబ్, స్కూల్/కాలేజ్ విద్యార్థులు, పార్కర్ యూత్ ఎంపవరింగ్ టీమ్, సీఎస్ డీఅడిక్షన్ సెంటర్, విద్యార్థులు, ప్రజలు, స్థానిక పోలీసులు పెద్ద సంఖ్య లో పాల్గొని"డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాలతో విజయవంతం చేసినారు. చివరగా పలు ప్రదేశాలకు సైకిల్ ర్యాలి గా వెళ్ళి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేసారు.

# మాతృభాషే మనిషికి ప్రాణం

## అక్షరాలు ప్రజలను జాగృతం చేయాలి

## జాతీయ సాహిత్య, సాంస్కృతిక ఉత్సవంలో వక్తలు

**విజయవాడ,నవంబరు23,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాష మనిషిలోని భావోద్వేగాలను కచ్చితంగా వ్యక్తీకరిస్తుందని పలువురు వక్తలు అన్నారు.సామాజిక అవసరాలను గుర్తించి,వాటిని అందిపుచ్చుకునే దిశలో సాహిత్యం,సాంస్కృతిక, కళా మాధ్యమాలు పనిచేయాలని వారు అభిప్రాయపడ్డారు.భావ వ్యక్తీకరణకు వక్రీకరించే రీతిలో సామాజిక మాధ్యమాలు ఉంటున్నాయన్నారు. అక్షరాలను కేవలం సాహిత్య సృజనకు వినియోగిస్తే సరిపోదని,ఓ జాగృతాన్ని తీసుకుని వచ్చే దిశలో వాటిని వినియోగించాలన్నారు.మన సంస్కృతిని ప్రతిబింబిప చేసే ప్రతి కళారూపాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. వ్యంగ్య చిత్రాలు(కార్టూన్లు) నవ్విస్తూ, వ్యవస్థ బాధ్యతను గుర్తింప చేస్తాయన్నారు. కవులు,కళాకారులు,చిత్రకారులు సామాజిక సంస్కరణల బాధ్యతను తమ భుజాలపై యోయవలసిన అవసరం ఉందన్నారు. కళా, సాహిత్య,సాంస్కృతిక రంగాలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలన్నారు.ఇది అత్యంత అవసరమన్నారు.రూ.వందల కోట్లు పెట్టి గ్రంథాలయాలు నిర్మించడం మంచి నిర్ణయమైనప్పటికి, గ్రంథ రచయితల నుంచి పుస్తకాలు కొనుగోలు చేయాలన్నారు.ప్రభుత్వం ఇచ్చే పురస్కారాలకు కచ్చితంగా మార్గదర్శకాలు ఉండాలన్నారు. కవిత్వం,కథలు మూస పద్ధతి నుంచి బయట పడాలన్నారు. భాగవతం. పద్యశతకాలు అలౌకికాంశాన్ని ప్రతీకగా చేసుకుని లౌకికంశాలను వెలుగులోకి తెచ్చాయన్నారు. సామాజిక రుగ్మతలపై పోరుసాగించాయన్నారు. లౌకిక దృక్పథంతో అలౌకిక రచనలను నేటితరం చదవాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టర్ జి,లక్ష్మీశ ప్రోత్సాహంతో కోహన్స్.ఏపీ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో మల్లెతీగ సాహిత్య,సాంస్కృతిక సేవాసంస్థ విజయవాడ తుమ్మలపల్లివారి క్షేత్రయ్యలో గత రెండురోజులుగా జాతీయ సాహిత్య,సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఆదివారం రెండవ రోజు కార్యక్రమాలు పలు అంశాలపై సదస్సులు నిర్వహించారు. సాహిత్య ప్రముఖులు పాపినేని శివశంకర్,బీరం సుందరరావు,చల్లపల్లి స్వరూపరాణి,బిక్కి కృష్ణ.జల్ది విద్యాధర్‌రావు. సత్యార్ధి కొమ్మవరపు విల్సన్‌రావు,పాతూరి అన్నపూర్ణ,దుట్టా శమంతక మణి,బండ్ల మాధవరావు.,రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ,జీవీ పూర్ణచంద్,శ్రీరామకవచం సాగర్ ,రావిరంగారావు తదితరులు ప్రసంగించారు. ముగింపు కార్యక్రమంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాతృభాష ప్రాముఖ్యతను వివరించారు. గజల్స్ పాడి అలరించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు,.కళాకారులు.నర్తకులను మల్లెతీగ సాహిత్య,సాంస్కృతిక సమితి అధ్యక్షుడు కలిమిశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సత్కరించారు.చివరి రోజు కార్యక్రమంలో పలు నృత్యరూపకాలు,లఘునాటికలు,ఏకపాత్రాభినయాలు, గేయాలాపనలు జరిగాయి.

# క్రెడిట్, డెబిట్‌కార్డుల క్లోనింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి

## వినియోగదారులకు సైబర్‌క్రైం పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కొత్త తరహా సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో క్రెడిట్, డెబిట్ కార్డుల క్లోనింగ్ విషయంలో వినియోగ దారులు జాగ్రత్తగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు. అసలు కార్డులకు నకిలీ కార్డులను తయారు చేసి వాటి ద్వారా వినియోగదారుడికి తెలియకుండానే వారి బ్యాంకు ఖాతాల నుంచి నగదు తస్కరించడం, ఇతర అవసరాలకు వాటిని వాడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని సైబర్ క్రైం పోలీసు, సైబర్ క్రైం పోర్టల్ వెలుగులోకి తెచ్చింది. క్రెడిట్, డెబిట్ కార్డులను క్లోనింగ్ చేసే ముఠాలు దేశ వ్యాప్తంగా కొ ంత కాలంగా మళ్లీ కార్యకలాపాలను పెంచినట్లు పోలీసుల పరిశీలనలో తేలింది. స్కిమ్మింగ్, ఆన్‌లైన్ స్కాం లేదా మాల్వేర్ ద్వారా క్రెడిట్, డెబిట్ కార్డులలోని సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు మొదట ఒక పద్ధతి ప్రకారం దొంగిలిస్తున్నారని, ఇందుకోసం ఎటిఎం కేంద్రాలను స్థావరాలుగా వాడుకుం టున్నారని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు.

ఎటిఎం కేంద్రాల వద్ద పిన్‌లను గుర్తించే చిన్నపాటి యంత్రాలను రహస్యంగా అమర్చి వాటి ద్వా రా అక్కడికి వచ్చే వినియోగదారుల క్రెడిట్, డెబిట్ కార్డుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు వారు తెలిపారు. దీంతో పాటు రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకులఉ, బార్ అండ్ రెస్టారెంట్ల వద్ద అక్కడి సిబ్బంది సహకారంతో రెండుసి సార్లు క్రెడిట్, డెబిట్ కార్డులను వాడడం ద్వారా సమాచారాన్ని దొంగిలిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇలా దొంగిలించిన సమాచారాన్ని మరో కార్డులో వుంచి వాటిని నకిలీ కార్డుగా తయారు చేస్తున్నారని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. దీంతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డుల నుంచి అయస్కాంత చారల డేటాను సైబర్ నేరగాళ్లు స్కి మ్మర్స్ అనే పిలువబడే ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగిస్తున్నారని సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. వీటితో పాటు చిన్నపాటి సిసి కెమెరాలను ఎ టిఎంలతో పాటు పెట్రోల్ బంకులు, మాల్స్ వద్ద రహస్య ప్రాంతంలో వుంచి వీటి ద్వారా క్రెడిట్, డెబిట్ కార్డుల పిన్ నంబర్లను తస్కరిస్తూ అనం తరం వాటితో క్లోనింగ్ కార్డులను తయారు చేస్తున్నారని పోలీసుల పరిశీలనలో తేలింది. ఈ తరహా నేరాల నివారణకు వినియోగదారులు తమ క్రెడి ట్, డెబిట్ కార్డులను వాడే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు. పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్ సహా ఇతర చోట్ల క్రెడిట్, డెబిట్ కార్డులను వాడే సమయంలో ఇతరులకు ఇవ్వవద్దని తామే స్వయంగా ఉపయోగించాలని పోలీసులు చెబుతున్నారు. ఒకవేళ ఎక్కడైనా అనుమానం వస్తే వెంటనే కార్డులను బ్లాక్ చేసి, సంబంధిత బ్యాంకులకు ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరుతున్నారు. ఒకవేళ అప్పటికే నేరగాళ్లు క్రెడిట్, డెబిట్ కార్డులను వాడి మోసాలకు పాల్పడి వుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

# ఎర్రకోట బ్లాస్ట్‌లో సంచలన అంశాలు వెలుగులోకి

## రూ.26 లక్షల నిధుల ఖర్చులోనే వివాదాలు

**న్యూఢిల్లీ, నవంబరు 23:** ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనకు సంబంధించిరోజురోజుకూ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడికి పాల్పడిన వైట్ కాలర్ ఉగ్రవాద ముఠా సభ్యుల మధ్య సిద్ధాంత పరమైన, ఆర్థిక విభేదాలు ఉన్నాయని తేలింది.ఈ పేలుడులో 13 మంది మర ణించగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. పేలుడు పదార్థాలున్న హ్యుందాయ్ ఐ20 కారును నడిపిన కశ్మీరీ డాక్టర్ ఉమర్‌ఉన్‌నబీకి, అతని సహచరులకు మధ్య ఐసిస్, అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థల భావజాలం విషయంలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఉమర్ ఐసిస్ సిద్ధాంతాలను అనుసరించగా, అదీల్ అహ్మద్ రథేర్ వంటి ఇతర నిందితులు అల్‌ఖైదాను నమ్మారు. ఈ విభేదాల కారణంగానే ఈ ఏడాది జరిగిన అదీల్ పెళ్లికి కూడా ఉమర్ హాజరుకాలేదని తెలుస్తోంది. అంతేకాకుండా దాడి కోసం సమీకరించిన రూ. 26 లక్షల నిధుల విషయంలోనూ వారి మధ్య గొడవలు జరిగాయి. ఈ నిధులకు లెక్కలు చెప్పాలని అడగడంతో ఉమర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ మొత్తంలో అదీల్ రూ. 8 లక్షలు, షాహీన్ సయీద్, ముజమ్మిల్ షకీల్ చెరో రూ. 5 లక్షలు, పరారీలో ఉన్న ముజఫర్ అహ్మద్ రథేర్ రూ. 6 లక్షలు సమకూర్చగా, ఉమర్ వాటా కేవలం రూ. 2 లక్షలు మాత్రమే. పేలుడుకు ముందు రోజే తన సహచరులు షాహీన్, ముజమ్మిల్ అరెస్ట్ కావడంతో ఉమర్ తీవ్రంగా కలవరపడ్డాడు. తొలుత ఎర్రకోట పార్కింగ్‌లో కారును పేల్చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, సోమవారం కావడంతో అక్కడ జనం లేకపోవడం గమనించాడు. మూడు గంటల పాటు వేచి చూసి, చివరకు బయటకు వచ్చి ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారును పేల్చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు కొన్ని గంటల ముందే జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ వైట్ కాలర్ ఉగ్రవాద ముఠాను ఛేదించి, 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.



# రేపు చెన్నైలో ఎబిపి సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో కెటిఆర్ ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 23:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించనున్న ప్రతిష్టాత్మక సదరన్ రైజింగ్ సమ్మిట్ 2025లో ప్రసంగించనున్నారు. ఈ సదస్సు ఈనెల25న చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళాలో జరగనుంది. దక్షిణ భారతదేశ భవిష్యత్తును తీర్చి దిద్దుతున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక పరిణామాలపై తమ అభిప్రా యాలను ఈ సదస్సులో కేటీఆర్ పంచుకోనున్నారు.సదరన్ రైజింగ్ సమ్మిట్ మూడో ఎడిషన్ ఈసారి 'భవిష్యత్తుకు సిద్ధం: ఆవిష్కరణ, పరి వర్తన, స్ఫూర్తి' అనే ఇతివృత్తంతో ఈ సదస్సు జరగనుంది. ఆర్థికవృద్ధి, ఆరో గ్యం, విద్య, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాల్లో దక్షి ణ రాష్ట్రాలు ఈ విధంగా ముందుకు సాగుతున్నాయో అంశంపై చర్చించడానికి ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమలు, పౌర సమాజానికి చెందిన ప్రముఖులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది.

# తెలంగాణ మంత్రులు, మీడియా గ్రూపుల వాట్సాప్ హ్యాక్

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు బరితెగించారు. తెలంగాణలోని పలువురు మంత్రులు, మీడియా గ్రూపుల వాట్సాప్ హ్యాక్ అయ్యాయి. ఎస్‌బిఐ కేవేసి పేరుతో ఏపీకే ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు ఇతరులకు షేర్ చేస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, మంత్రులు, జర్న లిస్టులకు ఎస్‌బిఐ పేరుతో సందేశాలు వస్తుండడంతో దీనిపై ప్రభుత్వ ఐటి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయ ం నుంచి చోటుచేసుకున్న ఈ పరిణామాలు సర్కారీ విభాగాల్లో కలకలం రేపా యి. ఈ ఫిర్యాదుపై వెంటనే రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు మంత్రులు, మీడియా గ్రూపుల వాట్సాప్ హ్యాక్ అయినట్లు నిర్ధారించి ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయరాదని కోరారు. ఇదంతా సైబర్ నేరగాళ్లు చేసిన గోల్‌మాల్ వ్యవహారంగా సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఎస్‌బిఐ ఆదార్ అప్‌డేట్ పేరుతో హ్యాకర్లు ఏపీకే ఫైల్స్‌ను పంపి, వాటిని ఎవరైనా ఓపెన్ చేస్తే వెంటనే సంబంధిత వ్యక్తుల ఫోన్‌ను తమ నియంత్రణలోకి తీసుకుంటారని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఒకసారి సైబర్ నేర గాళ్ల నియంత్రణలోకి మన ఫోన్ వెళితే ఫోన్‌తో లింకు వున్న బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని వారు హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా పలువురు మంత్రులు, మీడియా గ్రూపులు, మంత్రుల అధికారిక గ్రూపులు, వారి పిఆర్‌ఓ ల గ్రూపులను పక్కా పథకం ప్రకారం హ్యాక్ చేసి నట్లు సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైం పోలీసులు ఐటి నిపుణులతో కలిసి సురక్షిత చర్యలు చేబట్టి హ్యాక్ అయిన మంత్రుల గ్రూపులను భద్రంగా వుండేలా చేశారు. మంత్రులు, మీడియా గ్రూపుల వాట్సాప్ హ్యాక్ చేసిన సైబర్‌నేరగాళ్ల కోసం ఆరా తీస్తున్నారు.

# ఐ బొమ్మ రవిపై ముగిసిన నాలుగో రోజు కస్టడీ విచారణ

## నేడు జైలుకు తరలింపు

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అనేక భాషల సినిమాలు, ఓటిటి కంటెంట్లను పైరసీ చేసి, బెట్టింగ్ యాప్‌లతో జతకట్టి కోట్ల రూపాయలు సంపాదించిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి నాలుగవ రోజు కస్టడీ ఆదివారం ముగిసింది. కోర్టు ఆదేశాలతో రవిని ఐదు రోజుల కస్టడీ విచారణ కోసం గురువారం నాడు సిసిఎస్ పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ఈ విచారణ సోమవారంతో ముగియనుం డడం విదితమే. కాగా నాలుగవ రోజు విచారణలో రవి గోల్‌మాల్ వ్యాపారంలో విదేశాల్లో జరిగిన లావాదేవీలతో పాటు అక్కడ ఇతనితో పనిచేసిన వ్యక్తులు, బెట్టింగ్ యాప్‌ల యజమానుల గురించి పోలీసులు ఆరా తీశారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు ఏ విధంగా తమకు అను కూలంగా మలచుకున్నారు...? సినిమాలను భారత్ సహా ఏ ఏ దేశాల నుంచి డౌన్‌లోడ్ చేసుకునేవాడు...? ఏ ఏ వెబ్‌సైట్లలోకి అప్‌లోడ్ చేసే వా డు...? ఇందుకు అనుసరించిన పద్ధతులు ఏమిటీ...? ఈ క్రమంలో విదేశాల్లో రవికి సంపాదించిన స్థిర చరాస్తుల విలువ ఎంత...? వీటికి ఆయా దేశాలలో రక్షణగా ఎవరున్నారు...? ఈ నేపథ్యంలో ఆయా దేశాలలో ఇతని నెట్‌వర్క్ ఏ ఏ ప్రాంతాలకు విస్తరించి వుంది...? ఇందులో ఎంత మంది వున్నారు..? వంటి అంశాలను సిసిఎస్ అధికారులు రవి నుంచి అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లో వున్న సమయంలో రవి వాడిన సర్వర్ల ఐపిలను తరచూ మార్చినట్లు పోలీసుల పరిశీలనలో వెలుగు చూసింది. వీటి గురించి రవి సరైన సమాధానం చెప్పక పోవడంతో ఎథికల్ హ్యాకర్ల స హాయం తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. రవి చెల్లి బ్యాంకు ఖాతాకు అతని స్నేహితుడుగా వున్న నిఖిల్ పలుమార్లు నగదు పంపినట్లు తేలడంతో దీనిపై ఆరా తీశారు. ఈ కేసులో నిఖిల్‌ను విచారించాలని పోలీసులు నిర్ణయించారు. శనివారం విచారణలో సిటీ కొత్వాల్ సజ్జన్నార్ పాల్గొని, రవిని కొన్ని ప్రశ్నలు అడగడం తెలిసిందే. కాగా నాలుగవ రోజు విచారణ కూడా ఆరు గంటల పాటు సాగింది. రవి కస్టడీ విచారణ సోమవారంతో ముగియనుండడంతో అతన్ని సాయంత్రం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించాల్సి వుంది. అనంతరం రవి కస్టడీలో వెల్లడించిన విషయాల ను పోలీసులు కోర్టుకు సమర్పించాల్సి వుంది.

# సృజనాత్మక వికాసానికి నాగార్జున నాయకత్వం వహించాలి

## తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్ జూబ్లీహిల్స్, నవంబరు 23, ప్రభాతవార్త:** తెలంగాణ సృజనాత్మక వికాసానికి నాగార్జున నాయకత్వం వహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అన్నపూర్ణ ఫిల్మ్ అండ్ మీడియా కళాశాలను సంద ర్శించిన ఆయన అక్కడ విద్యార్థులు రూపొందించిన పలు చిత్రాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1970లలో ప్రాథమిక సదు పాయాలు కూడా లేనిసమయంలో నటుడు అక్కినేని నాగేశ్వరరావు అన్న పూర్ణ స్టూడియోస్‌ను స్థాపించారని, అది నేటి హైదరాబాద్‌కు అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక-సినిమాటిక్ కేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. ఈ వారసత్వాన్ని ప్రపంచస్థాయి సినీవిద్య ద్వారా ముందుకుతీసుకెళ్తున్న అక్కినేని నాగార్జున, అమలను ఆయన అభినందించారు.

# జనం చెంతకు రెవెన్యూలోని మార్పులు

## జిపిఓఎ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సభ

**హైదరాబాద్ (చిక్కడపల్లి) నవంబరు 23, ప్రభాతవార్త:** రెవెన్యూ వ్యవస్థను బలో పేతం చేస్తూ ఉద్యోగుల సంక్షేమ వైపు దృష్టిని సారించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉద్యోగుల జెఏసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసి యేషన్ తెలంగాణ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా గరికే ఉపేందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికకాగా మహిళా అధ్యక్షు రాలిగా కంది శిరీష రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా అర్జున్ మల్లారం, ఇంజమూరి ఈశ్వర్, సెక్రటరీ జనరల్‌గా వి.లక్ష్మి ్మ నరసింహులు, దాసరి వీరన్న, అసోసియేట్ అధ్యక్షులుగా కారుమూరి చంద్రయ్య, ముధుమ్, జ్యోతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బచ్చలకూర పరమేష్, ప్రతిభ, లచ్చిమళ్ళ నర్సింహారావు, రాచకొండ నాగలక్ష్మి ్మ, కార్యదర్శులుగా కె.ప్రసాద్, బోల్ల శ్రీనివాస్, సునీత, నీరుడు మల్లీశ్వరి, కోటేశ్వర్ రావుతో పాటు కార్యనిర్వాహక కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ మరోవైపు సంఘటితంగా ముందుకు సాగి అందరికీ మేలు జరిగేలా చూడాలనేదే ప్రధాన ఉద్దేశమని అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో జరిగిన మార్పులు చేర్పులతో ప్రజల్లోకి వెడుతున్నామని, ఎవరైనా పనిచేస్తే ఒక ఆదర్శంగా ఉండాలనే భావనతో మనం తీసుకునే నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. నూతన అధ్యక్షుడు గరిగె ఉపేందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే ఉద్యోగులకు సంబందించిన సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని

# తెలంగాణలో 5.2 శాతానికి తగ్గిన విద్యుత్ వినియోగం

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** మారిన ఉష్ణోగ్రతలతో విద్యుత్ వినియోగం భారీగా తగ్గింది. చలి తీవ్రత పెరగడంతో దేశ వ్యాప్తంగా విద్యు త్‌కు డిమాండ్ 5.2 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. సగటు ఉష్ణోగ్రతలు 25.6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోగా, గత ఏడాది ఇదే సమయానికి 27.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోద య్యాయి. దీంతో గరిష్ట విద్యుత్ వినియోగం కూడా 210 గిగావాట్లకు పడిపోయింది. కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం గత ఏడాది ఇదే కాలానికి 219 గిగావాట్లుగా విద్యుత్ వినియోగం రికార్డయింది. ముఖ్యంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడింది. నేషనల్ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్‌ఎఫ్) 57.5 శాతానికి పడిపోయింది. ఇది నాలుగు సంవత్సరాల కనిష్ట స్థాయిని సూచిస్తోంది. విద్యుత్ ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉన్న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) పిఎల్‌ఎఫ్ గత సంవత్సరం 78.1 శాతం ఉండగా, ఇప్పుడదని 68 శాతానికి పడిపోయింది. అయితే డిమాండ్ తగ్గినప్పటికీ దేశ విద్యుత్ ఉత్పత్తిలో ఎటీపీసీ వాటా దాదాపు 70 శాతంగా కొనసాగింది. ఇక విద్యుత్ మార్కెట్లలో దీని ప్రభావం చూపుతోంది. ధరలు కిలోవాట్ పర్ అవర్‌కు 2.2 రూపాయల వద్ద తక్కువగా ఉంది. సౌరశక్తి గంటల సరఫరా కూడా పెరుగుతూ కిలోవాట్ పర్ అవర్‌కు 3.2 శాతానికి తగ్గాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఇది కిలోవాట్ పర్ అవర్ 4.7 రూపాయలుగా ఉంది. ఇదే సమ యంలో కొనుగోళ్లు తగ్గడంతో భారత్ ఎనర్జీ ఎక్స్చేంజ్ (ఐఇఎక్స్) మొత్తం విద్యుత్ పరిమాణం 16 శాతం పెరిగింది. రియల్ టైమ్ మార్కెట్ లావాదేవీల్లో 47 శాతం పెరుగుదలకు దారి తీసిం ది. ఇక థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. జాతీయ బొగ్గునిల్వ 15.3 రోజులకు సరిపడా ఉంది. గత ఏడాది ఇది 12.1గా ఉంది. విద్యుత్ ప్లాంట్ జాబితా చూస్తే 47 మిలియన్ టన్నుల వద్ద ఉంది.

# క్రమశిక్షణరాహిత్య డ్రైవింగ్‌కు ఎన్‌హెచ్-44పై ఇక కాలంచెల్లు!

### స్పీడ్‌గన్నులు..కెమెరా కన్నులు

### రహదారిపై 493 కెమెరాలు

### ఏర్పాటుకు దిమ్మెల నిర్మాణం

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలో అత్యంత పొడవైన 44వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ లక్ష్యంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతి 20కిమీ ఒక స్పీడ్ గన్ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నది. శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు 4112 కి.మీ నిడివితో ఉండే ఈ రోడ్డును గతంలో నేషనల్‌హైవే సెవెన్‌గా వ్యవహరించేవారు. దేశం ఈ చివర నుంచి ఆచివర వరకు అనుసంధానం చేసే ఈ రోడ్డునిత్యం రక్తమోడుతున్నది. అతివేగం ప్రమాదాలకు దారి తీస్తుండటంతో కొత్త కెమెరాలు ఏర్పాటుతో ఎన్‌హెచ్ఏఐ ద్వారా పోలీసు జరిమానా వేయనున్నారు. ఇప్పటి వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కెమెరాల ద్వారానే చలానాలను విధించారు. ఉంతే వాహనదారులు కూడా నిర్ణీత వేగంతో వెళ్లే అవకాశం ఉంది. తెలంగాణలో 20కిమీ ఒక స్పీడ్ గన్నుతో పాటు ప్రతి కి.మీ వరకు ఒకటి చొప్పున అత్యాధునిక కెమెరాలను ఏర్పాటు చేసేందుకు జాతీయ ప్రాధికార సంస్థ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణలో 492.85కిమీ నిడివితో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మొదలై ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా వరకు ఈ రోడ్డు ఉంటుంది. అత్యంత వేగంగా వెళ్తున్న వాహనాల కారణంగా జీవిల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ప్రమాదభరితంగా అతివేగంతో వాహనాలు నడిపేవారికి అపరాధ రుసుము వేయడానికి ఎన్‌హెచ్ఏఐ బిగించే 246 స్పీడ్‌గన్నులు సహాయపడతాయి.స్పీడ్ గన్నునుంచి తప్పించుకోవడానికి కొంత మంది నంబర్‌ప్లేట్ కనపడకుండా చేస్తూ రహదారి నియమాలు ఉల్లంఘిస్తున్నారని పోలీసులు నేషనల్‌హైవే అథారిటీ గుర్తించింది. ఇలాంటి వాహనాలను కూడా కట్టడి చేయడానికి కి.మీ ఒక అత్యాధునిక కెమెరా చొప్పున 493 కెమెరాలను ఏర్పాటు చేసి ఆ వాహనం డ్రైవ్ చేసే డ్రైవర్ అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను కూడా గుర్తించే విధంగా ఏర్పాటు చేసుకొన్నారు. జరిమానాలు తప్పించుకోవడానికి నెంబర్‌ప్లేట్ కనపడకుండా చేసినా వాహనం ఎక్కడికి వెళ్లిందో తెలుసుకోవడం కూడా సాధ్యం చేసేలా కట్టు దిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు.44 ఎన్‌హెచ్ పై కెమెరాలు ఆయా పోలీస్ స్టేషన్‌లకు స్పీడ్‌గన్నులతో పాటు అనుసంధానం చేయబోతున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు రూ.180కోట్ల విలువ గలిగిన కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఎన్ హెచ్‌పై స్పీడ్‌గన్నుల కోసందిమ్మెల నిర్మాణం కూడా చేపట్టింది. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. 44ఏర్పాటు చేయనున్న కెమెరాలను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుసంధానం చేస్తుండటంతో ఇక నెంబర్‌ప్లేట్ దాచుకొని అతివేగంగా వెళ్లడానికి ఇక వీలు ఉండదు. రోడ్డు నిబంధనలను అనుసరించి వాహనాల వేగం నియంత్రించుకోవాల్సిన విధంగా హైసెక్యూరిటీ బోర్డులు కూడా ఎన్‌హెచ్ఏఐ ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉందని నిత్యం ఆరోడ్డుపై ప్రయాణికులు అంటున్నారు. అతివేగంతో వెళ్లే వాహనాలు,రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, బెదిరింపులు వంటి నేరాలు చోటుచేసుకున్న సమయంలో పోలీసులకు కూడా నేరపరిశోధనకే కాకుండా నేరాల నియంత్రణకు ఉపయోగపడే అవకాశం ఉంది.

## సిఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికిన ఎపి మంత్రి దుర్గేష్

**పుట్టపర్తి, నవంబరు 23, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తి విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మంత్రి కందుల దుర్గేష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవోపేతంగా పుట్టపర్తి లోని హిల్ వ్యూ ఆడిటోరియంలో నిర్వహించిన బాబా శతజయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ప్రపంచ మానవాళికి సత్య సాయి బాబా బోధించిన ప్రవచనాలను, ఆయన గత స్మృతులను స్మరించుకున్నారు. బాబా సూచించిన ఆధ్యాత్మికత, శాంతి సందేశాలను, సామాజిక సేవలను గుర్తు చేసుకున్నారు. తాను ఈ శతజయంతి ఉత్సవంలో భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. సేవకు ప్రతిరూపంగా భగవాన్ శ్రీ సత్య సాయి బాబాను అభివర్ణించారు. ప్రపంచ శాంతికి పాటు పడదామని పిలుపునిచ్చారు.ఈ శతజయంతి వేడుకలకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలో సభ్యుడైన మంత్రి కందుల దుర్గేష్ గత నాలుగు రోజులుగా ఉత్సవ ఏర్పాట్లను దగ్గరుండి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం తనకు కేటాయించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన భట్టి విక్రమార్క దంపతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 23:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ నెల 26 జరగనున్న తన కుమారుడు సూర్య ఎంగేజ్మెంట్‌కి రావాల్సిందిగా ఆహ్వానించారు.

## 35వ జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు

### వచ్చే నెల 14న రాష్ట్రపతి చేతుల మీదగా ప్రదానం

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** ఇంధన ఆదాను సాధించిన రాష్ట్రాలకు కేంద్రం అవార్డులు ఇవ్వనుంది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా డిసెంబరు 14న ఈ అవార్డులను ప్రదానం చేయనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. దీనికి సంబంధించి బీఈఈ డైరెక్టర్ జనరల్ ధీరజ్ కుమార్ శ్రీవాస్తవ్ ఆదివారం ఒక ప్రకటనలో వాటి వివరాలను వెల్లడించారు. ఆయా రాష్ట్రాలు ఇంధన సామర్థ్యంలో అనుసరిస్తున్న విధానాలను గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేసేందుకు సమగ్ర సన్నాహాలను ప్రారంభించింది. ఈమేరకు దేశవ్యాప్తంగా ఇంధనసమర్థవంతమైన సాంకేతికతలు, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడానికి బీఈఈ కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర నియమించబడిన ఏజెన్సీలు (ఎస్డీఏలు) మరియు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలోని వాటా దారులతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తోంది. ఈ అవార్డులు వాటాదారుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంపొందిస్తుంది. ఎక్కువ ఇంధన పొదుపు, స్థిరమైన ఫలితాలను సాధించడానికి వారిని ప్రేరేపిస్తుందని అన్నారు. ఈ అవార్డులకు సంబంధించి అక్టోబరు 15 నుండి దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. ఎన్ఈసీఏ 35వ ఎడిషన్ బహుళ వర్గాలలో ఇంధన పొదుపు, ఆవిష్కరణ, స్థిరత్వంలో అత్యుత్తమ విజయాలను సత్కరిస్తుందని పేర్కొన్నారు. వీటిలో పరిశ్రమలు, రవాణా, భవనాలు, రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచిక ఆధారంగా ఆయా రాష్ట్రాల ఎస్డీఏలు, ఇంధనసమర్థవంతమైన ఉపకరణాలు, ఇంధన సామర్థ్య ఆవిష్కరణలు, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలు మరియు వాటిని ప్రభావితం చేసేవారు ఉంటారన్నారు. ప్రజలకు అవగాహనను రూపొందించడం, ప్రవర్తనా మార్పును నడిపించడంలో వారి పాత్రను గుర్తిస్తుందని చెప్పారు.

## నిమ్స్‌లో యువకుడి అనుమానాస్పద మృతిపై నివేదిక కోరిన జాతీయ గిరిజన కమిషన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 23:** హైదరాబాదులోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) హాస్పిటల్‌లో అక్టోబరు 17న అనుమానాస్పదంగా మరణించిన యువకుడి మృతిపై నివేదికను ఇవ్వాలని జాతీయ ఎస్‌టి కమిషన్ నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 17న స్టోర్ రూమ్‌లో నితిన్ అనే యువకుడి మరణంపై విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం అందించాలని కోరుతూ జాతీయ గిరిజన హక్కుల కమిషన్‌లో నల్లగొండకు చెందిన న్యాయ విద్యార్థి ధనావత్ జగదీష్ నాయక్ ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టి నివేదికను ఇవ్వాలని జాతీయ గిరిజన హక్కుల కమిషన్ .. నిమ్స్ డైరెక్టర్‌తోపాటు హైద రాబాద్ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా యువకుడి మరణంపై విచారణ చేపట్టి రిపోర్టును కమిషన్‌కు సమర్పించాలని నోటీసులో పేర్కొంది.

## ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఎంఎస్ఎస్ పరీక్ష

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** నవంబర్-2025 నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్(ఎన్ఎంఎస్ఎస్) పరీక్ష ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఎక్కడ ఎటువంటి సంఘటనలు జరగలేదని, పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 34,665 మంది హాజరైనట్టు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ పివి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 35960 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. వారిలో 34,665 మంది పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 173 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించినట్టు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ తెలిపారు. త్వరలో ఫలితాలను విడుదల చేయనున్నారు.



బషీర్‌బాగ్ చౌరస్తాలో జిఒ నెంబరు 46 కాపీలను దగ్ధం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, బిసి నాయకులు

## రాజ్యాధికారానికి దూరం చేయొద్దు

### ప్రభుత్వంపై ఆర్.కృష్ణయ్య ధ్వజం

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబరు 46తో బిసిలను పచ్చిగా దగా మోసం చేయడమేనని రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర బిసి జాక్ చైర్మన్ ఆర్.కృష్ణయ్య తీవ్రంగా విరుచు కుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బిసి లోకం ఐక్యంగా రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చి కూలగొట్టడం ఖాయమని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ చౌర స్తాలో ఆయన నేతృత్వంలో అనేకమంది జాక్ నాయకులు జిఒ నెంబరు 46 కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమం బిసి నేతలు నీల వెంకటేష్, సి. రాజేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసిలకు కలిపి 50శాతంలోపు రిజర్వేషన్‌లు కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడం, బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లకు కేవలం 22 శాతం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయించడం బిసిలను నిలువునా మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. బీహార్, జూబ్లీహిల్స్ ఎన్నికల వరకు ఆగిన ప్రభుత్వం ఎన్నికల ఫలితాలు రాగానే నిజస్వరూపం బయటపెట్టిందన్నారు. తక్షణమే జిఒ నెంబరు 46ను ఉపసంహరించుకుని, 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్, అనంతయ్య, నిఖిల్, చిక్కుడు బాలయ్యముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నత్తనడకన యాసంగి

### ఇప్పటి వరకూ 2.61 లక్షల ఎకరాల్లో సాగు

### వరి 8 వేల ఎకరాల్లోనే నాట్లు

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యాసంగి సీజను ప్రారంభమై నెల రోజులు అవుతున్నా సాగు మాత్రం ఇంకా నత్తనడకన సాగుతోంది. ఈ సీజనులో సాధారణ విస్తీర్ణం 68,67,407 ఎకరాలు కాగా, రెండు రోజుల క్రితం వరకూ 3.81 శాతం మేర మాత్రమే 2,61,543 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు.



గత ఏడాది కంటే ఇది దాదాపు లక్ష ఎకరాలు తక్కువ. గత యాసంగి సీజనులో ఇదే సమయానికి 3,42,508 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఈ సీజనులో ప్రధాన పంట వరి 51,48,910 ఎకరాలకు గాను ఇంత వరకూ 0.16 శాతం చొప్పున కేవలం 8,272 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. అయితే మొక్కజొన్నమాత్రం అన్ని పంటల్లో కెల్లా అత్యధికంగా 88,837 ఎకరాల్లో వేశారు. ఇక జొన్న 19,112 ఎకరాల్లోనూ, శెనగలు 55,566 ఎకరాల్లో, మినుములు 6,667 ఎకరాల్లో, వేరుశెనగ 66,128 ఎకరాలు, సన్‌ఫ్లవర్ 1,610 ఎకరాలు, పొగాకు 4,483 ఎకరాల్లో సాగయ్యాయి. ఇక రాష్ట్రంలోనే అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 54,943 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అలాగే కామారెడ్డి జిల్లాలో 36,882 ఎకరాలు, నిజామాబాద్ జిల్లాలో 34,745 ఎకరాలు, వరంగల్ రూరల్ జిల్లాలో 21,070 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 10,280 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 19,769 ఎకరాలు, కొత్తగూడెం జిల్లాలో 8,590 ఎకరాలు, గద్వాల్ జిల్లాలో 11,648 ఎకరాల్లో వివిధ పంటలు వేయడం జరిగింది.

## బిసి రిజర్వేషన్లపై మరో మోసానికి తెర తీసిన కాంగ్రెస్

### మాజీమంత్రి తలసాని

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 23:** బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ మరో మోసానికి తెర లేపిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. తెలంగాణలో కులగణన ఎక్కడా సరిగ్గా జరగలేదన్నారు. కుల గణన సరిగ్గా జరగలేదని మరోసారి చేశారని.. అది కూడా పూర్తి స్థాయిలో జరగలేదని తెలిపారు. డెడికేషన్ కమిషన్ వివరాలు సైతం పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని చెప్పారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు హాజరుకాలేదని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో దాసోజ్ శ్రావణ్‌తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. బీసీ బిల్లు అమలు కాకుండానే రేవంత్ సర్కార్ జీవో తెచ్చిందంటూ మండిపడ్డారు. బీసీల జీవోను కోర్టులో కొట్టేశారని తెలిపారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 46ను విడుదల చేసిందని,అది స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు విరుద్ధంగా ఉందన్నారు.
దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ..రేవంత్ సర్కార్ నమ్మించి.. బీసీలను తడి గుడ్డతో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై ట్రిపుల్ టెస్టు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
డెడికేషన్ కమిషన్ ద్వారా కుల గణన చెయ్యాలి కానీ ఈ ప్రభుత్వం అలా చెయ్య లేదని మండిపడ్డారు. బిల్లులు, ఆర్డినెన్సుల పేరుతో నాటకాలు.. బయట పెయిడ్ బ్యాచ్‌తో పూలాభిషేకాలు చేయడం మీకే చెల్లిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పుడు జీవో 46 తీసుకొచ్చి మరో సారి బీసీలను మోసగిస్తున్నారంటూ దాసోజు శ్రావణ్ కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చలికి వణుకుతున్న హాస్టల్ విద్యార్థులు!

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల అధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతుండటంతో విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. ఆదిలాబాద్, ములుగు లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో అయితే ఉష్ణోగ్రతలు మరీ తక్కువగా నమోదవుతుండటంతో హాస్టల్ పిల్లలు మరీ ఇబ్బందులుపడుతున్నారు. రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్టి, బిసి, మైనారిటీ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులు ఆయా హాస్టల్స్‌లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇప్పుడు కొత్తగా గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్టుగా చలి తోడవ్వడంతో ఇంకా ఇబ్బందిపడాల్సి వస్తోంది. చలికాలం కావడం.. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉంటున్న విద్యార్థులకు కప్పుకోవడానికి దుప్పట్లు లేకపోవడంతో చలికి వణికిపోతున్నారు.
వాస్తవానికి హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు దుప్పట్లను(రగ్గు)లను విద్యా సంవత్సరం ప్రారంభంకాగానే అందజేస్తారు. రగ్గులతోపాటు ప్లేటు, గ్లాసును కూడా విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ప్రతినెలా కాస్మోటిక్ ఛార్జీలను ఇవ్వాలి. కానీ గత కొన్ని నెలలుగా కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో.. విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులకు దుప్పట్లు పంపిణీని చేయకపోవడంతోపాటు హాస్టల్‌లోని కిటికిలకు తలుపులు సైతం లేకపోవడంతో రాత్రిపూట చల్లటిగాలికి విద్యార్థులు వణుకుతూ పడుకోవల్సిన పరిస్థితి నెలకొంది. వీటికి తోడు నాణ్యమైన భోజనం లేకపోవడం, మౌలిక

### కప్పుకోవడానికి రగ్గులు లేవు.. కిటికిలకు తలుపులు లేవు

### ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో ఏజెన్సీ ప్రాంతాల్లో మరీ ఇబ్బందిపడుతున్న పిల్లలు

సదుపాయాలైన మరుగుదొడ్లు లేకపోవడం, ఆర్‌వో ప్లాంట్లు లేకపోవడంతో శుభ్రమైన త్రాగునీరు లభించకపోవడం, పరిసరాలు శుభ్రంగా ఉండకపోవడంతో దోమలు రావడం జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ హాస్టల్స్ 2వేలకు పైగా ఉన్నాయి. అన్ని హాస్టల్స్‌లో కలిపి సుమారు 2 లక్షల మంది విద్యార్థులు ఉంటున్నారు. వాటిలో బిసి హాస్టల్స్ సుమారు 500 వరకు ఉండగా.. 1000 నుంచి 1200 వరకు ఎస్‌సి, ఎస్‌సి హాస్టల్స్ మరో 300 వరకు మైనారిటీ హాస్టల్స్ ఉన్నాయి. హాస్టల్స్‌కి ప్రధానంగా సొంత భవనాలు లేకపోవడం సమస్యగా ఉంది. ఎక్కువ హాస్టల్స్ అద్దెభవనాల్లో ఉండటంతో వాటిని మరమ్మత్తులు సక్రమంగా చేపట్టడం లేదు. భవనాల అద్దెను కూడా ప్రభుత్వం ప్రతినెలా చెల్లించకపోవడంతో.. భవన యజమానులు భవనాల మరమ్మత్తుల గురించి పట్టించుకోవడం లేదు.
దీంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్స్‌లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఉండటం లేదు. ఉదయంపూట మరుగుదొడ్డికి వెళ్లాలంటే విద్యార్థులు లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. బాలికల హాస్టల్స్‌లో మరుగుదొడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.
హాస్టల్స్‌లో కరెంటు సమస్యలు ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా హాస్టల్స్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. హాస్టల్స్ భోజనం కలుషితం కావడంతో విద్యార్థులు ఆసుపత్రి పాలవుతున్న సంఘటనలు రాష్ట్రంలో ఈమధ్య కాలంలో పెరుగుతున్నాయి. తమకు నాణ్యమైన భోజనం పెట్టాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థులు రోడ్డెక్కిన సందర్భాలు ఉన్నాయి.

## బిసిల రాజకీయ నాయకత్వ ఎదుగుదలకు కాంగ్రెస్ కట్టుబాటు

### రాజకీయ ఓనమాలు నేర్పిన గురువు శ్రీనివాస్

### పిసిసి చీఫ్ బి.మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** బిసిల రాజకీయ నాయకత్వ ఎదుగుదలకు కాంగ్రెస్ కట్టుబాటుతో ఉందని, 16 జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులుగా బిసి నేతలకు చోటు కల్పించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం అని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ధర్మపురి సంజయ్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహా దారులు సుద ర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బ్బిన్, గడుగు గంగాధర్, ఆకుల లలితతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ మా గురువు శ్రీనివాస్ నిత్యం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయ ఓనమాలు నేర్పిన వ్యక్తి, ఎలక్షన్‌లో ఓడినప్పుడూ నాకు బాసటగా నిలిచారని కీర్తించారు. కులభిమానం తప్పు కాదు, కానీ కులపిచ్చి ఉండకూడదని కుల సంఘాల నాయకులకు హితవు చెప్పారు.





బిసిలు 56 శాతం ఉన్నారనే విషయాన్ని ఎప్పుడూ మర్చిపోవద్దని ఆయన కోరారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నారని ఆయన పునరుద్ఘాటించారు. బీసీ లు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. జిల్లా అభివృద్ధిని ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపు బిడ్డలను ఉమ్మడి రాష్ట్రంలోనే పిసిసి స్థాయికి చేర్చిందని చరిత్రను గుర్తు చేసుకొన్నారు. మున్నూరు కాపులపై కాంగ్రెస్‌కు అనుబంధం ఎనలేనిదనీ అన్నారు. తాను పిసిసి అధ్యక్షుడిని అవుతానని నా గురువు స్వర్గీయ శ్రీనివాస్ ఓ జర్నలిస్టుతో మాట్లాడుతూ నమ్మకం వ్యక్తం చేసిన మాటలు నన్ను మరింత బాధ్యతతో నడిపిస్తున్నాయనీ తెలిపారు.

## త్వరలో ఐఎఎస్‌ల బదలీ

### ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే మార్పు

### పనితీరు ఆధారంగా ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగ్‌లు

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగంలో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఐఎఎస్ అధికారుల బదిలీ కసరత్తు కొనసాగుతోంది. ఇప్పటికే 32 మంది ఐపీఎస్ లను బదిలీ చేసిన రాష్ట్ర సర్కార్ ఇక ఐఏఎస్ల బదిలీలపై కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పలు జిల్లాల కలెక్టర్లను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలియవచ్చింది. అధికారుల పనితీరు ఆధారంగా బదిలీలు, పోస్టింగ్‌లు ఉండనున్నాయి. దీనికి సంబంధించి బదిలీల దస్త్రం ముఖ్యమంత్రికి వద్దకు చేరినట్లు సమాచారం. ఇంకా కొంత మంది ఒకే చోట సుదీర్ఘకాలం పాటు పని చేస్తున్నారు. తమను ఎప్పటికి అక్కడి నుంచి తప్పిస్తారోనని వారు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించబోతున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ పని తీరు మార్చుకోవాలని పలు సందర్భాల్లో సూచనలు చేస్తూనే వస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులు వేగవంతం అవుతున్నాయి. ఈ క్రమంలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు సమర్థులైన జిల్లా అధికారులను నియమించేందుకు ప్రభుత్వం ఐఏఎస్‌ల బదిలీకి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలుస్తోంది.

## లేబర్ కోడ్స్ దేశాభివృద్ధికి బాటలు

### హార్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 23:** లేబర్ కోడ్స్ దేశాభివృద్ధికి బాటలు: దత్తాత్రేయ లేబర్ కోడ్స్ దేశాభివృద్ధికి బాటలు వేసే సంస్కరణలు.. అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను తీసుకుని రావడం పట్ల ఆయన ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని కార్మిక చట్టాల చరిత్రలో ఇది ఒక గొప్ప సంస్కరణగా నిలిచిందని ఆయన ప్రశంసించారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు ప్రధాన లేబర్ కోడ్స్‌గా రూపొందించడం గొప్ప విషయమని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరళత, పారదర్శకత, సమర్థత, కార్మికుల సంక్షేమం దృష్టా తీసుకున్న కీలక నిర్ణయం అని దత్తాత్రేయ తెలిపారు. లేబర్ కోడ్స్ ద్వారా వచ్చిన కీలక మార్పులతో అందరికీ సాంఘిక భద్రత, అసంఘటిత రంగం, గిగ్ వర్కర్లు, ఫ్లాట్ ఫార్మ్ వర్కర్ల వంటి వర్గాలకు కూడా రక్షణ పొందేలా మారిందని ఆయన వివరించారు. పరిశ్రమలకు సరళీకృత విధానాలు పెట్టుబడులు, ఉత్పత్తి, ఉద్యోగ అవకాశాలు పెరిగేలా వ్యవస్థను రూపొందించారని ఆయన ప్రశంసించారు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం తదితర అంశాలు ఈ కోడ్ ద్వారా మెరుగైన పద్ధతిలో అమలులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. తాను కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా ఉన్న రోజుల్లో ఈ సంస్కరణలకు సిద్ధమయ్యాయని ఆయన తెలిపారు. చట్టాలు కాగితాలపైనే కాకుండా కార్మికుల జీవితాలలో మార్పు తెచ్చేలా అమలు కావాలని ఆయన ఆకాంక్షి ంచారు.

## అప్పుల బాధతో ఇరువురు రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** వ్యవసాయం కలిసిరాక, పెట్టుబడులకై చేసిన అప్పులు తీరే మార్గంలేక రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. తాజాగా రాష్ట్రంలో అప్పుల బాధ భరించలేక వేర్వేరు జిల్లాలకు చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనలు రాష్ట్రంలోని భూపాలపల్లి, మెదక్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చింతకుంట రామయ్యపల్లికి చెందిన అబ్బెంగుల రవీందర్ (45)కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఇందులో వరి, పత్తి, మిర్చి సాగు చేశారు. అయితే రెండేండ్లుగా దిగుబడులు సరిగా రాక 6 లక్షల రూపాయలకు పైగా అప్పులయ్యాయి. ఈ అప్పులు తీరే మార్గం లేక మనస్తాపానికి గురైన రవీందర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అలాగే మెదక్ జిల్లా నార్సింగికి చెందిన రైతు ఎర్రముల మధు (40) ఇతర చిన్నిచిన్న పనులు చేసుకోవడమే కాకుండా, తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి మరమ్మతులతోపాటు, వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. పంటలు కలసి రాక ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు.

## రహత్‌నగర్‌లో అభివృద్ధి పనులకు పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ శ్రీకారం

### గ్రామాభివృద్ధి 11 ఎకరాల భూమి విరాళం

**హైదరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధి కోసం నా చివరి శ్వాస వరకు కృషి చేస్తూనే ఉంటానని, గ్రామం మీదుగా వెళ్లే టెంపుల్ కారిడార్ రోడ్డు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో మాట్లాడి రూ.380 కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించారని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం రహత్‌నగర్‌లో మహేష్‌కుమార్‌గౌడ్ పలు అభివృద్ధి పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. భారీ గజమాలతో గ్రామ ప్రజలు పిసిసి అధ్యక్షుడిని సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. స్వగ్రామమైన రహత్‌నగర్ కేంద్రంగా మండలంలో అనేక మంది బాలబాలికలకు నాణ్యత కలిగిన విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ప్రభుత్వాన్ని ఒప్పించానని, అలాగే ఆ పాఠశాల నిర్మాణానికి పది ఎకరాలు, సబ్‌స్టేషన్‌కు ఒక ఎకరం తన స్వంత భూమిని విరాళంగా ఇస్తున్నానని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. గ్రామానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ రాబోతుండటంతో ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు ఉన్నతమైన నాణ్యత కలిగిన విద్య సౌకర్యాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. టెంపుల్ కారిడార్‌ను తన గ్రామం మీదుగా మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మహేష్‌కుమార్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. రహత్‌నగర్‌లోని బాల్యం తీపి గుర్తులను ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. తల్లిదండ్రులు చేసిన సేవల వల్లే తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న దుర్గాదేవి నూతన ఆలయ భూమి పూజలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.



# సమష్టి కృషితో ఉపాధి

ఏవో చిన్న చిన్న పనులు చేయడం. వచ్చిన మొత్తంతో కుటుంబానికి సహాయ పడటంజ ఇదే అక్కడి మహిళల జీవనశైలి. కట్ చేస్తే... ప్రభుత్వ సహాయంతో చిన్న వ్యాపారాన్ని ప్రారంభించి వారు. దీనిద్వారా రోజుకు రూ. 30 వేలు సంపాదిస్తున్నారు. అసలా వ్యాపారం ఏంటి? వాళ్లు ఎవరు? ఎక్కడి వారో తెలుసుకుందాం...

ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ధామా గ్రామం అది.. ఇక్కడి వాళ్లందరివీ రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు. అందుకే మహిళలు కూడా ఏదో ఒక పనిచేస్తూ.. కుటుంబానికి ఆర్థికంగా సహాయపడుతుంటారు. అందులో భాగంగానే స్థానిక మనేశ్వర్ బ్లాక్ ప్రభుత్వ కార్యాలయంలో వంటలు చేసేవారు కొంతమంది. వీరి చేతి భోజనాన్ని తిన్న ఒక వీడియోగ్రాఫర్ 'మీ వంటలు చాలా బాగున్నాయి. ఓ హోటల్ ప్రారంభించొచ్చు కదా' అన్నారు. ఆ మాటలు వారిని ప్రభావితం చేశాయి. అప్పటికే వారంతా స్వయం సహాయక సంఘం సభ్యులు కావడం కూడా కలిసొచ్చింది. అంతా కలిసి రుణానికి అప్లై చేసుకుని, ఆ వచ్చిన మొత్తంతో 'సుభద్ర కేఫ్'ను ప్రారంభించారు. 'పురాతన ఆలయాలకీ, పర్యటక ప్రాంతాలకీ మా ప్రాంతం పెట్టింది పేరు. కానీ సౌకర్యాలు తక్కువ. చుట్టుపక్కల వాళ్లూ, పర్యటకులూ ఆహారం కోసం చాలా ఇబ్బందులు పడుతుంటారు. దాన్ని గమనించే ధామాలో హోటల్ ప్రారంభించాం. అంటారో మహిళా సభ్యురాలు. 'మేం కేఫ్ ప్రారంభించి మూడు నెలలే అవుతోంది. ఇంటి రుచుల్ని తలపించేలా భోజనం అందిస్తున్నాం. అది కూడా తక్కువ ధరకే. చుట్టుపక్కల కాలేజీ విద్యార్థులు కూడా ఇక్కడికి వస్తున్నారు. దాంతో ప్రారంభించిన కొద్ది నెలల్లోనే మంచి ఆదరణను సంపాదించుకున్నాం అంటున్నారు మరో సభ్యురాలు. ఈ కేఫ్‌లో మొత్తం పదిమంది మహిళలు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. శుభ్రత నుంచి వంటలు చేయడం వరకూ ప్రతి పనీ పంచుకుంటున్నారు. వీళ్ల కష్టానికి ప్రతిఫలంగా రోజుకి దాదాపు రూ.30 వేలు దాకా ఆదాయం వస్తోంది. దాంతో ఒక్కో మహిళ నెలకు రూ.20వేలు సంపాదిస్తున్నారట. అవసరం పడితే వీళ్ల భర్తలూ తోచిన సహాయం చేస్తున్నారట. సమష్టిగా కృషి చేసి అనుకున్నది సాధిస్తున్న వీళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ !

# ఈ స్క్రబ్స్‌తో చేతులు కోమలం

ఇంటి పని, వంట పని, గిన్నెలు తోమడం, బట్టలుతకడం.. వంటి రోజువారీ పనుల కారణంగా పదే పదే చేతులు నీళ్లలో నాని మరింత పొడిగా తయారవుతాయి. ఫలితంగా దురద, మంట పుట్టడం, అలర్జీలు.. వంటి సమస్యలొచ్చే అవకాశం ఉంది. మరి, వీటి నుంచి బయటపడాలంటే ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతో స్క్రాబ్స్ తయారుచేసుకొని వాడితే ఫలితం ఉంటుందంటున్నారు సౌందర్య నిపుణులు. మరి, చేతుల్ని తేమగా, కోమలంగా మార్చే ఆ న్యాచురల్ స్క్రాబ్స్ ఏంటో తెలుసుకొని, మనమూ ట్రై చేసేద్దామా..!



టేబుల్ స్పూన్ ఓట్మీల్ పొడి, అర టేబుల్‌స్పూన్ కొబ్బరి నూనె.. ఈ ఉత్పత్తులను బాగా కలుపుకొని చేతులు, మణికట్టుపై మాస్క్ అప్లై చేసుకోవాలి. పావుగంట పాటు అలాగే ఉంచుకొని ఆపై గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే సరిపోతుంది. ఓట్మీల్ చర్మానికి తేమనందించి కోమలంగా మార్చుతుంది. ఈ ప్యాక్ను రోజూ ప్రయత్నించచ్చు. ఓట్మీల్ పొడిని ఇలా కూడా ఉపయోగించవచ్చు. ఒక టొమాటోను రెండు ముక్కలు చేసి.. ఒక ముక్కను ఓట్మీల్ పొడిలో అద్దాలి. దాంతో చేతిపై, మణికట్టుపై పదిహేను నిమిషాల పాటు మర్దన చేయాలి. ఆపై మరో టొమాటో ముక్కను ఇంతకుముందులాగే ఓట్మీల్ పొడిలో ముంచి మరో చేతిపై రుద్దుకోవాలి. తర్వాత చల్లటి నీటితో కడిగేసుకుంటే సరి. రెండు టేబుల్ స్పూన్ల చక్కెరలో ఐదారు చుక్కల విటమిన్ 'ఇ' నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చేతులు, మణికట్టుపై అప్లై చేసి రెండు నిమిషాల పాటు మృదువుగా రుద్దుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. విటమిన్ 'ఇ' డ్యామేజ్ అయిన చర్మాన్ని రిపేర్ చేసి తిరిగి ప్రకాశవంతంగా మార్చుతుంది.



జన్నత్



# వనరుల్ని పరిరక్షణలో యువతకు ఆదర్శం

పిల్లలకి ఆదివారం సెలవొస్తే ఏం చేస్తారు.. ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకోవడం లేదా టివలో ఇష్టమైన కార్టూన్ పెట్టుకుని చూస్తారు. కానీ 14 ఏళ్ల జన్నత్ పట్లూ మాత్రం చేతికి గ్లౌజులు వేసుకుని, భుజానికి వల తగిలించుకుని సరస్సుని శుభ్రం చేయడానికి వెళ్తుంటుంది. ఆమె చేస్తోన్న కృషికిగానూ ప్రధాన మంత్రి మెచ్చుకోలు పొందింది. దాల్ సరస్సుకి గ్రీన్ అంబాసిడర్‌గానూ మారింది.

జన్నత్‌ది శ్రీనగర్. చిన్నప్పటి నుంచీ ఆమెకు తెలిసిన విషయం పర్యావరణ పరిరక్షణే. ఐదేళ్ల వయసు నుంచే జన్నత్ దాల్ సరస్సుని శుభ్రం చేయడానికి వెళ్లేది. ఈ ఆసక్తి తనకి వాళ్ల నాన్న వల్లే వచ్చిందట. కుటుంబ పోషణకోసం జన్నత్ తండ్రి తారిక్ అహ్మద్ దాల్ సరస్సులో బోట్ నడిపేవారు. ఒకరోజు ఒక విదేశీ పర్యటకుడు దాల్ సరస్సులో షికారుకి ఆయన పడవలో వచ్చారట. ఆ సమయంలో నీటిలో తేలుతున్న సిగరెట్ ముక్కను అతడు తొలగించాడు. ఆ దృశ్యం నన్నెంతో కలచివేసింది. ఇతరులు స్వర్గంలా భావించే మన ప్రకృతి వనరుల్ని మనం ఎంత నిర్లక్ష్యం చేసునతన్నామో అప్పుడు నాకర్థమయింది అంటారాయన. అప్పుడే పర్యావరణ పరిరక్షణకి ముందడుగు వేశారట. చిన్నతనంలో వాళ్ల నాన్న వెళ్లడం చూసి ఆయనతోపాటు జన్నత్ కూడా సరస్సులోని ప్లాస్టిక్ వ్యర్థాల్నీ, కలుపు మొక్కల్నీ తొలగించ డానికి వెళ్లేది. 'నా చిన్నప్పుడు సరస్సులో రైనావారి వైపు వెళ్లినప్పుడు ఆ ప్రాంతం మొత్తం ఆక్రమణలు, బురద, ప్లాస్టిక్ వ్యర్థాలతో దుర్వాసన వచ్చేది. ఎన్నోసార్లు శుభ్రం చేస్తేకానీ మామూలు స్థితిని రాలేదు. ఇప్పుడు ఆ ప్రాంతం పర్యటకులతో కళకళలాడుతుంది. 'కశ్మీర్ పర్యటనలో దాల్ సరస్సు చాలా కీలకం. ఇది ఎంతోమందికి ఉపాధిని కల్పిస్తుంది. ఒకప్పుడు ఈ పనులు చేయడంలో నాన్నని అనుకరిస్తూ సాయం చేసేదాన్ని ఇప్పుడు ఇదే నా లక్ష్యం అంటోంది జన్నత్.

**జాతీయ గుర్తింపు ...** దాల్ సరస్సుని శుభ్రం చేయడం, ప్రకృతి వనరుల్ని కాపాడటంలో యువతకు ఆదర్శంగా నిలుస్తున్న జన్నత్ గురించి ప్రధానమంత్రి మన్ కీ బాత్‌లో ఆమెను ప్రశంసించారు. యువత నేతృత్వంలో పర్యావరణ నిర్వహణకు ఆమెను ప్రేరణగా అభివర్ణించారు. అంతేకాదు, తెలంగాణ స్టేట్ బోర్డు మూడోతరగతి పాఠ్య పుస్తకాల్లో 'జన్నత్స్ జీల్' పేరుతో ఆమె సేవలను పాఠంగా ప్రచురించారు. 'ఇవన్నీ నన్ను రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేలా చేస్తున్నాయి. ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా. నాతోపాటు చాలామంది స్వచ్ఛందంగా దీనిలో పాల్గొంటు న్నారు. 'దాల్ లేక్ ఫర్ ది సండే' అనే పేరుతో ప్రచారం చేసి ప్రతి ఆదివారం యువత ఇందులో పాల్గొనేలా చేస్తాం. పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు పడవ నడిపే వారికి చెత్త బుట్టలు పంపిణీ చేస్తాం. ప్రకృతి మన బాధ్యత. దాల్ సరస్సుని ప్రకృతి మనకు ప్రసాదించింది. అది మనకి గర్వం అనే జన్నత్ ఆ సరస్సుకి గ్రీన్ అంబాసిడర్‌గానూ మారింది. అంత చిన్న వయసులో జన్నత్‌కి వచ్చిన ఆలోచన, ఆచరణలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమే కదా!

# మార్గశిర మాసం

ఆది నారాయణుడు సూర్యుడు వృశ్చిక రాశి నుండి ధనురాశిలోనికి ప్రవేశించే సమయం నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో మహావిష్ణువు వద్ద ఆవునేతితో దీపాన్ని వెలిగించి.. విష్ణు సహస్ర నామం, భగవద్గీత పారాయణ చేస్తారో వారికి విష్ణు కటాక్షం లభిస్తుందని విష్ణు పురాణం చెప్తుంది. తెలుగు మాసాల్లో ఒకొక్క మాసం ఒకొక్క విశిష్టతను కలిగి ఉన్నాయి. కార్తీక మాసం తర్వాత మార్గశిర మాసంలో అడుగు పెడతాం.. ఈ నేపథ్యంలో హిందూ సనాతన ధర్మంలో మార్గశిర మాసం ప్రాముఖ్యత విశిష్ట తెలుసుకుందాం.. హేమంత ఋతువులోని మొదటి మాసం మార్గశిరం.. మృగశిర నక్షత్రం.. పూర్ణిమ కలయిక వలన ఈ మాసానికి మార్గశీరమని పేరు. ఈ మాసం గురించి శ్రీకృష్ణ పరమాత్ముడు.. మాసానాం మార్గశీర్షాహం.. మాసాలలో మార్గశిర మాసాన్ని నేనే అని స్వయంగా చెప్పాడు. ఈ మాసంలో చేసే పూజ, హోమం, అభిషేకం, ఇలా ఏ దైవకార్యం చేసినా దానిని స్వయంగా తనే స్వీకరిస్తానని ప్రకటించాడు. శుద్ధ పాడ్యమి నుండి ఈ మాసమంతా శ్రీ మహా విష్ణువుని పూజిస్తారు. ప్రాతః కాలం ఆచరించే స్నానాన్ని మాఘ స్నానాలు అంటారు.



శ్రీ మహా విష్ణువుకి ప్రీతికరమైన ఈ మాసంలో విష్ణు సహస్రనామ పఠనం అనంతకోటి పుణ్య ఫలితాలనందిస్తుంది. గురువారం చేసే పూజలు అత్యంత విశిష్టమైనవిగా పురాణాలు పేర్కొన్నాయి. జ్యోతిష్యాన్ని అనుసరించి ఈ నెలను.. సౌరమాన ప్రకారం ధనుర్మాసమని, చంద్రమానం ప్రకారం మార్గశిర మాసమని అంటారు. ఆధ్యాత్మికంగా కూడా ప్రసిద్ధిగాంచింది. ఆధ్యాత్మికంగా ప్రసిద్ధమైన ఈ మాసంలో ప్రకృతి సౌందర్యాన్ని, శాంతిని సంతరిస్తుంది.

# పల్లీల పకోడి




ఒక కప్పు, బియ్యపు పిండి: పావు కప్పు, శనగపిండి: పావుకప్పు, కారం: ఒక టీస్పూన్, చాట్ మసాలా: అర టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, నిమ్మరసం: ఒక టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారీ విధానం:** ఒక గిన్నెలో పల్లీలు, బియ్యపు పిండి, శనగ పిండి, కారం, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుని పల్లీలకు పిండి బాగా పట్టేలా గట్టిగానే కలుపుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి, వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక పిండితో ఉన్న పల్లీలను విడివిడిగా వేస్తూ దోరగా కాల్చుకుంటే కరకరలాడే పల్లీల పకోడి సిద్ధం.

# స్క్రీన్‌టైమ్ పెరిగితే..

గత రెండు దశాబ్దాలుగా భారత్ బాలికల్లో రుతుచక్రం మొదలయ్యే వయసు తగ్గుతూ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణాలుగా... తీసుకునే ఆహారం, దానితో పాటు జీవనశైలి మార్పులను చెబుతున్నారు. ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తీసుకుంటాం. వాటిలో కొవ్వులూ, కార్బోహైడ్రేట్లూ అధిక మోతాదులో ఉన్నాయి. పైగా వాటిలో నిల్వ వేసేందుకు, రుచి, రంగు కోసం... మోనో సోడియం గ్లుటామేట్, సోడియం నైట్రేట్, కృత్రిమ గులు, గవార్ గం, సోడియం బెంజోయెట్... లాంటి అనేక పదార్థాలను జోడిస్తుంటారు. ఇవన్నీ ఇవిధ రకాలుగా ఆరోగ్యానికి హానిచేసేవే పాటు ఎక్కువ సమయం కదలకుండా స్క్రీన్ సూస్తూ కూర్చొని ఉంటూ ఆటలకు తగినంత సమయం కేటాయించడం లేదు. స్క్రీన్ని ఎక్కువగా వాడటంవల్ల హార్మోన్లలో మార్పులు ఉన్నాయి. ఆహారంలో హార్మోన్లు ఇచ్చి పెంచిన పౌల్ట్రీ తృత్తులు, పాలు... ఇవన్నీ రుతుచక్రం చాలా చిన్న వయసులోనే మొదలయ్యేందుకు సహాయపడుతున్నాయి. కొందరిలో తొమ్మిదేళ్లకే ఇంకొందరిలో అంతకంటే రెండు మూడేళ్ల ముందే శరీరంలో దార్పులు వస్తున్నాయి. వాతావరణ కాలుష్యం కూడా హార్మోన్ల అసమతుల్యతకు రణమవుతున్నాయి. ముడి పదార్థాలతో తాజా ఆహారాన్ని తీసుకోవడం, రోజూ



నంత వ్యాయామం చేసేలా చూడటం వంటి జీవనశైలి మార్పులతో శరీరంలోని ముందస్తు కార్పుల్ని ఆలస్యం చేయొచ్చని నిపుణులు ఎక్కువగా చేస్తారు.

తెర

# చంద్రకళగా అనస్వరాజన్ గ్లింప్స్ రిలీజ్



రోషన్, ప్రదీప్ అద్వైతం, స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, జీ స్టూడియోస్ 'ఛాంపియన్' నుంచి చంద్రకళగా అనస్వర రాజన్ బ్యూటీఫుల్ గ్లింప్స్ రిలీజ్ యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తోఅలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కథల ఎంపికలో,ప్రతిసారీ బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో స్వప్న సినిమాస్ వెరీ స్పెషల్.ఫస్ట్ లుక్‌పోస్టర్లు, టీజర్‌తో సంచలనం సృష్టించిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు క్యారెక్టర్ బేస్డ్ గ్లింప్స్‌ద్వారా సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నారు. టీజర్ ప్రేక్షకులను మైఖేల్ సి విలియమ్స్ వరల్డ్ ని పరిచయం చేయగా, ఫస్ట్ సింగిల్ గిరగిర గింగిరాగిరే ప్రోమో అనస్వర రాజన్ పోషించిన చంద్రకళని అద్భుతంగా ప్రజెంట్ చేసింది.మిక్కీ జె మేయర్ కంపోజ్ చేసిన ఆహ్లాదకరమైన మెలోడీ కట్టిపడేసింది. పూర్తి లిరికల్ సాంగ్ నవంబర్ 25న విడుదల కానుంది .

# అనిల్ రావిపూడి బర్త్‌డేకి మెగా స్టార్ స్పెషల్ గిఫ్ట్



బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడికి ఒక అందమైన వాచ్‌ని గిఫ్ట్‌గా అందించారు. కేక్ కట్ చేసి బర్త్ డే ని సెలబ్రేట్ చేశారు. చిరంజీవి గారు ఇచ్చిన ఈ సర్ప్రైజ్ గిఫ్ట్, మోస్ట్ మెమరబుల్ మూమెంట్స్ గా నిలిచాయి.అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ "మన శంకరవర ప్రసాద్ గారు" తెరకెక్కుతోంది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ 'మీసాల పిల్ల' రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ క్రాస్ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు సినిమా మ్యూజిక్‌కి కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేసింది నెలకొల్పింది.చిరంజీవి తన సిగ్నేచర్ చార్మ్, ఎక్స్ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు.ఈ పాటకు వస్తున్న అద్భుతమైన స్పందనతో సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని తాకుతున్నాయి. సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా 'షైన్ స్క్రీన్స్' గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మిస్తున్న "మన శంకరవర ప్రసాద్ గారు" 2026 సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానుంది.

# హారర్ థ్రిల్లర్ చిత్రం 'విచిత్ర'



రవి రావణ్ రుద్ర ,శ్రీయ తివారి హీరో హీరోయిన్ గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వం లో విడుదలకు సిద్ధంగాఉన్న చిత్రం 'విచిత్ర 'పేక్షకుల హృదయాలను హత్తుకునే అద్భుతమైన ఫ్యామిలీ ఎంటర్టైనర్"విచిత్ర" సెన్సర్ పనులు పూర్తి చేసుకొని ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది..ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ.ఈ సినిమాలోని హీరోగా రవి రావణ్ రుద్ర, హీరోయిన్ శ్రేయ తివారి, జ్యోతి అపూర్వ,'బేబీ' శ్రీ హార్షిణి , రవి ప్రకాష్, సూర్య, ఛత్రపతికి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా నటించారు"విచిత్ర" ఒక ఆత్మీయమైన అమ్మ సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా. ప్రతి కుటుంబం తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఆలోచించేలా చేసే హృదయాన్ని తాకే కథ ఇది. ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి సంతోషంగా ఎంజాయ్ చేస్తూ చూసే ఫ్యామిలీ డ్రామాగా"విచిత్ర" నిలుస్తుందనే నమ్మకంతో మా టీమ్ పనిచేసింది. కథ విషయానికి వస్తే అమ్మ ప్రేమను, భావోద్వేగాన్ని, కుటుంబ విలువలను కొత్త దృక్కోణంలో చూపించబోతున్నము.

ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని త్వరలోనే విచిత్ర మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఈ చిత్రం హృదయాల్లో చిరస్మరణీయమైన ముద్ర వేస్తుందనే ఆశాభావం ఉంది అని దర్శకనిర్మాత సైఫుద్దీన్ మాలిక్ తెలిపారు.

# 'దాషమకాన్' టైటిల్ ప్రోమో విడుదల

హారీష్ కళ్యాణ్



హారీష్ కళ్యాణ్ హీరోగా ఐడీఏఏ ప్రొడక్షన్స్, థింక్ స్టూడియోస్ బ్యానర్స్‌పై వినీత్ వరప్రసాద్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తోన్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్"దాషమకాన్" టైటిల్ ప్రోమో విడుదల వైవిధ్యమైన సినిమాలో ఆకట్టుకుంటోన్న యంగ్ హీరో హారీష్ కళ్యాణ్ కథానాయకుడుగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ "దాషమకాన్'. ఐడీఏఏ ప్రొడక్షన్స్, థింక్ స్టూడియోస్ బ్యానర్స్‌పై ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వినీత్ వరప్రసాద్ స్వీయ దర్శక నిర్మాణంలో రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రాబోతున్న ఈ సినిమా టైటిల్ ప్రోమోను మేకర్స్ శనివార విడుదల చేశారు.టైటిల్ ప్రోమోను గమనిస్తే..

ఊర్లో పేరు మోసిన రౌడీకి చెందిన కిరాయి మనుషులు హీరోని వెతుక్కుంటూ.. ఎలాగైనా చంపాలని ఆయుధాలతో వెంబడిస్తుంటారు. హీరో బాత్రూమ్‌లోకి వెళతాడు. వాళ్లు కూడా ఫాలో అవుతూ వెళతారు. హీరో బాత్రూమ్‌లో ఒకడ్ని వేసేసి తాపీగా బయటకు నడుచుకుని వస్తాడు. హీరో చంపాలనుకున్న విలన్ మనుషులు బిక్క చచ్చిపోతారు.

# నాకెరీర్‌లో గర్వపడే సినిమా: ఉపేంద్ర



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ ఎంటర్‌టైనర్ .ఆంధ్ర కింగ్ తాలూకా'తో అలరించబోతున్నారు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్ స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్ మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది, పాటలు చార్ట్‌బస్టర్‌లుగా మారాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది.

ఈ సందర్భంగా మేకర్స్ వైజాగ్ లో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్ లో రామ్ మైండ్ బ్లోయింగ్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ అందరినీ మెస్మరైజ్ చేసింది. హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ, హాలో వైజాగ్. ఈవెంట్ కి వచ్చినా అందరికీ థాంక్యూ. హోం మినిస్టర్ వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఆంధ్ర కింగ్ తాలూకా ఈ టైటిల్ వినగానే చాలా కనెక్ట్ అయ్యాను. ఎలక్షన్స్ టైంలో మంగళగిరి ఎమ్మెల్యే తాలూకా పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అనేవి చాలా ప్రజాదరణ పొందిన టైటిల్స్. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. మైత్రి మూవీ రవికి నవీన్‌కి అభినందనలు.

డైరెక్టర్ మహేష్ బాబు మాట్లాడుతూ, నేను సినిమా తీయడం హైదరాబాదులో నేర్చుకున్నాను.

నిర్మాత రవి శంకర్ మాట్లాడుతూ,హాలో వైజాగ్. ఇదే వైజాగ్ లో మేం చేసిన రంగస్థలం ఈవెంట్ గుర్తుకొస్తుంది. ఆ ఈవెంట్‌కి చిరంజీవి, నాగబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

# 'దేవర2' కి కొరటాలశివ మ్యూజిక్

ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' సినిమాకు భారీ కలెక్షన్స్ వచ్చాయి. ఈ నేపథ్యంలో సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐతే,'దేవర పార్ట్2' జనవరి ఎండింగ్ నుంచి షూట్ స్టార్ట్ కాబోతుందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే, ఈ సినిమా వచ్చే ఏడాది అక్టోబర్ తర్వాత మొదలు అవుతుందట.ఎన్టీఆర్ కొత్త సినిమాల బిజీ షెడ్యూల్స్ కారణంగా ఈ సినిమా షూట్‌ను పోస్ట్ ఫోన్ చేశారట. ఐతే, ఈ లోపు ఈ సినిమా మ్యూజిక్ పై వర్క్ జరగనుంది. ఈ సినిమా షూట్ లోపు అనిరుధ్‌తో కొరటాల శివ మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చోనున్నాడు. అన్నట్టు కొరటాల శివ 'దేవర పార్ట్ 2'కథలో చాలా మార్పులు చేసి షూట్‌కోసం కసరత్తులుచేస్తున్నారట. ముఖ్యంగా నార్త్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకున్నారట. ఇక ఈమూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటించారు.



సైఫ్‌అలీఖాన్‌విలన్‌పాత్ర పోషించారు. అనిరుధ్ మ్యూజిక్ అందించారు. అలాగే, ఈ చిత్రంలో శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, అజయ్, మురళీ శర్మ ఇతరకీలక పాత్రల్లో నటించారు. మొత్తానికి ఈ సీక్వెల్ పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఆ అంచనాలను ఈ సీక్వెల్ ఏరేంజ్ లో ఆకట్టుకుంటుందో చూడాలి.

# ఐపిఎల్ వేలంలో ఆ ఐదుగురే టార్గెట్



## ఐదుసార్లు ఛాంపియన్ సిఎస్‌కె పర్స్ సిద్ధం

**న్యూఢిల్లీ:** వేలంలో తీవ్ర పోటీకి దారితీసే అవకాశం ఉన్న 5 మంది ఆటగాళ్లపై ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) దృష్టిసారించింది. తమ పర్స్‌లో ఉన్న మొత్తం డబ్బును వారి కోసం ఖర్చు చేయడానికి సిద్ధమైంది. జట్టును బలోపేతం చేయడానికి జట్టు వద్ద గణనీయమైన మొత్తంలో డబ్బుఉంది. వేలంకోసం సిఎస్‌కె వద్ద రూ.43.40 కోట్లు పెద్ద మొత్తం ఉంది. అందువల్ల ఏ ఆటగాళ్లను ఎంచుకుంటుందనేది ఆసక్తి కరమైంది. ఈ వేలంలో తొలి పెద్ద ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్‌ను సొంతం చేసుకోవాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. గత సీజన్‌లో టైటిల్ గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో అతను సభ్యుడు. అయితే టోర్నమెంట్‌లో ఇటీవలి అతడిని విడుదల చేసింది. తమ జట్టులోకి లివింగ్‌స్టోన్‌ను చేర్చుకుంటే సిఎస్‌కె మరో ఆల్ రౌండర్ అవుతాడు. డేవిడ్ మిల్లర్‌పై కూడా చెన్నై కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతోంది. మిల్లర్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తాడు. తన దూకుడు బ్యాటింగ్‌తో మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాడు. లక్నో సూపర్ జెయింట్స్ కూడా వేలానికి ముందే అతన్ని విడుదల చేసింది. మిల్లర్ వేలంలో ఉండటంతో, చాలా జట్లు అతని కోసం వేలం వేసే అవకాశం ఉంది. దీంతో సిఎస్‌కే మిల్లర్‌ను తమ జట్టులోకి చేర్చుకునేందు ప్లాన్ చేస్తోంది.
అభినవ్ మనోహార్ కూడా సూపర్ కింగ్స్ లో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. గత కొన్ని సీజన్లుగా అతను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఈ సమయంలో, అతను తన దూకుడు బ్యాటింగ్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకున్నాడు. ఐపీఎల్‌లో ఇంకా పెద్దగా స్కోర్ చేయకపోయినా, వచ్చే సీజన్ అతనికి ఒక మలుపు కావచ్చు. ఇక ఐపీఎల్‌లో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లలో ఒకరైన గ్లెన్ మాక్స్‌వెల్‌ను పంజాబ్ కింగ్స్ విడుదల చేసింది. సీఎస్‌కే అతని కోసం యత్నం చేస్తోంది. లియామ్ లివింగ్‌స్టోన్ లాంటి ఆల్ రౌండర్ మాక్స్‌వెల్. కానీ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్‌గా అతను జట్టుకు ఉపయోగపడవచ్చు. అయితే, గత రెండు ఐపీఎల్ సీజన్లలో మాక్స్‌వెల్ ప్రదర్శన పెద్ద ఆశాజనకంగా లేదు. ఐపీఎల్ వేలంలో మరో పెద్ద ఆటగాడు ఆండ్రీ రస్సెల్. అతను 10 సంవత్సరాలకు పైగా కోల్‌కతా నైట్ రైడర్స్‌లో భాగంగా ఉన్నాడు. అయితే, జట్టు కోసం అతను అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో తొలిసారిగా కోల్‌కతా అతన్ని విడుదల చేసింది. దీంతో చెన్నై ఆండ్రీ రస్సెల్‌ను తమ జట్టులోకి తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తోంది.

## సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగులు
### ఆట ముగిసే సరికి భారత్ 9 రన్స్

**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో సెనరన్ ముత్తుసామి (206 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 109) శతకంతో చెలరేగగా, మార్కో జాన్సెన్ (91 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లతో 93) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. 247/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికాకు ముత్తుసామి అసాధారణ బ్యాటింగ్‌తో అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. కైల్ వెర్రెన్(122 బంతుల్లో 5 ఫోర్లతో 45)తో కలిసి ఏడో వికెట్‌కు 88 పరుగులు జోడించిన ముత్తుసామి, జాన్సెన్‌తో కలిసి 8వ వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి 6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్‌గా లక్ష్య

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 ఛాంపియన్‌గా లక్ష్య సేన్ నిలిచి భారతదేశపు తొలి సూపర్ 500 టైటిల్‌ను గెలుచుకున్నాడు. సిడ్నీలోని ఒలింపిక్ బౌలేవార్డ్‌లోని క్వేసెంటర్‌లో ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500లో భారత ఏస్ లక్ష్య సేన్ ఈ సంవత్సరం తన తొలి టైటిల్‌ను సాధించాడు. జపాన్‌కు చెందిన యుషా తనకాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అతను ఆధిపత్యం చెలాయించాడు. కేవలం 38 నిమిషాల్లోనే 21-15, 21-11 తేడాతో వరుస గేమ్‌లను గెలుచుకున్నాడు. ఫైనల్‌లో లక్ష్య క్రాస్‌కోర్ట్ షాట్‌లతో ఎక్కువ ర్యాలీలను ఆధిపత్యం చేసి క్లీన్ విజయాన్ని సాధించాడు. మ్యాచ్ మొదటి ఆట మధ్యలో విరామం వరకు చాలా తక్కువ లోపాలతో అధిగమించే ప్రయత్నం చేశాడు. ఇది అతనికి 119తో స్థిరమైన ఆధిక్యాన్ని ఇచ్చింది. మరిన్ని రిస్క్‌లు తీసుకోవడంతో మొదటి గేమ్‌ను 21-15తో సులభంగా గెలవడం ప్రారంభించాడు. రెండవ గేమ్‌లోనూ అతను తన జోరును కొనసాగించి మరింత ఆధిపత్యంతో వరుస గేమ్‌లలో టైటిల్‌ను కైవసం చేసుకునేలా చేశాడు.

## ఆసియా కప్‌లో పాలస్తీనాతో భారత్ డ్రా

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్ 17 ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్ ఓపెనర్‌లో పాలస్తీనాతో భారత్ మ్యాచ్ 1-1 తో డ్రాగా ముగిసింది. అహ్మదాబాద్‌లోని ఇకెఎ అరీనాలో పాలస్తీనాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తన ప్రచారాన్ని డ్రా తో ప్రారంభించింది. భారత్ విరామానికి 1-0 ఆధిక్యంలో ఉంది. పాలస్తీనా జట్టు సమం చేసే ప్రయత్నంలో ముందుకు సాగగా, భారత్ దానికి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేసింది. ప్రత్యామ్నాయ ఆటగాడు అమీర్ జోమా భారత డిఫెండర్ల సమూహాన్ని దాటుకుని షాట్ వేయడంతో గోల్ సాధించి మ్యాచ్‌ను సమం చేసింది.

## టి20 ప్రపంచ కప్ విజేతగా భారత్

**న్యూఢిల్లీ:** భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. మొట్టమొదటి అంధులు టీ20 మహిళా ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. కొలంబోలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించి ఈ ఘనత సాధించింది. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న భారత జట్టు నేపాల్‌ను 114 పరుగులకే కట్టడి చేసిం ది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత జట్టు కేవలం 12 ఓవర్లలోనే 117 పరుగులు చేసి సునాయాసంగా మ్యాచ్‌ను గెలుచుకుంది. కేవలం 10 ఓవర్లలో 100 పరుగుల నుండి, భారతదేశం 13వ ఓవర్లో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా అజేయంగా నిలిచి తొలి ప్రపంచ కప్‌ను దక్కించుకుంది.




## ఐబిపిఎల్‌కు 'హైదరాబాద్ రాయల్స్' రెడీ
### బెన్ న్యూవెల్, మేగన్ ఫడ్జ్, దివ్యాంశు కటారియాతో బలమైన బృందం ఎంపిక



**హైదరాబాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:** ఇండియన్ పికిల్‌బాల్ లీగ్ (ఐబీపీఎల్) 2025 సీజన్ కోసం హైదరాబాద్ రాయల్స్ తమ జట్టును ప్రకటించింది. డేటా ఆధారిత వ్యూహంతో, అంతర్జాతీయ అనుభవం, దేశీయ ప్రతిభ కలగలిసిన ఆటగాళ్లను ఎంపిక చేసుకుంది. అమెరికన్ ప్రొఫెషనల్స్ బెన్ న్యూవెల్, మేగన్ ఫడ్జ్, ఇండియా టాప్ ర్యాంకర్లు దివ్యాంశు కటారియా, స్నేహల్ పాటిల్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లతో హైదరాబాద్ రాయల్స్ టైటిల్ రేసులో ముందుండేలా కనిపిస్తోంది. హైదరాబాద్ రాయల్స్ తొలుత సింగిల్స్, డబుల్స్‌లో సత్తాచాటగల అమెరికన్ బెన్ న్యూవెల్‌ను ఎంచుకుంది. ఆవెంటనే ఏపీపీ ప్రో ఉమెన్స్ డబుల్స్ వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో నంబర్ 1గా ఉన్న మేగన్ ఫడ్జ్‌ను జట్టులోకి తీసుకుంది. అంతర్జాతీయ పికిల్‌బాల్‌లో ఆమెకు ఎంతో మంచి గుర్తింపు ఉంది. ఒత్తిడిలోనూ రాణించగలగడం ఆమె ప్రత్యేకత. భారత ప్లేయర్ల విషయానికి వస్తే పీడబ్ల్యూఆర్ వరల్డ్ నంబర్ 1 దివ్యాంశు కటారియాను ఎంచుకోవడం జట్టుకు పెద్ద బలం. అన్ని ఫార్మాట్లలోనూ అతనిది పైచేయి. అలాగే డబుల్స్‌లో అత్యధికంగా 1000 రేటింగ్ పాయింట్లు కలిగిన స్నేహల్ పాటిల్ రాకతో జట్టు లైనప్ మరింత పటిష్టమైంది. వీరికి తోడుగా నిలకడైన ఆటతీరు ఉన్న తేజస్ గులాటీ, యువ క్రీడాకారిణి శ్రేయ చక్రవర్తిని ఎంపిక చేశారు.టైమ్స్ గ్రూప్, ఇండియన్ పికిల్‌బాల్ అసోసియేషన్ (ఐపీఏ) గుర్తింపుతో జరుగుతున్న ఈ లీగ్ డిసెంబర్ 1 నుంచి 7 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలోని కేడీ జాదవ్ ఇండోర్ హాల్‌లో జరగనుంది. ముంబై స్మాషర్స్, చెన్నై సూపర్ వారియర్స్, క్యాపిటల్ వారియర్స్ గురుగ్రామ్, బెంగళూరు బ్లాస్టర్స్, లక్నో లెపర్డ్స్‌తో పాటు హైదరాబాద్ రాయల్స్ కూడా టైటిల్ కోసం పోటీపడనుంది.

**హైదరాబాద్ రాయల్స్‌జట్టు..**

బెన్ న్యూవెల్ (సూపర్ స్టార్ మేల్‌ఇంటర్నేషనల్), మేగన్ ఫడ్జ (సూపర్ స్టార్ ఫిమేల్ ఇంటర్నేషనల్), దివ్యాంశు కటారియా (సూపర్ స్టార్ మేల్ ఇండియన్), స్నేహల్ పాటిల్ (సూపర్ స్టార్ ఫిమేల్‌ఇండియన్), తేజస్ గులాటీ (రైజింగ్ స్టార్ మేల్), శ్రేయ చక్రవర్తి (రైజింగ్ స్టార్ ఫిమేల్)లు హైదరాబాద్ జట్టుకు ఎంపికయ్యారు.




### టోక్యో డెఫ్లింపిక్స్ షూటింగ్..
# స్వర్ణంతో మెరిసిన అభినవ్
### ఫైనల్‌కు మరో ఇద్దరు భారత్ షూటర్లు

**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్ 2025లో భారత్ షూటర్ అభినవ్ దేశ్వాల్ 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ గోల్డ్ మెడల్ సాధించగా, మరో ఇరువురు ఫైనల్స్‌కు చేరుకున్నారు. జపాన్‌లోని టోక్యోలో ఆదివారం జరిగిన 2025 డెఫ్లింపిక్స్‌లో భారత షూటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు, అభినవ్ భారత్ ఖాతాలో ఆరవ షూటింగ్ స్వర్ణాన్ని సాధించాడు. అతను ఫైనల్‌లో 44/50 హిట్స్ కొట్టి 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. దక్షి ణ కొరియాకు చెందిన లీ సీయుంగ్ హ్వా (43)ను ఒకే ఒక్క హిట్‌తో ఓడించాడు. ఈ ఎడిషన్‌లో అభినవ్‌కు ఇది మూడవ పతకం కాగా,వ్యక్తిగత ఈవెంట్‌లో రెండవది.10 మీటర్లఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అతని రజత పతకం లభించింది. అంతకుముందు అతను క్వాలిఫికేషన్ రౌండ్‌లో 575 పాయింట్లు సాధించి భారతకే చెందిన చేతన్ సప్కల్ (573) కంటే ముందంజలో నిలిచి ప్రపంచ రికార్డును సమం చేశాడు. అయితే, చేతన్ ఫైనల్‌లో పోడియం ఫినిషింగ్ చేయలేకపోయాడు. 27/35 హిట్‌లతో ఐదవ స్థానంలో నిలిచాడు. ఇక ఫైనల్‌కు చేరుకున్న ఇద్దరు భారత రెజ్లర్లు అమిత్ క్రిషన్, సుమిత్ దహియా పురుషుల 86 కిలోలు మరియు 97 కిలోల ఫ్రీస్టైల్ విభాగాలలో స్వర్ణ పోటీలకు చేరుకున్న తర్వాత పతకాలను నిర్ధారించారు. మరోవైపు, ఘన్ శ్యామ్ (125 కిలోలు) ఈ నెల 24న కజకిస్తాన్‌కు చెందిన ఖైరత్‌ఖాన్ షోంకుతో కాంస్య పతకం కోసం పోరాడనున్నాడు. కాగా ఇదే ఈవెంట్‌లో పర్దీప్ మాలిక్ (57 కిలోలు), విజయ్ కుమార్ (65 కిలోలు), అజయ్ కుమార్ (74 కిలోలు) తమ తొలి రౌండ్ బౌట్‌లలో ఓడిపోయి పోటీ నుండి నిష్క్రమించారు.

# తెరపైకి మూడు బీమా కంపెనీల విలీనం!

**న్యూఢిల్లీ,నవంబరు 23:** దేశంలోని మూడు ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను విలీనం చేయాలనే ప్రతిపాదనను కేంద్ర ఆర్థికశాఖ తాజాగా తెరపైకి తెచ్చి ంది.ఈ విలీన ప్రక్రియ పూర్తయితే కొత్త భారీ సాధారణ బీమా కంపెనీ ఏర్పాటు కానుంది. దీంతో ఈ కొత్త కంపెనీ ప్రైవేట్ బీమా కంపెనీల నుంచి పెరుగుతున్న పోటీని సమర్ధవంతంగా ఎదుర్కోగలదని ప్రభుత్వం భావిస్తోంది. గతంలోనే ఈ ప్రతిపాదన వచ్చినా విరమించుకున్న ప్రభుత్వం మళ్లీ విలీన ప్రక్రియను పునరుద్ధరించడం గమనార్హం. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, ఈ మూడు జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలను విలీనం చేసి ఒకే పెద్ద బీమా సంస్థగా మార్చడం ద్వారా ఆపరేటింగ్ సామర్థ్యాన్ని పెంచాలని, వనరుల వినియోగాన్ని మెరుగుపరచాలని, మార్కెట్‌లో వాటి వాటాను బలోపేతం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రైవేట్ రంగ సాధారణ బీమా కంపెనీలు మార్కెట్‌లో వేగంగా వృద్ధి చెందుతుండటంతో ప్రభుత్వ రంగ సంస్థలు తమ మార్కెట్ వాటాను కోల్పోవాల్సి వస్తోంది. విలీనం ద్వారా ఏర్పడే పెద్ద సంస్థ మెరుగైన టెక్నాలజీ, విస్తృత నెట్‌వర్క్, బలమైన మూలధనాన్ని కలిగి ఉండటం వల్ల ప్రైవేట్ పోటీని సమర్థంగా తట్టుకోగలదని కేంద్రం భావిస్తోంది. ఇక రెండోది వనరుల పెంపు. విలీనం ద్వారా ఏర్పడే కొత్త సంస్థను పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) తీసుకురావడం లేదా ప్రభుత్వం తన వాటాను తగ్గించుకోవడం సులభమవుతుంది. ఈప్రక్రియ ఖజానాకు భారీ మొత్తంలో కాసులు తీసుకువస్తుందని అంచనా.



### బీమా కంపెనీల వద్ద అన్‌క్లెయిమ్డ్ సొమ్ము
# రూ.25 వేల కోట్లు

**ముంబయి, నవంబరు 23:** బీమా కంపెనీల వద్ద దాదాపు రూ.25 వేల కోట్ల అన్‌క్లెయిమ్డ్ సొమ్ము ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. సరైన అవగాహన లేకపోవడం, డాక్యుమెంట్లు పోగొట్టుకోవడం వంటి కారణాలతో ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేయకుండా వదిలేస్తున్నారు. బీమా కంపెనీ వినియోగదారుడికి చెల్లించాల్సిన డబ్బులు ఉన్నప్పటికి పలు కారణాలతో సదరు వ్యక్తిని సంప్రదించడంలో కంపెనీలు విఫలమవుతున్నాయి. ఇలా 12 నెలల కంటే ఆ మొత్తం ఉండిపోతే వాటినే అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణిస్తారు. డెట్ క్లెయిమ్‌లు, హెల్త్ బెనిఫిట్ క్లెయిమ్, మెచ్యూరిటీ క్లెయిమ్, సర్వైవల్ బెనిఫిట్స్, సరెండర్ విత్ డ్రా, ప్రీమియం అధికంగా చెల్లించడం వంటి సందర్భాల్లో ఈ డబ్బులు ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద పేరుకుపోతున్నాయి. ప్రతి ఇన్సూరెన్స్ కంపెనీకి ఒక వెబ్‌సైట్ ఉంటుంది. అందులో అన్‌క్లెయిమ్డ్ మొత్తాలకు సంబంధించిన ప్రత్యేక విభాగం ఉంటుంది.దాని ద్వారా పాలసీదారు వివరాలు ఎంటర్ చేసి తెలుసుకోవచ్చు. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ సంస్థ ఐఆర్‌డీఏఐకి చెందిన బీమా భరోసా పోర్టల్ ద్వారానూ తెలుసుకోవచ్చు. ఇందులో అన్ని జీవిత, ఆరోగ్య బీమా కంపెనీలకు సంబంధించిన వెబ్‌సైట్ లింక్స్ ఒకే చోట ఉంటాయి. సంబంధిత బీమా కంపెనీ వద్ద మీ అన్‌క్లెయిమ్డ్ మొత్తాలు ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు సదరు కంపెనీ లింక్ పై క్లిక్ చేయాల్సి ఉంటుంది. దీంతో కంపెనీ వెబ్‌సైట్లోకి వెళ్తారు. అక్కడ పాలసీదారు పేరు, పుట్టిన తేదీ, పాన్ నబర్, పాలసీ నంబర్ వంటి వివరాలు ఇచ్చి తెలుసుకోవచ్చు. కనీసం రెండు ఫీల్డులు పూరించాల్సి ఉంటుంది. ఇచ్చిన వివరాలతో సరిపోలితే వివరాలు కనిపిస్తాయి. కేవైసీ డాక్యుమెంట్లు చూపించి డబ్బులు పొందవచ్చు. పాలసీదారులు, నామినీలు, చట్టబద్ధమైన వారసులు ఎవరైనా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి అన్‌క్లెయిమ్డ్ డబ్బులు పొందవచ్చు. పాలసీ వివరాలు, పాలసీ డాక్యుమెంట్, బ్యాంక్ అకౌంట్, దరఖాస్తుదారు ఫోటో గుర్తింపు కార్డు, బ్యాంక్ అకౌంట్, కేవైసీ డాక్యుమెంట్లు, చిరునామా, క్లెయిమ్ డాక్యుమెంట్లు, పాలసీదారు మరణ ధ్రువీకరణ, హాస్పిటల్ రికార్డుల వంటివి అవసరమవుతాయి. ఒక వేళ అన్‌క్లెయిమ్డ్ మొత్తం ఉందని గుర్తిస్తే సంబంధిత బీమా కంపెనీని సంప్రదించి తెలుసుకోవచ్చు.

## వాణిజ్యం



# టాప్ 7 కంపెనీల్లో రూ.1.28 లక్షల కోట్లు పెరిగిన మార్కెట్ విలువలు!

**న్యూఢిల్లీ, నవంబరు 23:** దేశంలోని టాప్ పది అత్యంత విలువలున్న కంపెనీల విలువలు ఈవారంలో రూ.1.28 లక్షలకోట్లు పెరిగాయి. దేశీయ ఈక్విటీల్లో నెలకొన్న సానుకూల ధోరణులే ఇందుకు కీలకమని తెలుస్తోంది. బిఎస్ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 669.14 పాయింట్లు పెరిగితే నిఫ్టీ కూడా 0.61శాతం జంప్‌చేసింది. కార్పొరేట్ దిగ్గజాల మార్కెట్ విలువలు కూడా అదేస్థాయిలో పెరిగాయి. కేవలం మూడు పెద్దకంపెనీల విలువలు మాత్రమే క్షీణించాయి. గతవారంలో పది కంపెనీల పనితీరునున చూస్తే బ్యాంకింగ్;ఐటి, ఎఫ్ఎంసిజి రంగాల్లో ఇన్వెస్టర్ల బేస్ పెరిగింది. లాభాల్లో ఉన్న సంస్థల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతి ఎయిర్‌టెల్ భారీ లాభపడ్డాయి. ఎయిర్‌టెల్ విలువలు 36,579.01 కోట్లుపెరిగి రూ.12,33,279.85 కోట్లకు పెరిగింది. ఇన్ఫోసిస్ 17,490.03 కోట్లుపెరిగి 6,41,688.83 కోట్లకు చేరితే టిసిఎస్ కూడా 16,299.49 కోట్లుపెరిగి రూ.11,39,715.66 కోట్లకు టర్నోవర్ పెరిగింది. ఇక బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 14,608.22 కోట్లుపెరిగి రూ.15,35,132.56 కోట్లకు చేరింది.ఎస్‌బిఐ 4846.08 కోట్లు పెరిగి 8,97,769.87 కోట్లకు చేరింది ఇక ఎఫ్ఎంసిజిపరంగా హిందూస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువలు 1785.69కోట్లుపెరిగి రూ.5,71,972.75 కోట్లకుచేరింది. ఇక ఎన్‌బిఎఫ్‌సి కంపెనీల్లో బజాజ్‌ఫైనాన్స్ నష్టపోయింది. రూ.8244.79 కోట్లు క్షీణించి రూ.6,25,328.59 కోట్లకు చేరితే ప్రభుత్వరంగజీవితబీమాసంస్థ రూ.4522.38 కోట్లు క్షీణించి రూ.5,70,578.04 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు రూ.1248.08 కోట్లుక్షీణించి మార్కెట్ విలువలురూ.9,79,126.35 కోట్లకు చేరింది. ఇక మొత్తంగాచూస్తే రిలయన్స్ టాప్‌లో నిలిచింది. ఆ తర్వాత వరుసగా హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐబ్యాంకు, ఎస్‌బిఐ, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసి సంస్థలునిలిచాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.